జ్ఞాన సిద్ధాంతం
రూ॥200/-
పేజీలు:210
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సివిల్స్‌లో అగ్నిహోత్రికి ఫస్ట్ ర్యాంక్
కూలిన సుఖోయ్-30 ఎంకెఐ ఫైటర్ జెట్ 05
ఎన్‌సిఇఆర్‌టి చరిత్ర వక్రీకరణలపై దర్యాప్తు అవసరం 06

సంపుటి 09, సంచిక: 97 | శనివారం | 07-03-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# అనాథలను చేయం

హైదరాబాద్ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులను విదేశాలకు పంపాం. ప్రపంచంలోని ఆధునిక నగరాల మాదిరిగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తాం. కొత్త ప్రాజెక్టులు వచ్చినప్పుడు కొంతమందికి ఇబ్బందులు ఉండొచ్చు, అయితే భూమి లేదా ఇళ్లు కోల్పోయే వారిని ప్రభుత్వం ఆదుకుంటుంది. నిర్వాసితులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం.
– సిఎం రేవంత్‌రెడ్డి



- ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయే నిర్వాసితులకు అన్ని సౌకర్యాలతో కూడిన పునరావాసం కల్పిస్తాం
- హైదరాబాద్ నగరం తెలంగాణకు గర్వకారణం
- ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం
- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రాజెక్టుల వల్ల భూములు కోల్పోయే నిర్వాసితులను అనాథలను చేయబోమని, వారికి అన్ని సౌకర్యాలతో కూడిన పునరావాసం కల్పిస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హామీనిచ్చారు. హైదరాబాద్ నగరం కేవలం ఒక నగరం కాదు, అది తెలంగాణ గర్వకారణం. రాజకీయ విమర్శలు పక్కన పెట్టి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని' ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ముందస్తు వేడుకల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం నగర అభివృద్ధికి సంబంధించిన కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. కొత్వాల్‌గూడలో దేశంలోనే ప్రత్యేకత చాటుకునే తరువాయి 2లో

# చమురు సంక్షోభం

## పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా పొంచివున్న ముప్పు

- హార్మోజ్ జలసంధిని మూసివేయడంతో మరింత దిగజారుతున్న పరిస్థితి
- నిలిచిన ముడి చమురు తరలిస్తున్న వందలాది నౌకలు

రష్యా చమురును భారత్ కొనుక్కోవచ్చు
రిఫైనరీలకు అమెరికా నెల రోజుల మినహాయింపు
గతంలో విధించిన అదనపు సుంకాన్ని తాత్కాలికంగా రద్దుచేస్తున్నట్లు ప్రకటన

న్యూయార్క్/ వాషింగ్టన్

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం పొంచి ఉంది. ముఖ్యంగా హార్మోజ్ జలసంధిని మూసివేయడం పరిస్థితిని మరింత దిగజారుస్తున్నది. ముడి చమురు తరలిస్తున్న వందలాది నౌకలు నిలిచిపోయినట్టు సమాచారం. ప్రపంచ చమురు మార్కెట్‌లో ఎక్కువ వాటాగలిగిన గల్ఫ్ దేశాలు కూడా ఇరాన్ యుద్ధ ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాయి. అమెరికా సైనిక స్థావరాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకున్నప్పటికీ, పలు చమురు కంపెనీల కేంద్రాలు కూడా ధ్వంసమవుతున్నాయని సమాచారం. దీనితో ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అదే సమయంలో, సరఫరా కూడా నిలిచిపోవడంతో, దిగుమతి చేసుకుంటున్న దేశాలు చమురు సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి తరువాయి 2లో



## రాజీపడిన వ్యక్తి దోపిడీ ఫలితమిది!

- ఎంతకాలం ఇలా బ్లాక్ మెయిల్ అని ప్రశ్నించిన కాంగ్రెస్
- దేశ స్వావలంబన, సార్వభౌమాధికారంపై ప్రశ్నలు లేవనెత్తుతూ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసిన నాయకులు



**న్యూఢిల్లీ :** భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడానికి అమెరికా 30 రోజుల మినహాయింపు ఇవ్వడంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. దేశ స్వావలంబన, సార్వభౌమాధికారంపై ప్రశ్నలు లేవనెత్తుతూ కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నేతలు నిలదీశారు. అమెరికా అనుమతి లేకుండా భారత్ తన ఇంధన అవసరాల కోసం నిర్ణయాలు తీసుకోలేదా? అని వారు ప్రశ్నించారు. ప్రభుత్వ విదేశాంగ విధానంపై తీవ్ర విమర్శలు చేశారు. దేశ విదేశాంగ విధానం వ్యక్తిగత ప్రయోజనాలపై ఆధారపడకూడదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. భారత విదేశాంగ విధానం దేశ ప్రజల సమష్టి సంకల్పం నుంచి రావాలని పేర్కొన్నారు. మన చరిత్ర, భౌగోళిక పరిస్థితులు, అలాగే సత్యం అహింస వంటి విలువల తరువాయి 2లో

## భారత సార్వభౌమత్వానికి అవమానకరం


భారతీయ రిఫైనర్లకు అమెరికా'మినహాయింపు'పై సిపిఐ ఆక్షేపణ



**న్యూఢిల్లీ :** రష్యన్ చమురు కొనుగోలు కోసం భారతీయ శుద్ధి కర్మాగారాలకు అమెరికా 30 రోజుల 'మినహాయింపు' ప్రకటించడాన్ని వామపక్ష నాయకులు కేంద్రాన్ని ప్రశ్నించారు. అది 'భారతదేశ సార్వభౌమత్వానికి అవమానకరం' అని వారు ఆక్షేపించారు. శుక్రవారం సిపిఐ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు పి. సందోష్ కుమార్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాసిన ఒక లేఖలో భారత విదేశాంగ విధానం అలీనత ప్రాథమిక సూత్రాల నుంచి దూరం జరిగినట్లు కనిపిస్తోందని సందోష్ అన్నారు. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై చేస్తున్న యుద్ధం పశ్చిమాసియాను తరువాయి 2లో



ఇరాన్‌తో చర్చల ప్రసక్తి లేదు. లొంగిపోతే ఆలోచిస్తాం
– డొనాల్డ్ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు



''మధ్యవర్తిత్వం వహిస్తామని పలువురు ప్రతిపాదిస్తున్నారు. కానీ యుద్ధం మొదలుపెట్టిన వాళ్లే చర్చలు ప్రతిపాదించాలి. అంతవరకు యుద్ధం ఆగదు.''
– పెజిష్కియాన్, ఇరాన్ అధ్యక్షుడు



## మృత్యువులోనూ వీడని స్నేహం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం
- కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలో ఘటన

ప్రజాపక్షం/చొప్పదండి

వారిద్దరూ ప్రాణ స్నేహితులు. మరో స్నేహితుని వివాహానికి వెళ్తుండగా వారి మృత్యువు కబళించింది. కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి మండల పరిధిలోని రుక్మాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు చాకుంట ఎక్స్‌రోడ్డు వద్ద సంభవించిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు రుక్మాపూర్ గ్రామానికి చెందిన చిలుక రాజేశం కుమారుడు చిలుక ప్రదీప్ కుమార్ (24), తాటికొండ ఓదెలు కుమారుడు సాయి కిరణ్ (24)లు ఇద్దరు ప్రాణ స్నేహితులు, చొప్పదండి మండల పరిధిలోని చాకుంట గ్రామంలోని తన స్నేహితుని వివాహానికి వీరిద్దరూ కలిసి ద్విచక్రవాహనంపై చాకుంట గ్రామానికి రుక్మాపూర్ తరువాయి 12లో

## ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకం

మాదిగ ఎంప్లాయిస్ కో-ఆర్డినేషన్ కమిటీ అభినందన సభలో సిఎం రేవంత్‌రెడ్డి 03

# 99 రోజులు కార్యాచరణ ప్రణాళిక

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక
99 DAYS ACTION PLAN

## విద్యా వ్యవస్థ మరింత బలోపేతానికి అమలు చేయాలని ప్రభుత్వ నిర్ణయం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరుతో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని నిర్ణయించింది. జూన్ 12 వరకు రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థలు,విద్యాశాఖ కార్యాలయాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని అధికారులకు ప్రభుత్వం శుక్రవారం ఆదేశించింది. ఈ ప్రణాళికలో భాగంగా పాఠశాలల మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యార్థుల నమోదు పెంపు, ప్రభుత్వ విద్యా పథకాలపై అవగాహన కల్పించడం, విద్యా సంస్థల్లో పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడం, అకడమిక్ కార్యకలాపాలను బలోపేతం చేయడం, డిజిటల్ సేవల విస్తరణ లాంటి పలు అంశాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.విద్యారంగంలో సంస్థాగత బలోపేతం, విద్యార్థుల హాజరు పెంపు, విద్యాప్రమాణాల మెరుగుదల కార్యక్రమం ప్రధాన లక్ష్యాలుగా ప్రభుత్వం నిర్ణయించింది. విశ్వవిద్యాలయాల్లో 'అకాడమీక్ ఆడిట్' నిర్వహించనున్నారు. మొదటి దశలో భాగంగా ఈనెల 15 వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 10 రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నారు. ఈ డ్రైవ్‌లో పాఠశాలలు, కళాశాలలు, విద్యాశాఖ కార్యాలయాల్లో శుభ్రత, పారిశుద్ధ్యం, భవనాల సంరక్షణ, రికార్డు నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు, పరిపాలనా వ్యవహారాలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ తెలిపింది. జిల్లా స్థాయిలో కార్యక్రమాల అమలుకు జిల్లా విద్యాధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. పాఠశాలల మౌలిక వసతుల మెరుగుదల, విద్యార్థుల నమోదు పెంపు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, విద్యా ప్రమాణాల పెంపు వంటి అంశాలపై ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. ఇక విద్యార్థుల హాజరు పెంపు, ఉపాధ్యాయుల అకడమిక్ సిద్ధత, పాఠశాలల నిర్వహణలో పారదర్శకత,డిజిటల్ గవర్నెన్స్‌ను బలోపేతం చేయడం లాంటి కార్యక్రమాలను ప్రణాళికలో ప్రధాన లక్ష్యాలుగా ప్రభుత్వం నిర్ణయించింది

నేపాల్‌లో ఎన్నికల ఫలితాల్లో

## దూసుకెళ్తున్న ఆర్‌ఎస్‌పి

- 114 స్థానాల్లో ఆధిక్యం
- బాలేంద్ర షా ఘనవిజయం
- కొత్త పార్టీకే జై కొట్టిన జెన్ జీ





**ఖాట్మండు:** నేపాల్ సార్వత్రిక ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు వెలువడనున్నాయి. ర్యాపర్‌గా కెరీర్ ప్రారంభించి, రాజకీయ నాయకుడిగా ఎదిగిన బాలేంద్ర షా నాయకత్వంలోని రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్‌ఎస్‌పి) భారీ విజయ దిశగా సాగుతున్నట్లు ఎన్నికల లెక్కింపు ఫలితాలు సూచిస్తున్నాయి. నేపాల్‌లో గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన యువత ఆధ్వర్యంలోని తీవ్ర నిరసనల తర్వాత జరిగిన ఇవే మొదటి సార్వత్రిక ఎన్నికలు కావడంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. నాటి నిరసనల ఫలితంగా అప్పటి ప్రధానమంత్రి కెపి శర్మ ఒలి నేతృత్వంలోని ప్రభుత్వం కూలిపోయింది. కాగా, తరువాయి 12లో

## బెంగాల్ సిఎం మమతా బెనర్జీ ధర్నా

ఓటర్ల జాబితాలో ఏకపక్ష తొలగింపులకు వ్యతిరేకంగా నిరసన




**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎస్ఐఆర్ అనంతర ఓటర్ల జాబితాలో ఏకపక్ష తొలగింపులను నిరసిస్తూ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శుక్రవారం శుక్రవారం కోల్‌కతాలో ధర్నా ప్రారంభించనున్నారు. మరో రెండు రోజుల్లో ఎన్నికల కమిషన్ పూర్తి బెంచ్ రాష్ట్రానికి సందర్శనకు రానుండగా ధర్నా చేయడం గమనార్హం. సెంట్రల్ కోల్‌కతాలోని ఎస్‌ప్లానేడ్ మెట్రో ఛానల్ వద్ద మధ్యాహ్నం 2 గంటల నుండి ధర్నా చేయనున్నట్లు టిఎంసి జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఆదివారం ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికలకు నెలల తరువాయి 12లో

16 ఏళ్లలోపు పిల్లలు

## సోషల్ మీడియా వాడకంపై నిషేధం

- కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం
- 13 ఏళ్ళ లోపు పిల్లలు వాడకుండా ఎపిలోనూ నిషేధిస్తాం : సిఎం చంద్రబాబు



**న్యూఢిల్లీ :** పదహారేళ్ల పిల్లలు సోషల్ మీడియా వాడకాన్ని నిషేధిస్తూ కర్ణాటక ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సిఎం సిద్ధరామయ్య కీలక ప్రకటన చేశారు. అసెంబ్లీలో శుక్రవారం బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. త్వరలోనే కర్ణాటకలో 16 ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధించబోతున్నట్లు వెల్లడించారు. పిల్లలపై సోషల్ మీడియా ద్వారా దుష్ప్రభావం పడుతోందని, చదువుపై దృష్టి సారించలేకపోతున్నారని, దీన్ని నివారించడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని తరువాయి 12లో

## రైతు పేరుతో బుకింగ్.. బ్లాక్ మార్కెట్‌కు మళ్లింపు


అక్రమ యూరియా దందాపై ప్రజాప్రతినిధుల మౌనం వెనుక మర్మమేమిటి..?

ప్రజాపక్షం/నిర్మల్



నిర్మల్ జిల్లాలోని లోకేశ్వరం, తానూర్, కుంటాల, కుబీర్, సారంగాపూర్, లక్ష్మణ్‌చందా మండలాలలో యూరియా సరఫరా చుట్టూ అల్లుకున్న అక్రమాల డ్రామా ఇప్పుడు అన్నదాతల పాలిట శాపంగా మారింది. కొందరు స్వార్థపరులైన దుకాణదారులు ఒక్కో కట్టను రూ.290 నుండి రూ.350 వరకు అడ్డగోలుగా అమ్ముకుంటూ అన్నదాతల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నారు. సామాన్య రైతుకు దొరకని యూరియా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే దుకాణదారుల దొడ్లలోకి ఏ దారిలో వస్తుందనే ప్రశ్నలు ఇప్పుడు మండలవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తున్నాయి.

**ఆన్‌లైన్ మాయాజాలం..రైతులకు మిగిలిన 'సున్నా' :** సాధారణ రైతు యూరియా కోసం అష్టకష్టాలు పడుతుంటే, తరువాయి 12లో



## మైనర్లకు సోషల్ నెట్‌వర్క్ నిషిద్ధం

### ఇండోనేషియా ప్రభుత్వ నిర్ణయం

**జకార్తా:** సోషల్ మీడియా ఉపయోగంపై ఇండోనేషియా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో 16 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు సామాజిక మాధ్యమాలను ఉపయోగించకుండా నిషేధించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని ఇండోనేషియా కమ్యూనికేషన్ మరియు డిజిటల్ వ్యవహారాల మంత్రి మెయుత్యా హాఫీద్ ప్రకటించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అనుసరించి, దేశంలో 16ఏళ్ల లోపు పిల్లలకు, అధిక ప్రమాదం ఉన్న డిజిటల్ వేదికలపై వ్యక్తిగత ఖాతాలు ఉండవు. ఈ నిషేధం వర్తించే ప్రధాన సా మాజిక మాధ్యమ వేదికలలో యూట్యూబ్, టిక్‌టాక్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, థ్రెడ్స్, ఎక్స్, బిగో లైవ్, రాబ్‌లాక్స్ ఉన్నాయి. ఈ వేదికలు వినోదం, వీడియోలు, గేమింగ్, సామాజిక సంబంధాలు వంటి అనేక అవకాశాలు కలిగినప్పటికీ, పిల్లల కోసం కొన్ని ప్రమాదాలను కూడా కలిగిస్తాయని ప్ర భుత్వం భావిస్తోంది. అందువల్ల పిల్లల డిజిటల్ భద్రతను పెంచే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నియమం అమలు వెంటనే పూర్తిగా ప్రారంభం కాకుండా దశలవారీగా అమలవుతుంది. ఈ నిషేధ ప్రక్రియ ఈనెల 28 నుండి ప్రారంభమై, అన్ని సామాజిక మాధ్యమ సంస్థలు ప్రభుత్వ నియమాలను పూర్తిగా పాటించే వరకూ కొనసాగుతుంది. అంటే ఈ వేదికలు తమ వ్యవస్థల్లో మార్పులు చేసి చిన్న పిల్లల ఖాతాలను గుర్తించడం, తొలగించడం లేదా నియంత్రించడం వంటి చర్యలు తీసుకోవాలి. పిల్లలు ఎదుర్కొంటున్న డిజిటల్ ప్రమాదాలే ఈ నిర్ణయానికి ప్రధాన కారణం. మంత్రి మెత్యా హాఫీద్ ప్ర కారం పిల్లలు ఆన్‌లైన్ ప్రపంచంలో పలు సమస్యలకు గురవుతున్నారు. ముఖ్యంగా అసభ్య కంటెంట్, సైబర్ బుల్లీయింగ్, ఆన్‌లైన్ మోసాలు, సామాజిక మాధ్యమాలకు బానిసలుగా మారడం వంటి సమస్యలు తీవ్రమవుతున్నాయి. చిన్న వయస్సులోనే ఈ వేదికలను ఎక్కువగా ఉపయోగించడం వల్ల పిల్లల మానసిక ఆరోగ్యం, విద్య, సామాజిక ప్రవర్తనపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉంది. అయితే ఈ నిర్ణయం ప్రారంభంలో కొన్ని సమస్యలు కూడా కలిగించవచ్చని ప్రభుత్వం అంగీకరించింది. చిన్న పిల్లలు తమకు సామాజిక మాధ్యమాలను ఉపయోగించడానికి అనుమతి ఇవ్వకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేయవచ్చు. అదే సమయంలో తల్లిదండ్రులు పిల్లల ప్రశ్నలకు ఎలా సమాధానం చెప్పాలనే సందిగ్ధంలో పడవచ్చు. అయినప్పటికీ దీర్ఘకాలంలో ఇది పిల్లల రక్షణకు ఉపయోగపడుతుందని ప్రభుత్వం విశ్వసిస్తోంది.

## తీవ్రమైన రాజకీయ సంక్షోభం

### పశ్చిమాసియా ప్రాంత పరిస్థితులపై ఐక్యరాజ్య సమితి ప్రకటన

# మానవతా అత్యవసర పరిస్థితి

**న్యూయార్క్:** పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై ఐక్యరాజ్య సమితి (యుఎన్) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పశ్చిమాసియాలో ఇప్పటి వరకూ నెలకొన్న అత్యంత తీవ్రమైన భౌగోళిక రాజకీయ సంక్షోభాలలో ఇది కూడా ఒకటని పేర్కొంది. ఈ పరిస్థితిని 'మానవతా అత్యవసర పరిస్థితి'గా ప్రకటించింది. యుద్ధం కారణంగా భారీ స్థాయిలో ప్రాణనష్టంతోపాటు, ఎంతో మంది నిర్వాసితులుగా మారడం, మౌలిక సదుపాయాల నాశనం వంటి సమస్యలు వేగంగా పెరుగుతున్న తీరును, తీవ్రతను ఈ పదం సూచిస్తుంది. ఈ యుద్ధం జల, వాయు, భూతల దాడులతో యావత్ ప్రపంచాన్ని భయాందోళనలకు గురి చేస్తున్నది. అత్యంత ప్రమాదకరమైన క్షిపణి, డ్రోన్ దాడులు పశ్చిమాసియాను ధ్వంసం చేస్తున్నాయి. ఈ యుద్ధం రాజకీయ వ్యూహాల సమ్మేళనంగా కూడా మారడం గమనార్హం. ప్రస్తుతం ఇరాన్, లెబనాన్‌లోని కీలక ప్రాంతాలపై ఇజ్రాయెల్ వైమానిక దళం భారీ వైమానిక దాడులు చేపడుతోంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని కొన్ని సైనిక లక్ష్యాలు, అలాగే లెబనాన్ రాజధాని బీరూట్‌లోని ప్రాంతాలు దాడులకు గురయ్యాయని ఇజ్రాయెల్ ప్రకటించింది. బీరూట్ నగరంలోని దక్షిణ ఉపనగరం దహియాపై జరిగిన దాడులు సత్ఫలితాలను ఇచ్చినట్టు అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఈ ప్రాంతం ఇరాన్ మద్దతుతో పనిచేస్తున్న హిజ్బొల్లా సాయుధ సంస్థకు ప్రధాన కేంద్రంగా ఉందని అంటున్నారు. ఇరాన్‌కు చెందిన అనేక వైమానిక రక్షణ వ్యవస్థలు, క్షిపణి ప్రయోగ వేదికలు ధ్వంసమయ్యాయని కూడా ఇజ్రాయెల్ పేర్కొంటున్నది. ఇది నిజమైతే, ఇరాన్ గగనతల రక్షణ సామర్థ్యం గణనీయంగా బలహీనపడినట్టు భావించాల్సి ఉంటుంది. కాగా, ఈ యుద్ధంలో అమెరికా పాత్ర కూడా కీలకంగా మారింది. అమెరికా జలాంతర్గామి ఒక ఇరానియన్ యుద్ధనౌకను శ్రీలంక తీరానికి సమీపంలో టార్పెడోతో ముంచివేసింది. ఈ సంఘటన యుద్ధం కేవలం మధ్యప్రాచ్యానికి పరిమితం కాకుండా అంతర్జాతీయ సముద్ర మార్గాలకు కూడా వ్యాపిస్తున్నట్లు స్పష్టం చేస్తున్నది. ఇరాన్ ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తూ ,అస్త్రాలు లేని నౌకపై దాడి జరిగిందని, దీనికి ప్రతీకారం తప్పదని హెచ్చరించింది.



ఈ ఘటనలో భారత్ పేరు కూడా వార్తల్లోకి వచ్చింది. కొన్ని నివేదికలు భారతదేశం అమెరికాకు సహాయం చేసి ఆ ఇరానియన్ నౌకను గుర్తించడంలో ప్రధాన పాత్ర పోషించిందని పేర్కొన్నాయి. అయితే భారత నౌకాదళ అధికారులు ఈ వార్తలను ఖండించారు. భారతదేశం మధ్యప్రాచ్య దేశాలతో వాణిజ్య, ఇంధన సంబంధాలు కలిగి ఉండటంతో ఈ ప్రాంతంలో తటస్థ విధానాన్ని కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.

ఇలావుంటే, అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ కూడా ప్రతీకార చర్యలు ప్రారంభించింది. ఇరాన్ ప్రకారం అమెరికా సైనిక స్థావరాలు ఉన్న కువైట్‌లో డ్రోన్ దాడులు జరిగాయి. ప్రత్యక్షంగా పెద్ద సైనిక బలగాలు పంపకుండా డ్రోన్లు, క్షిపణులు వంటి ఆయుధాలను ఉపయోగించి దూర ప్రాంతాలపై దాడులు చేయడం ద్వారా శత్రువుపై ఇరాన్ ఒత్తిడి పెంచుతుంది. ఇక లెబనాన్‌లో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. హిజ్బొల్లాపై ఇజ్రాయెల్ దాడులను కొనసాగిస్తోంది. ఉత్తర ఇజ్రాయెల్ ప్రాంతాలపై హిజ్బొల్లా దళాలు రాకెట్లు ప్రయోగించే అవకాశం ఉందని ఇజ్రాయెల్ అనుమానిస్తున్నది. అందువల్ల హిజ్బొల్లా సైనిక స్థావరాలు, కార్యాలయాలు, ఆయుధ నిల్వలపై ముందస్తు దాడులు జరుపుతోంది. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం ఇరాన్‌తో నేరుగా జరుగుతున్న యుద్ధం ముగిసినా కూడా లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక చర్యలు కొనసాగవచ్చు.

పశ్చిమాసియా పరిస్థితి ఇలావుంటే, ఐరోపా కూడా ఈ యుద్ధ వల్ల ప్రభావితమవుతుందని అంటున్నారు. గ్రీస్ ప్రభుత్వం ఇప్పటికే బాలిస్టిక్ క్షిపణి దాడుల నుంచి రక్షణ కోసం 'పేట్రియట్ క్షిపణి రక్షణ వ్యవస్థ'ను బల్గేరియాకు అందచేయాలని నిర్ణయించింది. ఇలాంటి నిర్ణయాలు ప్రాంతీయ యుద్ధ వాతావరణాన్ని మరింత తీవ్రతరం చేసే ప్రమాదం ఉంది. అంతర్జాతీయ భద్రతా సమస్యలు కూడా తలెత్తవచ్చు. కాగా, ఆయుధాల ఉత్పత్తి పెంచాలని లాక్‌హీడ్ మార్టిన్, ఆర్‌టిఎక్స్ కార్పొరేషన్ వంటి అతిపెద్ద రక్షణ సంస్థలను అమెరికా కోరుతున్నట్టు సమాచారం. యుద్ధం దీర్ఘకాలం కొనసాగుతుందేమోన్న అనుమానాలకు అమెరికా చర్యలు కారణమవుతున్నాయి. అన్ని విధాలా తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్న పశ్చిమాసియాలో శాంతి స్థాపనకు అంతర్జాతీయ సమాజం పిలుపునిస్తున్నది.

మొత్తం మీద దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియాలో సమస్యలు తీవ్రమవుతున్నాయి. మానవతా సాయం అత్యవసరంగా మారుతున్నది. ఐఎన్ అంచనాల ప్రకారం, లెబనాన్‌లో ఇప్పటికే సుమారు లక్ష మంది ప్రజలు తమ ఇళ్లను విడిచి శరణాలయాలకు వెళ్లాల్సి వచ్చింది. భారీ ఎత్తున ప్రజలు స్థానచలనం చెందడం వల్ల ఆహారం, వైద్యం, తాగునీరు వంటి అవసరాలపై తీవ్రమైన ఒత్తిడి ఏర్పడింది. ఈ పరిస్థితి వల్ల పెద్ద మానవతా విపత్తు తలెత్తుతుందని ఐక్యరాజ్య సమితి హెచ్చరిస్తున్నది. మరోవైపు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ఈ యుద్ధ ప్రభావం చూపుతున్నది. ప్రపంచ చమురు ఉత్పత్తిలో మధ్యప్రాచ్యం కీలక భూమిక పోషిస్తున్నది. యుద్ధం కారణంగా సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. అంతర్జాతీయ అత్యవసర ఏజెన్సీ (ఐఇఏ) ప్రకారం, ప్రస్తుతానికి ప్రపంచ మార్కెట్లో చమురు కొరత లేదు. అయినప్పటికీ రవాణా అంతరాయాలు కొన్ని దేశాలకు సమస్యాత్మకంగా మారవచ్చు. ప్రత్యేకించి, హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో, వందలాది చమురు నౌకలు నిలిచిపోయాయి.

## ఇరాన్‌పై కొనసాగుతున్న దాడులు

**టెహ్రాన్:** అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు కలిసి ఇరాన్‌పై బాంబుదాడులు కొనసాగిస్తున్నాయి. గత శనివారం నుండి ఇప్పటివరకు జరిగిన దాడుల్లో కనీసం 1,230మంది మరణించినట్లు సమాచారం. మరోవైపు లెబనాన్‌లో హిజ్బొల్లాను లక్ష్యంగా చేసుకొని దాడులు కొనసాగసతున్నట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో, లెబనాన్ రాజధాని బీరుట్ నగరంలోని దక్షిణ ప్రాంత నగరాలను పూర్తిగా ఖాళీ చేయాలని ఆదేశించింది. ఆ ప్రాంతంలో లక్షలాది మంది ప్రజలు నివసిస్తున్నారు. భద్రతా కారణాల వల్ల ప్రజలను అక్కడి నుంచి తరలించాలని ఇజ్రాయెల్ పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ, ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖామెనీ హత్యకు గురైన తర్వాత ఆయన స్థానంలో నాయకత్వం వహించేందుకు ఖామెనీ కుమారుడు మొజ్తబా ఖామెనీ రావడం తమకు ఎంతమాత్రం అంగీకారయోగ్యం కాదని చెప్పారు. అంతేకాదు, ఇరాన్‌కు భవిష్యత్తులో ఎవరు నాయకుడు కావాలి అన్న విషయంలో అమెరికా కూడా పాత్ర పోషించాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి మరో ముఖ్య హెచ్చరిక చేశారు. ఇరాన్–ఇరాక్ సరిహద్దు ప్రాంతాల్లో ఉగ్రవాద కార్యకలాపాలు జరిగే అవకాశముందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. భద్రతను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇదే సమయంలో అమెరికా కుర్దిష్ సాయుధ దళాలతో చర్చలు జరుపుతోందని, వారికి ఆయుధాలు అందించి, ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటును ప్రోత్సహించే ప్రయత్నం జరుగుతోందని కూడా వార్తలు వస్తున్నాయి. ఇరాన్‌కు చెందిన సీనియర్ నాయకుడు అలీ లరిజాని మాట్లాడుతూ, అమెరికాతో భూతల పోరాటానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. అమెరికా భూదాడికి దిగితే, అందుకు తగిన రీతిలో సమాధానం చెప్పేందుకు ఇరాన్ ఎదురుచూస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుత పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా చము రు, సహజవాయువు సరఫరాపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా ప్రపంచానికి చా లా ముఖ్యమైన హోర్ముజ్ జలసంధి ద్వారా నౌకాయానం జరిగే మార్గాన్ని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ (ఐఆర్‌జిసి) మూసివేస్తున్నట్లు ప్రకటించడంతో అక్కడి నుంచి వెళ్లే సరుకు నౌకలు ఆ మార్గాన్ని తప్పించుకుంటున్నాయి. దీని వల్ల అంతర్జాతీయ చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది.

## ఇజ్రాయెల్‌పై ఎదురుదాడులు

### ఐఆర్‌జిసి ప్రకటన

**టెహ్రాన్:** ఇజ్రాయెల్‌పై డ్రోన్లు, క్షిపణులతో దాడులు జరుపుతున్నట్టు ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివెల్యూషనరీ కార్ప్స్ (ఐఆర్‌జిసి) తెలిపింది. సంస్థ విడుదల చేసిన ప్రకటనను అనుసరించి, టెల్ అవీవ్‌తోపాటు సెంట్రల్ ఇజ్రాయెలీ ప్రాంతాలపై దాడులు కొనసాగిస్తున్నది. ఈ దాడిలో ఖైబర్ షేకన్ అనే ఆధునిక క్షిపణిని కూడా ఉపయోగించినట్లు సమాచారం. ఖైబర్ షేకన్ అనే పదానికి 'కోటను ధ్వంసం చేసే ఆయుధం' లేదా 'కోటలను ఛేదించే క్షిపణి' అని అర్థం. ఈ క్షిపణి ఇరాన్ రూపొందించిన ఒక కొత్త సాంకేతిక ఆయుధం. ఇది సుమారు 2022 సంవత్సరంలోనే సేవలోకి వచ్చిన ఆధునిక క్షిపణి వ్యవస్థ.ఇందులో క్లస్టర్ మ్యూనిషన్ వార్‌హెడ్ ఉంటుంది. క్షిపణి లక్ష్యానికి దగ్గరగా చేరుకున్నప్పుడు అది పైభాగంలో తెరుచుకుంటుంది. ఆ సమయంలో దాని లోపల ఉన్న చిన్న చిన్న బాంబులు వేగంగా బయటకు వస్తాయి. సాధారణంగా ఒక క్షిపణిలో సుమారు 20 చిన్న బాంబులు ఉంటాయి. ప్రతి చిన్న బాంబులో దాదాపు 2.5 కిలోల పేలుడు పదార్థం ఉంటుంది. ఈ చిన్న బాంబులు పెద్ద ప్రాంతంలో విస్తరించి పడటం వల్ల విస్తృత స్థాయిలో విధ్వంసం జరుగుతుంది. అందుకే క్లస్టర్ మ్యూనిషన్లు యుద్ధంలో చాలా ప్రమాదకరమైన ఆయుధాలుగా పేర్కొంటారు. కాగా, కొన్ని వీడియోల్లో, సెంట్రల్ ఇజ్రాయెల్ ప్రాంతంలో చిన్న బాంబులు గాల్లో పేలి కిందకు పడుతున్నట్లు కనిపించాయి. అయితే ఇప్పటివరకు ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం వెలువడలేదు.

## అనాథలను చేయం

(మొదటి పేజీ తరువాయి)

ఎకోహిల్ పార్కును ప్రారంభించడంతో పాటు, బుద్వేల్ వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న ట్రంపెట్ ఇంటర్‌ఛేంజ్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ కంటే సుందరమైన నగరం దేశంలోనే లేదన్నారు.

**బాగు చేస్తామంటే కొందరు అడ్డుపడుతున్నారు..**

'మంచి ప్రభుత్వం ఉంటే నగరాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లవచ్చు. గతంలో చంద్రబాబు, వైఎస్‌ఆర్ హయాంలో కృష్ణా, గోదావరి నీళ్లు వచ్చాయి. నిజాం నాడు మోక్షగుండం విశ్వేశ్వరయ్యతో మూసీ ప్రక్షాళన చేపట్టారు. కానీ నేడు నగరం ఆక్రమణలు, చెత్తతో నిండిపోయింది. మేము బాగు చేస్తామంటే కొందరు అడ్డుపడుతున్నారు', అని విపక్షాలపై విమర్శలు గుప్పించారు. హైదరాబాద్‌లో ఉస్మానియా ఆస్పత్రి, గోల్కొండ కోట, అసెంబ్లీ వంటి చారిత్రాత్మక కట్టడాలు ఉన్నాయని, కానీ ప్రస్తుతం



నగరం ఆక్రమణలు చెత్త సమస్యలతో ఇబ్బందులు పడుతోందన్నారు. మూసీ నది పునరుద్ధరణ చేపట్టి రివర్‌ఫ్రంట్‌ను అభివృద్ధి చేస్తామని, మూసీ పక్కన నైట్ ఎకానమీ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులను విదేశాలకు పంపామని, ప్రపంచంలోని ఆధునిక నగరాల మాదిరిగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని సిఎం చెప్పారు. కొత్త ప్రాజెక్టులు వచ్చినప్పుడు కొంత మందికి ఇబ్బందులు ఉండొచ్చని, అయితే భూమి లేదా ఇళ్లు కోల్పోయే వారిని ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. నిర్వాసితులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. భవిష్యత్తులో శంషాబాద్ ప్రాంతం బుల్లెట్ ట్రైన్ హబ్‌గా మారుతుందని, బెంగళూరు, అమరావతి, చెన్నై వంటి నగరాలకు అక్కడి నుంచి బుల్లెట్ ట్రైన్ సౌకర్యం వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రపంచ స్థాయి కంపెనీలు హైదరాబాద్‌కు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తామని అన్నారు.

**భవిష్యత్ ప్రణాళికలు – 99 రోజుల 'ప్రజా పాలన'**

రాష్ట్రవ్యాప్తంగా నేటి నుండి 99 రోజుల ప్రత్యేక 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం ప్రారంభమైందని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. జూన్ 2 వరకు సాగే ఈ ఉత్సవాల్లో ప్రతి గ్రామం, వార్డు భాగస్వామ్యం అవుతుందని తెలిపారు. డోనాల్డ్ ట్రంప్, ఎలాన్ మాస్క్ వంటి దిగ్గజాల సంస్థలు హైదరాబాద్‌కు రాబోతున్నాయని వెల్లడించారు. మూసీ ప్రక్షాళన చేసి, నైట్ ఎకానమీ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రూ. 24,500 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రీజినల్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్), ఎలివేటెడ్ కారిడార్లు, రేడియల్ రోడ్ల నిర్మాణం వేగవంతం చేస్తామన్నారు.

**పేదల సంక్షేమం – ఇందిరమ్మ చీరలు**

గత ప్రభుత్వం ఇచ్చిన బతుకమ్మ చీరల నాణ్యతపై సిఎం వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూ, ఈసారి ఆడబిడ్డలకు మెరిసిపోయేలా 'ఇందిరమ్మ చీరలు' అందజేస్తామని చెప్పారు. ఇప్పటికే పేదలకు రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీని ప్రారంభించామని తెలిపారు.

**కొత్త ప్రాజెక్టుల విశేషాలు..**

'85 ఎకరాల్లో విస్తరించిన ఈ పార్కులో ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద పక్షుల అవియరీ ఉంది. 10 లక్షల మొక్కలు, బటర్ ఫ్లై గార్డెన్, ఓపెన్ ఎయిర్ థియేటర్ దీని ప్రత్యేకత. రూ. 488 కోట్లతో, 26 మీటర్ల ఎత్తులో నిర్మించే ఈ ప్రాజెక్టు ఓఆర్‌ఆర్‌కు, బుద్వేల్ లేఅవుట్‌కు కీలక అనుసంధానకర్తగా నిలుస్తుంది' అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతి ప్రాజెక్టును నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌ను ప్రపంచంలోనే గొప్ప నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

## తెలంగాణ రాష్ట్ర మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ఎఐసిసి ప్రధాన కార్యదర్శి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ నియామకం వెంటనే అమలులోకివస్తుందని ఆయన తెలిపారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన ఎర్రబెల్లి స్వర్ణ ఇ ప్పటివరకు టిపిసిసి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. వరంగల్ డిసిసి అధ్యక్ష



పదవితో పాటు జిల్లాలో పలు బాధ్యతలు, పదవులను నిర్వర్తించారు. 2022 ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క నిర్వహించిన పాదయాత్రలలో స్వర్ణ క్రియాశీలకంగా పాల్గొన్నారు. మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమితులైన ఎర్రబెల్లి స్వర్ణ శుక్రవారం గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## సార్వభౌమత్వానికి అవమానకరం

(మొదటి పేజీ తరువాయి)

విస్తృతమైన, ప్రమాదకరమైన సంఘర్షణలోకి నెట్టివేసే ప్రమాదం ఉన్న ప్రస్తుత తరుణంలో భారతదేశ విదేశాంగ విధానం వైఖరి అలీనత, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి, సార్వభౌమత్వాన్ని గౌరవించడం అనే సూత్రాల నుంచి వైదొలగినట్లు భారతదేశ వ్యాప్తంగా అనేకమంది ఆందోళన చెందుతున్నారని సిపిఐ ఎంపి సందోష్ తన లేఖలో తెలిపారు. ఇటీవలి కాలంలో భారతదేశం తన సొంత వ్యూహాత్మక ప్రాధాన్యతలను అనుసరించడం కంటే అమెరికా, ఇజ్రాయెల్ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నట్లు ఎక్కువగా అర్థం అవుతోందని ఎద్దేవా చేశారు. 'భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందాల చుట్టూ జరిగిన చర్చల సమయంలో మన రైతులలో ఎక్కువ మంది అమెరికా నుంచి దిగుమతులకు గురయ్యే అవకాశం కల్పించిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. వైవిధ్యభరితమైన, సరసమైన ఇంధన బాస్కెట్ భారతదేశ జాతీయ ప్రయోజనాలకు స్పష్టంగా ఉపయోగపడుతున్నప్పటికీ రష్యా చమురు కొనుగోళ్లను తగ్గించాలని వత్తిడి చేసినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు సందర్భాలలో పదే పదే ప్రకటనలు చేయడంతో ఈ అవగాహన బలపడింది' అని సందోష్‌కుమార్ తన లేఖలో ప్రస్తావించారు. 'భారతీయ శుద్ధి కర్మాగారాలు రష్యన్ చమురును కొనుగోలు చేయడానికి 30 రోజుల మినహాయింపును ప్రకటించిన అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ చేసిన వ్యాఖ్యలు భారతదేశం వంటి సార్వభౌమాధికార దేశానికి ఎంతగానో అవమానకరం' అని సిపిఐ రాజ్యసభ సభ్యుడు కుమార్ చెప్పారు. స్కాట్ బెస్సెంట్ ప్రకటన మనముందు ఒక ప్రాథమిక ప్రశ్నను లేవనెత్తుతుందని, ఎవరినుంచి మనం ఇంధనం కొనుగోలు చేయాలి? లేదా, ఎవరితో వ్యాపారం చేయాలి? అనేది నిర్ణయించుకోవడానికి భారతదేశాన్ని అమెరికా ఎప్పటి నుంచి అనుమతించడం ప్రారంభించింది? అని సందోష్ కుమార్ ప్రశ్నించారు. భారతదేశం ముఖ్యమైన చారిత్రక భాగస్వాములలో ఒకటి అని, కీలక ఇంధన వనరు అయిన ఇరాన్ దాడికి గురిఅవుతున్నప్పుడు, ప్రాంతీయ స్థిరత్వం తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నప్పుడు ఈ ప్రోత్సాహ ప్రకటన భారతదేశంఇంధన ఎంపికలు ఇప్పుడు అమెరికా ఆమోదానికి లోబడి ఉన్నట్లు సూచిస్తున్నట్లు కనిపిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితి భారతదేశ ప్రజలకు తీవ్ర ఇబ్బందిని కలిగించడం మాత్రమే కాదని, భారతదేశ విదేశాంగ, వాణిజ్య విధానానికి తీవ్ర ఇబ్బందిని కూడా సూచిస్తుందని సందోష్ కుమార్ అన్నారు. భారతదేశం 140కోట్ల మంది పౌరులతో కూడిన గర్వించదగిన, స్వతంత్రదేశమని, వాషింగ్టన్ ప్రాధాన్యతల ప్రకారం దాని సార్వభౌమ నిర్ణయాలను సర్దుబాటు చేసుకునే ఆధీనరాష్ట్ర ం కాదని, అందువల్ల ఈ అంశాన్ని తగిన దౌత్యవేదికలలో గట్టిగా లేవనెత్తాలని సందోష్‌కుమార్ ప్రధానమంత్రిని విజ్ఞప్తి చేశారు. భారదేశ ఇంధన భద్రత, విదేశాంగ విధాన ఎంపికలు జాతీయ ప్రయోజనాల ద్వారా మాత్రమే నిర్ణయించబడతాయని, నిస్సందేహంగా నిర్ధారించాలని తాను కోరుతున్నట్లు రాజ్యసభ సభ్యుడు సందోష్‌కుమార్ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి రాసిన లేఖలో కోరారు. భారతదేశం గురించి కించపరిచే బహిరంగ ప్రకటనలపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని కూడా సందోష్‌కుమార్ ప్రధానమంత్రిని డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యాఖ్యలపై భారతదేశ నాయకత్వ సారథిగా స్పష్టత ఇవ్వాలని, భారతదేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలని, దేశ గౌరవం అంత బహిరంగ అవమానానికి గురికాకుండా చూసుకోవాలని సిపిఐ రాజ్యసభ్యుడు సందోష్‌కుమార్ హితవు పలికారు. కాగా, సిపిఐ(ఎం) రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ కూడా ఇదే తరహా మనోభావాన్ని తన 'ఎక్స్' పోస్ట్ ద్వారా వ్యక్తం చేశారు.

## చమురు సంక్షోభం

(మొదటి పేజీ తరువాయి)

వస్తుందని ఖతార్ వంటి దేశాలు హెచ్చరిస్తున్నాయి. అమెరికా ఈ యుద్ధాన్ని ఎంత త్వరగా నిలిపివేస్తే ప్రపంచానికి అంత మంచిది. భారత ఆయుల్ రిఫైనరీలు రష్యా నుంచి చమురు కొనుగోలు చేసుకోవచ్చని, అందుకుగాను 30 రోజులు తాత్కాలిక మినహాయింపును ఇస్తున్నామని అమెరికా ప్రకటించింది. గతంలో విధించిన అదనపు సుంకాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు పేర్కొంది. ఇరాన్‌తో యుద్ధం కారణంగా నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో అమెరికా ఈ నిర్ణయం తీసుకుందని పరిశీలకుల అభిప్రాయం. కాగా, ప్రపంచ ఇంధన సరఫరా అంతరాయం కలగకుండా చూడటమే ఈ చర్యకు ప్రధాన ఉద్దేశంగా అమెరికా ఆర్థిక శాఖ మంత్రి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు. ప్రపంచ మార్కెట్లో చమురు సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు తాత్కాలిక అనుమతి ఇచ్చామని పేర్కొంటూనే, ఈ మినహాయింపు చాలా పరిమిత కాలానికి మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికే సముద్రంలో చిక్కుకుపోయిన లేదా పంపిణీ ప్రక్రియలో ఉన్న రష్యా చమురు సరుకులను భారతదేశానికి చేరవేయడానికి మాత్రమే ఈ అనుమతి ఉపయోగపడుతుంది. హొర్మోజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో, ఇప్పటికే వందలాది నౌకలు అక్కడ చిక్కుపడ్డాయి. దీనితో భారత్ వంటి దేశాలు రష్యా నుంచి దిగుమతులపై ఆధారపడాల్సి వస్తుంది. లేకపోతే, తగ్గిన ఇంధన సరఫరా కారణంగా, ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉంటుంది. అందువల్ల ప్రపంచ మార్కెట్ స్థిరత్వాన్ని కాపాడేందుకు అమెరికా ఈ తాత్కాలిక చర్యను చేపట్టిందని అంటున్నారు. అదే సమయంలో, అమెరికా ప్రభుత్వం ఈ చర్యను 'స్టాప్‌గ్యాప్' చర్యగా పేర్కొంది. అంటే ఇది తాత్కాలిక పరిష్కారం మాత్రమే. రష్యా చమురు దిగుమతులు తప్పనిసరిగా మారిన నేపథ్యంలో, ఇరాన్ యుద్ధం తమ తప్పిదం కాదని పరోక్షంగా పేర్కోవడమే అమెరికా ప్రయత్నంగా కనిపిస్తున్నది. అంతేగాక, భారత్‌కు కల్పించిన మినహాయింపు వల్ల రష్యాకు పెద్దగా ఆర్థిక లాభం ఏమీ ఉండదు. ఎందుకంటే ఈ అనుమతి కొత్తగా చమురు కొనుగోలు ఒప్పందాలకు వర్తించదు. ఇప్పటికే సముద్రంలో ఉన్న చమురు సరుకుల విక్రయానికి మాత్రమే అమెరికా మినహాయింపును ప్రకటించింది. తాము విధించిన ఆంక్షలను, చేసిన హెచ్చరికలను పట్టించుకోకుండా, రష్యా నుంచి ముడిచమురును దిగుమతి చేసుకుంటున్నదన్న కారణంగా భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 25 శాతం శిక్షాత్మక సుంకాలు విధించినవిషయం తెలిసిందే. కాగా, గత నెల అమెరికా, భారత్ మధ్య ఒక తాత్కాలిక వాణిజ్య ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం భారతదేశం రష్యా నుంచి ఇంధన దిగుమతులను తగ్గించి, అమెరికా నుంచి ఎక్కువగా చమురు, వాయువు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని ట్రంప్ ఇది వరకే ప్రకటించారు. ఇందుకు భారత్ అంగీకరించింది కూడా ట్రంప్ ప్రకటించారు. ఈ హామీ నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం భారతదేశంపై విధించిన 25 శాతం సుంకాలను తొలగించింది. ఇప్పుడు ప్రకటించిన 30 రోజుల మినహాయింపు కూడా అదే నిర్ణయానికి పొడిగింపుగా ఉంది. అమెరికా ప్రకారం భారతదేశం ఒక కీలక, వ్యూహాత్మక భాగస్వామి. అందువల్ల రెండు దేశాల మధ్య ఇంధన సహకారం మరింత పెరగాలని అమెరికా ఆశిస్తోంది. భవిష్యత్తులో భారతదేశం తమ నుంచి ఎక్కువ ఇంధన ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని అమెరికా అధికారులు భావిస్తున్నారు. అమెరికా ఆర్థిక శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం ఈ మినహాయింపు 2026 మార్చి 5వ తేదీకి ముందు నౌకలలో లోడ్ చేసిన రష్యా చమురు లేదా పెట్రోలియం ఉత్పత్తులకు మాత్రమే వర్తిస్తుంది. ఈ సరుకులు 2026 ఏప్రిల్ 4 వరకు భారతదేశంలోని పోర్టులకు చేరుకోవడానికి అనుమతి ఉంటుంది. కొనుగోలు చేసే సంస్థలు భారతదేశ చట్టాల ప్రకారం నమోదైన సంస్థలై ఉండాలి. అంతేగాక, ఈ మినహాయింపు అన్ని రకాల లావాదేవీలకు వర్తించదు. ముఖ్యంగా ఇరాన్‌కు వస్తువులు, సేవలు లేదా సంస్థలతో సంబంధం ఉన్న లావాదేవీలకు ఈ అనుమతి వర్తించదు.

## దోపిడీ ఫలితమిది!

(మొదటి పేజీ తరువాయి)

ఆధారంగా విదేశాంగ విధానం ఉండాలని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్నది నిజమైన విదేశాంగ విధానం కాదని, అది ఇది రాజీపడిన వ్యక్తి దోపిడీ ఫలితమని రాహుల్ గాంధీ ఆరోపించారు. రాహుల్ తన వ్యాఖ్యల ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. దేశ సార్వభౌమత్వం విషయంలో కేంద్ర ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తోందన్న ప్రశ్నను కూడా ఆయన లేవనెత్తారు. భారత్ విదేశాంగ విధానం దేశ ప్రయోజనాలను కాపాడేలా, స్వతంత్ర నిర్ణయాలతో ముందుకు సాగాలని రాహుల్ గాంధీ అభిప్రాయం వ్యక్తం చేశారు.

**ట్రంప్ కొత్త ఆట! : జైరాం రమేశ్**

కాంగ్రెస్ ఎంపి జైరాం రమేశ్ ఈ అంశంపై సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ అమెరికాపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికా ప్రభుత్వం భారత్‌కు 30 రోజులపాటు రష్యా చమురు కొనుగోలు చేయడానికి మినహాయింపు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఇది, అమెరికా బ్లాక్‌మెయిల్‌లా కనిపిస్తోందని పేర్కొన్నారు. అమెరికా ఆర్థిక మంత్రి ప్రకటించిన వేవర్‌పై ఆయన స్పందిస్తూ ఒక చిన్న కవితా రూపంలో విమర్శలు చేశారు. 'ట్రంప్ కొత్త ఆట, ఢిల్లీ మిత్రుడికి చెప్పాడు, పుతిన్ నుంచి చమురు తీసుకోండి, కానీ ఎంతకాలం? ఇదే అమెరికా బ్లాక్‌మెయిల్' అంటూ ఆయన వ్యాఖ్యానించారు. మరో కాంగ్రెస్ ఎంపి మనీశ్ తివారీ కూడా ఈ అంశంపై కేంద్రాన్ని ప్రశ్నించారు. అమెరికా నుంచి వచ్చిన ప్రకటన భాషను ఆయన తీవ్రంగా విమర్శించారు. '30 రోజుల మినహాయింపు ఇస్తున్నాం' అనే విధంగా అమెరికా మాట్లాడటం నూతన సామ్రాజ్యవాద ధోరణిని ప్రతిబింబిస్తోందని అన్నారు. భారత్ తన ఇంధన అవసరాలను తీర్చుకోవడానికి అమెరికా అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందా?' అని ఆయన ప్రశ్నించారు.

**కేంద్రం క్లారిటీ ఇవ్వాలని డిమాండ్**

భారత్ ప్రభుత్వం ఈ అంశంపై మౌనం పాటించడం కూడా ఆందోళన కలిగిస్తోందని మనీశ్ తివారీ పేర్కొన్నారు. సాధారణంగా ఎక్కువగా మాట్లాడే కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో మాత్రం స్పందించకపోవడం ఆశ్చర్యకరమని అన్నారు. దేశ సార్వభౌమాధికారానికి ఇది సంబంధించిన అంశమని, కేంద్రం దీనిపై స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

**ఢిల్లీలో నిజంగా ప్రభుత్వం ఉందా?**

కాంగ్రెస్ మరో సీనియర్ నేత రణదీప్ సింగ్ సుర్జేవాలా కూడా ఈ విషయంపై తీవ్ర విమర్శలు చేశారు. బిజెపి ప్రభుత్వం భారత్ స్వతంత్రతపై రోజూ రాజీ పడుతోందని ఆయన ఆరోపించారు. చమురు ధరలు పెరుగుతున్న సమయంలో, అలాగే హర్మూజ్ జలసంధి సమస్యల కారణంగా సరఫరాలు ప్రభావితమవుతున్న పరిస్థితిలో భారత్ తన ఇంధన అవసరాల కోసం నిర్ణయాలు స్వతంత్రంగా తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. మొదట అమెరికా భారత్‌కు రష్యా చమురు కొనొద్దని చెప్పిందని, తర్వాత 30 రోజులపాటు కొనుగోలు చేయడానికి అనుమతి ఇస్తోందని సుర్జేవాలా వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలు చూస్తుంటే ఢిల్లీలో నిజంగా ప్రభుత్వం ఉందా? అన్న సందేహం కలుగుతోందని ఆయన విమర్శించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ చేసిన ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతల కారణంగా, ముఖ్యంగా హోర్ముజ్ ద్వారా జరిగే చమురు రవాణా అంతరాయం కలగడంతో తాత్కాలిక చర్యగా ఈ వేవర్ ఇచ్చినట్టు ఆయన తెలిపారు. ప్రపంచ మార్కెట్‌లో చమురు సరఫరా అంతరాయం కలగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు అమెరికా పేర్కొంది. ప్రస్తుతం సముద్రంలో నిలిచిపోయిన రష్యా చమురు సరఫరా కొనసాగేందుకు మాత్రమే ఈ 30 రోజుల మినహాయింపు వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ తాత్కాలిక నిర్ణయం వల్ల రష్యాకు పెద్దగా ఆర్థిక లాభం ఉండదని కూడా అమెరికా అధికారులు పేర్కొన్నారు.

# సమన్వయం, జవాబుదారీతనంతో పని చేయాలి

## ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సదస్సులో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ప్రజలకు మెరుగైన సేవలందించే లక్ష్యంగా సంబంధిత ప్రభుత్వ శాఖాధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో, జవాబుదారీతనంతో పని చేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సూచించారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు సంబంధించి జిల్లా యంత్రాంగంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంపై నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శాసన మండలి చీఫ్ విప్ పి.మహేందర్‌రెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు నారాయణరెడ్డి, మనుచౌదరి, దీపక్ తివారి, జిహెచ్ఎంసి మల్కాజిగిరి, సైబరాబాద్ జోనల్ కమిషనర్లు ఈ సదస్సులో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడతూ ప్రజా ప్రభుత్వ పథకాలన్నింటిని అర్హులైన లబ్దిదారులకు పూర్తి స్థాయిలో చేరవేయటంతో పాటు ప్రజలకు ఎదురయ్యే వివిధ సమస్యల పరిష్కరించే లక్ష్యంగానే ప్రభుత్వం ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలన్ని నిర్దేశించిన విధంగా అర్హులందరికి అందించటంలో ఆయా జిల్లాల కలెక్టర్లు, సంబంధిత ప్రభుత్వ శాఖాధికారులు బాధ్యతాయుతంగా పని చేస్తే మన్నన పొందగలుగుతారన్నారు.

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలకు సంబంధించి జవాబుదారీతనంతో ముందు కు వెళుతున్నామన్నారు. సంక్షేమ పథకాలు అందని లబ్దిదారులను గుర్తించి వారందరికి చేరేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు నేరుగా ప్రజల ఇళ్లకు వచ్చి రేషన్ కార్డులు, ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు ఇవ్వటంలాంటి పనుల్లో లబ్దిదారులకు సహకరిస్తారని తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 6 హామీలను నెరవేర్చే దిశగా తామంతా పని చేస్తున్నామన్నారు. దీని కోసం జిల్లాలోని 5 అసెంబ్లీ నియోజకవర్గాలకు నోడల్ అధికారులను నియమించామన్నారు. వీరంతా ఆయా సంబంధిత ప్రభుత్వ శాఖాధికారులను సమన్వయం చేసుకొంటూ పని చేస్తారన్నారు. హౌసింగ్ బోర్డు ద్వారా ఇళ్ల నిర్మాణాదలకు సంబంధించి ఎప్పటికప్పుడు చెల్లింపులు పూర్తయ్యేలా చర్యలు తీసుకొంటున్నామన్నారు. జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించటంలో చర్యలు తీసుకొంటున్నామన్నారు. అదే విధంగా జిల్లా మండల అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాలను అందించే దిశగా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు రాంమోహనరెడ్డి, మనోహరరెడ్డి, ప్రకాష్‌గౌడ్, కాలే యాదయ్య, శంకరయ్య, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిలతో పాటు వివిధ శాఖల చైర్మన్లు, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకం

## మాదిగ ఎంప్లాయిస్ కో-ఆర్డినేషన్ కమిటీ అభినందన సభలో సిఎం రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** షెడ్యూల్ కులాల (ఎస్‌సి)వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని, తద్వారా అత్యంత వెనుకబడినవర్గాలకు న్యాయం జరిగే దిశగా ముందడుగు పడిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. 2023 ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరుకుని ఈ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చారని, ఇది ప్రజల ప్రభుత్వమని సిఎం అన్నారు. అక్రమ సంపాదనలతో, అక్రమ కేసులతో ఆధిపత్యం చెలాయించే శక్తులు ఒకవైపు ఉంటే, ప్రజల ఆశయాలతో ఎన్నికల్లో గెలవాలనే సంకల్పంతో తాము పోరాడి విజయం సాధించామని పేర్కొన్నారు. మాదిగ ఎంప్లాయిస్ కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో సిఎం రేవంత్ రెడ్డి అభినందన సభ మాదాపూర్ శిల్పకళా వేదికలో శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో మంత్రులు సి.దామోదర రాజనర్సింహ, అడ్లూరి లక్ష్మణ్, ఎంఎల్‌ఎలు కాలే యాదయ్య, వేముల వీరేశం, లక్ష్మీ కాంతరావు పాల్గొన్నారు. ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించినందుకు మాదిగ ఉద్యోగులు సిఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ ఎస్‌సి వర్గీకరణ అంశం రెండు దశాబ్దాలుగా నలుగుతూనే ఉందని, ఈ పోరాటంలో కొందరు ప్రాణాలు సైతం అర్పించారని గుర్తు చేశారు. ఎన్నో చిక్కుముడులు, కమిషన్లు, చర్చల తర్వాత కూడా సమస్య పరిష్కారం కాలేదని, అయితే సుప్రీంకోర్టు ఆదేశాల అనంతరం వర్గీకరణ అమలు చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. మాదిగల వంటి బలహీన వర్గాలకు న్యాయం చేయాలనే సంకల్పంతోనే తాను ఎప్పటి నుంచో అండగా నిలుస్తున్నానని సిఎం చెప్పారు. మంత్రివర్గ సహచరులు, అధికారులు సమయస్ఫూర్తితో సహకరించడంతో ఈ నిర్ణయం అమలులోకి వచ్చిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులే ప్రభుత్వానికి కళ్లు, చెవులు, బ్రాండ్ అంబాసిడర్లు అని సిఎం పేర్కొన్నారు. రేషన్‌కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్ వంటి పథకాల అమలులో ప్రజలకు సహకరించాలని సూచించారు. ప్రతి నెలా వెయ్యి మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందుతున్నారని, వారికి భారీగా బెనిఫిట్లు చెల్లించాల్సి వస్తున్నప్పటికీ ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థను సమన్వయం చేస్తూ ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. అక్రమాలను అరికట్టి ఖజానాకు ఆదాయం పెంచితే పది మందికి మేలు జరుగుతుందని ఉద్యోగులకు సూచించారు. దారిద్ర్య రేఖలో ఉన్న వర్గాలు ముందుకు రావాలంటే విద్యే ప్రధాన మార్గమని సిఎం పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, హాస్టళ్లలో చదివే విద్యార్థులకు డైట్ ఛార్జీలు, ఇతర సౌకర్యాలు పెంచినట్లు తెలిపారు. గతంలో బర్రెలు, గొర్రెలు, చేపలు ఇచ్చే పథకాలు అమలు చేశారని, కానీ భవిష్యత్తులో వెనుకబడిన వర్గాల పిల్లలు కలెక్టర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, న్యాయవాదులు కావాలని తన ఆశయమని సిఎం పేర్కొన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

## హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అందిపుచ్చుకుని మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మాసబ్ ట్యాంక్ లోని చాచా నెహ్రూ పార్కులో జిహెచ్‌ఎంసి పరిధిలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని ఆయన అధికారికంగా ప్రారంభించారు. ఎంపిక చేసిన మహిళా సంఘాలకు రూ.35 కోట్ల జీరో వడ్డీ రుణాల చెక్కులను పంపిణీ చేశారు. మహిళల ఉపాధి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ప్రారంభించారు. 1500 చదరపు గజాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక అద్దాల లైబ్రరీని ప్రారంభించారు. ఇక్కడ పుస్తకాలను దానం చేసే సదుపాయం కూడా కల్పించారు. మహిళలు ఇందిరమ్మ చీరలు ధరించి భారీ సంఖ్యలో హాజరు కావడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా మంత్రి మట్లాడుతూ మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. హైదరాబాద్‌లోని ఎస్‌హెచ్‌జి మహిళలు ముందుకు వస్తే, గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్‌టిసి బస్సులకు వారిని యజమానులుగా చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని మంత్రి వెల్లడించారు. కేవలం సంక్షేమమే కాకుండా, పర్యావరణం, విద్యపై కూడా మంత్రి దృష్టి సారించామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 12 వేల గ్రామాలు, వార్డుల్లో అభివృద్ధిని వేగవంతం చేసేందుకే ఈ 99 రోజుల కా ర్యాచరణ చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరి చందన, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆధిపత్య అహంకారంతో దాడులు దారుణం

## ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాగర్‌కర్నూల్ కుమ్మెర ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని, బాధితులకు న్యాయం చేయాలని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిందితులను అరెస్ట్ చేయకుండా పోలీసులు కాలయాపన చేస్తున్నారని, తద్వారా ఈ కేసును పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. 'నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర బాధితులకు న్యాయం చేయాలని' డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్, ధర్నాచౌక్ వద్ద బిసి, ఎస్‌సి, ఎస్‌టిజెఎసి, రజక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్, బిఆర్‌ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి చిరంజీవులు, బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలరాజు గౌడ్, అరుణోదయ సాంస్కృతిక మండలి నాయకురాలు విమలక్క, పిఒడబ్ల్యు నాయకులు సంధ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ జాతర సందర్భంగా కేవలం వంద రూపాయల రసీదు అడిగినందుకు అగ్రవర్ణాలు తమ ఆధిపత్య అహంకారంతో దాడులు చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటన జరిగి 20 రోజులు కావస్తున్నప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ఆ బాధితులు హైదరాబాద్ వచ్చి డిజిపిని, మానవ హక్కుల కమిషన్‌ను కలిసినా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. తెలంగాణ నేల సాయుధ రైతాంగ పోరాటాలకు, కారంచేడు, నీరుకొండ వంటి ఘటనల ఎదురుదాడికి సాక్ష్యమని, ఈ గడ్డపైన కుల వివక్షను సహించే ప్రసక్తే లేదని సత్యం హెచ్చరించారు. నిజామాబాద్‌లో కూడా కుల బహిష్కరణలు, వివక్ష కొనసాగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే శాసన మండలిలో ఘటనను ప్రస్తావిస్తానని చెప్పారు. సామాజిక ఉద్యమాలకు కమ్యూనిస్టు పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కేసును నీరు గార్చకుండా చూడాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వంపైన ఉందన్నారు. కులవివక్షత పట్ల ప్రభుత్వం స్పందించాలని, లేదంటే వీటికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాల్సి వస్తుందన్నారు. వి.శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కుమ్మెర బాధితులకు ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని, నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. విశారదన్ మహారాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టిలపైన దాడులు పెరిగాయన్నారు. కుమ్మెర నిందితులపైన వెంటనే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ, హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించి, గృహాన్ని, ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ప్రజాపాలన ఉత్తి దండగ ప్రచారం

## మాజీ మంత్రి హరీశ్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల యాక్షన్ ప్లాన్ కేవలం ఉత్తి దండగ ప్రచార పర్వం తప్ప మరొకటి కాదని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉపనాయకుడు తన్నీరు హరీశ్ రావు ఆరోపించారు. 800 రోజుల పాలనలో చేసిందేమీ లేక, 99 రోజుల ప్రణాళిక పేరుతో మరో డ్రామాకు తెర తీశారని, సిఎం రేవంత్ రెడ్డికి తన రెండున్నరేళ్ల పాలన తర్వాత ప్రగతి ప్రణాళికలు గుర్తుకొచ్చాయా అని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీలు, పాలన వైఫల్యాలు, కోట్లు కొల్లగొట్టేందుకు చేసిన స్కాములు, ప్రజల ఛీత్కారాల నుంచి దృష్టి మరల్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మరో డైవర్షన్ ప్లాన్ అని అన్నారు. గతంలో రెండుసార్లు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి స్వీకరించిన లక్షలాది దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోకుండా ఇంకా చెత్తబుట్టల్లోనే మగ్గుతున్నాయని ఆరోపించారు. ఆ దరఖాస్తులకే దిక్కు లేదని, మళ్లీ పది వారాల పాటు పది రకాల నాటకాలతో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం కావడం సిగ్గు చేటన్నారు. జాబ్ క్యాలెండర్‌ను జాబ్ లెస్ క్యాలెండర్ చేశారని, నోటిఫికేషన్లు ఇవ్వకుండా మూసీ బ్యుటిఫికేషన్ పేరుతో లూటీకి తెగబడ్డారని ఆరోపించారు. 'రాజీవ్ యువ వికాసం' పేరుతో తీసుకున్న దరఖాస్తులకు దిక్కు లేకుండా పోయిందని, ఇప్పుడు యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమం అంటూ కొత్త పాట పాడుతున్నారని హరీశ్ రావు ఆరోపించారు. ప్రభుత్వ ఆఫీసుల్లో పారిశుధ్యం, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ అనేది ప్రభుత్వ కనీస బాధ్యత అని, కానీ దీనిని కూడా ఒక ఈవెంట్‌లాగా కలర్ ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందన్నారు.

# బిసిలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు

## ఓయు విసి. ప్రొఫెసర్ కుమార్ మొలగరం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ జనాభాలో సగానికిపైగా ఉన్న బిసిలకు సామాజిక న్యాయం చేకూరాలని, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాల్సిన అవసరం ఉందని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలగరం అన్నారు. ఆర్‌యుఎస్‌ఎ 2.0 సౌజన్యంతో ఉస్మానియా యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ చలమల వెంకటేశ్వర్లు అధ్యక్షతన శుక్రవారం ఆర్ట్స్ కాలేజీలో 'తెలంగాణలో వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లు, సామాజిక న్యాయం, విధానాలు, సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణ అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మొలగరం మాట్లాడుతూ రిజర్వేషన్ల అమలులో సమానత్వం కంటే సమన్యాయం చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డారు. 'అందరికీ ఒకే రకమైన పుస్తకం లేదా ఒకే సైజు డ్రెస్ ఇవ్వడం సమానత్వం అనిపించుకోవచ్చు, కానీ ఎవరికి ఏది అవసరమో, ఎవరికి ఏది సరిపోతుందో అది అందించడమే నిజమైన సమన్యాయం అని వివరించారు. రిజర్వేషన్ల ఫలాలు సమాజంలో చివరి వరుసలో ఉన్న వ్యక్తికి, అట్టడుగు వర్గాలకు అందినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ కేవలం వెనుకబడిన వర్గాల సమస్య మాత్రమే కాదని, అది ఈ దేశ అభివృద్ధికి సంబంధించిన 'దేశ సమస్య' అని అన్నారు. బయట లక్షల మందితో సభ పెడితే వచ్చే ప్రభావం కంటే, ఉద్యమాలకు నిలయమైన ఉస్మానియా యూనివర్సిటీ నాలుగు గోడల మధ్య జరిగే మేధోమథనానికి ఎక్కువ శక్తి ఉంటుందని, ఇక్కడ ఒక సెమినార్ జరిగితే అది దేశవ్యాప్త చర్చకు దారితీస్తుందన్నారు. సామాజిక న్యాయం కోసం జరుగుతున్న ఈ ఉద్యమంలో ఇదొక చారిత్రాత్మక ఘట్టమని ఆయన పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాల సాధికారతకు రాజ్యాంగపరమైన రక్షణలు, విధానపరమైన సంస్కరణలతో పాటు సంస్థాగత యంత్రాంగం యొక్క ప్రాముఖ్యతను బిసిఐఎఫ్ అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి టి. చిరంజీవులు వివరించారు. ఈ సదస్సులో ప్రముఖ విద్యావేత్తలు ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు, ప్రొఫెసర్ ఎస్. సుదర్శన్ రావు, ప్రొఫెసర్ ఎం.స్వర్ణలత ముఖ్య వక్తలుగా పాల్గొని బిసి రిజర్వేషన్ల యొక్క చారిత్రక, రాజ్యాంగ, రాజకీయ, సామాజిక ఆర్థిక అంశాలపై లోతైన విశ్లేషణ చేశారు. ఈ సదస్సులో ఆర్‌సియుఇఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగేష్, ఆర్ట్స్ కాలేజీ డీన్ ప్రొఫెసర్ ఎం.లింగప్ప, వివిధ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు, సామాజిక కార్యకర్తలతో పాటు బిసి కుల సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సమస్యలు వేగంగా పరిష్కరించి మరింత అభివృద్ధి దిశగా వ్యవసాయ రంగం

## వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో రైతులకు శాస్త్రీయ వ్యవసాయం, ఆధునిక సాంకేతికత, పంటల వైవిధ్యీకరణ, భూసార నిర్వహణ వంటి అంశాలపై విస్తృత అవగాహన కల్పించేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో చురుకుగా పని చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమన్వయంతో పని చేసి ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయాలని మంత్రి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల సమస్యలను వేగంగా పరిష్కరించి వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలన్నారు. '99 రోజుల కార్యచరణ'లో భాగంగా రాష్ట్రంలో మే 4 నుండి మే 10 వరకు నిర్వహించే వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలను గ్రామస్థాయినుంచి రాష్ట్ర స్థాయి వరకు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులకు సాయిల్ హెల్త్‌కార్డుల పంపిణీ, నానో యూరియా వినియోగంపై అవగాహన, వానాకాలం పంటల సిద్ధతపై కార్యక్రమాలు, బ్యాంకర్లతో రుణ మేళాలు, రైతు శాస్త్రవేత్తల సమావేశాలు, ఉత్తమ రైతులకు సన్మానాలు, రైతు మేళాలు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులకు శాస్త్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పించడం, కృషి విజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయ పరిశోధనా కేంద్రాల సందర్శనలు, రైతుశాస్త్రవేత్తల సమావేశాలు, క్షేత్ర స్థాయి ప్రదర్శనలు, రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. రైతు ఉత్పత్తి సంస్థలు, వ్యవసాయ మార్కెట్ యార్డులు, సహకార సంస్థల బలోపేతం ద్వారా రైతులు తమ ఉత్పత్తులకు మెరుగైన ధరలు పొందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అధిక మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగు, పంటల వైవిధ్యీకరణ, రైతు ఉత్పత్తి సంస్థల బలోపేతం, సేంద్రీయ వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ, డిజిటల్ వ్యవసాయ పద్ధతులు, రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింత ఆధునీకకరించాలని మంత్రి తుమ్మల తెలిపారు. మార్కెట్ యార్డులను అభివృద్ధి చేసి ఈనామ్ ప్లాట్‌ఫామ్ వినియోగాన్ని పెంచాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

**జిల్లాల వారిగా నోడల్ అధికారుల నియామకం...**

'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమ పర్యవేక్షణ నిమ్మితం ఉమ్మడి జిల్లాల వారిగా నోడల్ అధికారులను నియమించారు. రంగారెడ్డి జిల్లావ్యవసాయశాఖ సంచాలకులు డాక్టర్ గోపి. మహబూబ్ నగర్ జిల్లా హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా. నల్లగొండ జిల్లా మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీ బాయి. మెదక్ జిల్లాస్పెషల్ సిసి,ఆర్‌సిఎస్ రాహుల్ రాజ్ . నిజామాబాద్ జిల్లా మార్క్ ఫెడ్ ఎండి శ్రీనివాస్ రెడ్డి .ఖమ్మం జిల్లా టిజిఎస్‌ఒసిఎ డైరెక్టర్ కిరణ్ కుమార్. ఆదిలాబాద్ జిల్లా ఆగ్రోస్ ఎం.డి రాములు. కరీంనగర్ జిల్లా టిజిఎస్‌డబ్ల్యుసి ఎం.డి కొర్ర లక్ష్మీ, వరంగల్ జిల్లా హాకా ఎం.డి చంద్రశేఖర్ రెడ్డి.

# ప్రతీది రాద్ధాంతం చేయడమే హరీష్‌రావు పని: ఎమ్మెల్సీ దయాకర్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ నేత హరీష్ రావు ప్రతిరోజూ ఏదో ఒక అంశాన్ని తీసుకుని అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఎంఎల్‌సి అద్దంకి దయాకర్ విమర్శించారు. తెలంగాణ ప్రజల సొమ్మును పత్రికా ప్రకటనల రూపంలో దుర్వినియోగం చేసింది బిఆర్‌ఎస్ ప్రభుత్వమే అని కాంగ్రెస్ ప్రభుత్వం కాదని ఆయన పేర్కొన్నారు. హరీష్ రావు పరిస్థితి శకునం చెప్పే బల్లి కుడితిలో పడినట్టుగా ఉందని వ్యాఖ్యానించారు. పంజాబ్, మహారాష్ట్ర ఎన్నికల సమయంలో పత్రికల్లో ప్రకటనలు ఇచ్చింది బిఆర్‌ఎస్ కాదా అని ప్రశ్నించారు. టిఆర్‌ఎస్‌ను బిఆర్‌ఎస్‌గా మార్చినప్పుడు దేశ వ్యాప్తంగా పత్రికా ప్రకటనలు ఇచ్చిన విషయం గుర్తు లేదా అని నిలదీశారు. అప్పట్లో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సంతోషంగా ఉంటే చాలు ప్రకటనలు ఇచ్చేవారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటనలు ఇస్తే ఎందుకు అసూయ చూపుతున్నారని అద్దంకి దయాకర్ ప్రశ్నించారు. తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రకటనలు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందిస్తున్న సేవల వివరాల గురించేనని తెలిపారు. హార్వర్డ్ స్కూల్ ఫీజును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సొంత డబ్బులతోనే చెల్లించుకున్నారని స్పష్టం చేశారు. నమస్తే తెలంగాణ పత్రికను గుమస్తా తెలంగాణ పత్రికగా మార్చిందీ బిఆర్‌ఎస్ నాయకత్వమేనని విమర్శించారు. మూసీ నది కాలుష్యంపై చట్టాలు తీసుకొచ్చిన కెటిఆర్ ఇప్పుడు అదే మూసీ దగ్గర రాజకీయ లొల్లి పెడుతున్నారని అన్నారు. గత పది సంవత్సరాలుగా విద్యార్థులను పట్టించుకోని వారు ఇప్పుడు వారి గురించి మాట్లాడడం విచిత్రమని వ్యాఖ్యానించారు. పత్రికల్లో ప్రకటనలు మీరు ఇస్తే సరే, మేము ఇస్తే తప్పా అని ప్రశ్నించారు. ఉదయం లేవగానే మైక్ పట్టుకుని మాట్లాడే కెటిఆర్, హరీష్ రావు ఇద్దరూ మైకాసురులుగా మారిపోయారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను అసెంబ్లీకి రావాలని కోరితే వచ్చి సంతకం పెట్టి వెళ్లిపోతున్నారని,అయినా జీతం మాత్రం తీసుకుంటున్నారని దయాకర్ విమర్శించారు.

# రంజాన్ తోఫా పంపిణీ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ముస్లిం సమాజానికి రంజాన్ బహుమతులు (తోఫా) పంపిణీ కార్యక్రమాన్ని చారిత్రాత్మకమైన బాగ్ ఏఆమ్ షాహీ మసీదులో శుక్రవారం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్ మసీదుకు వచ్చిన ముస్లిం ప్రార్థకులు, నమాజీలకు రంజాన్ బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రంజాన్ మాసం కరుణ, ఐక్యత, దానం యొక్క ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ముస్లిం సమాజానికి ప్రభుత్వం రంజాన్ బహుమతులు అందించడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సమాజ సభ్యులు, ప్రార్థకులు హాజరై, పవిత్ర రంజాన్ మాసంలో తమకు మద్దతుగా నిలుస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీస్ వెల్ఫేర్, ఫైనాన్స్ శాఖ కార్యదర్శి మొహమ్మద్ షఫియుల్లా, ఫహీమ్ ఖురేషీ తదితరులు పాల్గొన్నారు.

# స్నేహం చిరకాలం నిలిచే బంధం

## పూర్వ విద్యార్థిగా హాజరైన తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ రాం కోటిలోని న్యూ సైన్స్ కాలేజ్ 1967–1970 బ్యాచ్ బిఎస్‌సి విద్యార్థులు 56 ఏళ్ల తర్వాత కలుసుకుని నాటి కాలేజ్ మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. హైదరాబాద్ ఫతేమైదాన్ క్లబ్‌లో శుక్రవారం న్యూ సైన్స్ కాలేజ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. స్నేహం చిరకాలం నిలిచే బంధమని మరోసారి నిరూపితమైన సందర్భంగా, ఫతే మైదాన్ క్లబ్ ఒక భావోద్వేగ వేదికగా మారింది. కళాశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొని కళాశాలలో తన సహచరులు, మిత్రులను ఆత్మీయంగా పలుకరించి, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తనతోపాటు చదువుకున్న వారు శాస్త్రవేత్తలుగా, ఇంజనీర్లుగా, వ్యాపార వేత్తలుగా సాధించిన ప్రతిభను సమాజానికి అందేటట్లు కృషి చేయడం అభినందనీయమని చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు బి.రెడ్డిశేఖర్ రెడ్డి, ఎం.మోహన్ రెడ్డి, ఎం.సత్యానారాయణ, పి.విజయ్ కుమార్, జి.జవహర్, జి.ఎన్.విజయ్ కుమార్ రెడ్డి, డాక్టర్ ఎస్.ఎం.మాసూమ్, పి.శ్రీనివాస్ గౌడ్, డి.వై.దినేష్, జి.వి.కిష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.


**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, డివిజన్-30, జిహెచ్ఎంసి.**

**NIT No. 04 Electrical :** NIT No. 05/E.E.(Elec.)30/GHMC/2025-26, తేది: 05.03.2026, పని పేరు: ఎలక్ట్రికల్ పనులు, **అంచనా విలువ (రూపాయలలో):** 19,89,840, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 06.03.2026న ఉ.11.00గం.ల నుండి మరియు బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 09.03.2026న ఉ..11.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-30, జిహెచ్ఎంసి, 5వ అంతస్తు అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ www.tender.telenagana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-30, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 16479-PP/CL/ADVT/1/2025-26, Date: 06-03-2026

**గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్**

**టెండర్ నోటీసు**

TENDER Notice No. EE-IV/GWMC/CTN-30/e-proc/2025-26, తేది: 06.03.2026

*పనుల సారాంశం:*

కమిషనర్ GWMC పని ఆమోదం ఆధారంగా, రూ.7.91/- లక్షల విలువైన 4 పనులకు 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ వేదికపై ఆన్‌లైన్ టెండర్ వ్యవస్థ ద్వారా పిలుస్తారు. పనుల జాబితాతో పాటు టెండర్ నోటీసు జతచేయబడింది.

*3 రోజుల టెండర్ - 4 పనుల సంఖ్య:*

| | |
|---|---|
| డౌన్‌లోడ్ చేయడానికి ప్రారంభ తేదీ | :: 09-03-2026 సాయంత్రం 04.00 గంటల నుండి |
| డౌన్‌లోడ్ చేయడానికి చివరి తేదీ | :: 12-03-2026 సాయంత్రం 04.00 గంటల వరకు |
| బిడ్ల ప్రారంభం | :: 12-03-2026 సాయంత్రం 04.10 గంటలకు |

*3 రోజుల కొటేషన్ నోటీసు: ప్రారంభ తేదీ: 09-03-2026 @10.30 A.M. ముగింపు తేదీ: 12-03-2026 @4.00 P.M.*

| | |
|---|---|
| డౌన్‌లోడ్ చేసుకోవడానికి ప్రారంభ తేదీ | :: 09-03-2026 ఉదయం 10.30 గంటల నుండి |
| డౌన్‌లోడ్ చేసుకోవడానికి చివరి తేదీ | :: 12-03-2026 సాయంత్రం 04.00 గంటల వరకు |
| బిడ్ల ప్రారంభం | :: 12-03-2026 సాయంత్రం 04.10 గంటలకు |

సంప్రదింపు వివరాలు: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, GWMC, వరంగల్. ఇమెయిల్: ee.elec.gwmc@gmail.com, సంప్రదింపు నెం.9701999597.

మరిన్ని వివరాలను 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @www.eprocurement.gov.in & www.gwmc.gov.inలో చూడవచ్చు. వార్డుల వారీగా proc పని డౌన్‌లోడ్ 09-03-2026 & 09.03.2026 నుండి ప్రారంభమవుతుంది.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్.

DIPR R.O. No. : 16494-PP/CL/ADVT/1/2025-26, Date: 06-03-2026

## త్వరగా ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోండి



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన కలెక్టర్ అనురాగ్ జయంతి

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** మండలంలోని నాగినేని పల్లి, మైసిరెడ్డిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను శుక్రవారం కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. మండలానికి ఎన్ని ఇందిరమ్మ ఇల్లులు మంజూర య్యాయని ఎన్ని పూర్తయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు తక్కువ ధరలో సిమెంటు ఇటుక ఇసుక మంజూరు జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని వారికి సూచించారు. త్వర త్వరగా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలని వారికి చివరి బిల్లు కూడా తొందరగా మంజూరు అవుతుందని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం వైసిరెడ్డి పల్లి ప్రాథమిక పాఠశాల అంగన్‌వాడీ కేంద్రాలను మల్యాల గ్రామంలో కస్తూరి బాలికల ఉన్నత పాఠశాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కూర్చొని కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో నాగినేనిపల్లి సర్పంచ్ బట్కిర్ జ్యోతి, మైసిరెడ్డిపల్లి సర్పంచ్ రామ్ రెడ్డి, మల్యాల సర్పంచ్ రమాదేవి, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, తహసిల్దార్ శ్రీనివాస్, జ్ఞాన ప్రకాశ్ రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఉజ్వల భారత భవిష్యత్‌ను కీర్తించారు

ఉప కులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మహోజ్వల భారత భవిష్యత్తుకు వాగ్దానం నేడు మహిళలు సాధిస్తున్న అసాధారణ విజయాలే తార్కాణం అని ఎం జి యు ఉప కులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం ఎంజియు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ భారత మహిళ అనేక సవాళ్లను ఎదుర్కొంటూ పురోగతి సాధించడం సుస్పష్టంగా కనబడుతుందన్నారు. సమాజంలో భిన్న పాత్ర లను సమర్థవంతంగా పోషిస్తూ దేశ సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడు తున్న మహిళలు సర్వదా ఆరాధనీయమన్నారు. అసాధారణమైన విజయా లను సాధిస్తున్న మహిళలు ఉజ్వల భారత భవిష్యత్తుకు వాగ్దానంగా కీర్తిం చారు.ఆచార్య పద్మజ మాట్లాడుతూ మహిళ సాధికారతకు మద్దతుగా నిల వడం సామాజిక అవసరత మరియు బాధ్యతగా పేర్కొన్నారు.కుటుంబాలు సంస్థలు, సమాజ పురోగతిలో మహిళల గణనీయమైన పాత్రను పోషిస్తూ పురోగతికి మూలంగా )ల పాత్రను కొనియాడారు.ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వసంత,ఆచార్య రేఖ,ఆచార్య శ్రీలక్ష్మి, లక్ష్మీ ప్రభ,ఇన్స్పెక్టర్ కోట కరుణాకర్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## దశాబ్దకాలంగా కుంటుపడిన అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతో పరుగులు

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో అందరు పాల్గొనాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. దశాబ్దాలకాలంగా కుంటుపడిన అభివృద్ధిని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పరుగులు పెట్టిస్తుంద న్నారు. పరిశుభ్రత, కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో దృష్టి సారిస్తామన్నారు. సమా వేశానికి హాజరైన ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మాట్లాడుతూ రెండున్నరేండ్ల కాలంలో చేపట్టిన పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు చేపట్టనున్న పనులను ప్రజలకు తెలియచేయాలన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ చిలు కూరి సుధాబాలు మాట్లాడుతూ వార్డుల వారీగా సమస్యలను గుర్తించి వెను వెంటనే పరిష్కరిస్తామన్నారు. వైస్ ఛైర్మన్ గుడిపాటి శిరీష మాట్లాడుతూ ప్రజలు పారిశుధ్య సమస్యలతోపాటు సామాజిక సేవలను అందించాల న్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## చిన్న వ్యాపారులను దెబ్బతీస్తున్న హోల్‌సేల్ కూరగాయల వ్యాపారులు

హోల్‌సేల్ ధరలకే కూరగాయల విక్రయం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని నేతాజీ కూరగాయల మార్కెట్‌లో హోల్‌సేల్ వ్యాపారులు చిన్న వ్యాపారులను దెబ్బ తీస్తున్నారని చిన్న వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈమార్కెట్‌లో సుమారు 600 మంది చిరు వ్యాపారులు వారి కుటుంబసభ్యులు ప్రత్యక్షంగా జీవనొపాది పొందుతున్నారు. కూరగాయలను హోల్‌సేల్ మార్కెట్ నుంచి కొనుగోలు చేసి చిన్నచిన్న రిటైల్ దుకాణాలు, త్రోవపై అమ్మకాలు ద్వారా తమ జీవనం సాగిస్తున్నామని పలువుర చిరు వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇటీవల మార్కెట్‌లోని కేవలం 12 మంది హోల్‌సేల్ వ్యాపారులు సంఘటితంగా రాత్రి సమయంలో ప్రత్యేక మార్కెట్‌ను నిర్వహిస్తున్నారని అంటున్నారు. దీంతో చిన్న వ్యాపారులకు ఆర్థిక నష్టం వాటిల్లడమే కాకుండా కుటుంబాల పోషణే ప్రశ్నార్థకంగా మారిమందన్నారు. కస్టమర్ల సంఖ్య 70శాతంకు తగ్గి పోయిందని వాపోతున్నారు. హోల్‌సేల్ నిర్వాహకులతో తామకు రోజుకు రూ.2వేల నుంచి రూ.3వేల వరకు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హోల్‌సేల్ వ్యాపారులు ఉదయం 6గంటల నుంచి 10గంటల వరకు మాత్రమే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పలువురు చిరు వ్యాపారులు కోరుతున్నారు.



### హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలోని

# ఆర్ అండ్ బి రహదారులకు మహర్దశ

49 కిలో మీటర్ల సింగిల్ రోడ్లు, డబుల్ రోడ్ల ఏర్పాటుకు సర్కార్ గ్రీన్ సిగ్నల్

రూ.130 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

ఫలించిన మంత్రి ఉత్తమ్, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిల కృషి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల రహదారులకు మహర్దశ పట్టింది. సింగిల్ రహదారులుగా ఉన్న 49 కిలో మీటర్ల రహదారిని డబుల్ రోడ్డుగా చేసేందుకు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శుక్రవారం ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్త ర్వులు జారీ చేసింది. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావ తిరెడ్డిల పట్టుబట్టి సింగిల్ లైన్ రోడ్లను డబుల్ లైన్ రోడ్లుగా మార్చేందుకు చేసిన కృషి ఫలించింది. ఇందుకు గానూ పాలన పరమైన అనుమతులతో పాటు ప్రభుత్వం ఏక కాలంలో మేజర్, డిస్ట్రిక్ రోడ్ ప్లాన్ కింద రూ.130 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే హుజూర్‌నగర్ నియోజకవర్గం పరిధిలో రూ. 62 కోట్లతో 26.50 కిలో మీటర్ల పొడవునా డబుల్ రోడ్డు మంజూరు పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తద్వారా ఈ నియోజకవర్గంలో 15 గ్రామాలకు ప్రయాణ సౌకర్యం సులువుగా మారనుంది. అదే విధంగా కోదాడ నియోజకవర్గం పరిధిలో రూ.68 కోట్లతో 22.60 కిలో మీటర్ల పొడవునా డబుల్ రోడ్లు ఏర్పాటుకు పాలనప రమైన అనుమతులు లభించాయి. తద్వారా నియోజకవ ర్గంలోని 9 గ్రామాలకు రాక పోకలు సులువు కాను న్నాయి. మంత్రి ఉత్తమ్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలోని సుమారు 49 కిలో మీటర్ల మేర సింగిల్ లైన్ రోడ్డుకు డబుల్ రోడ్డుగా మార్చేందుకు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్త ర్వులు జారీ చేసింది. రూ. 32 కోట్లతో చింతలపాలెం నుండి కిష్టాపురం వరకు సింగిల్ రోడ్డును డబుల్ లైన్ రోడ్డుగా నిర్మాణం చేయనున్నారు. రామలక్ష్మిపురం నుండి హుజూర్‌నగర్ బైపాస్ రోడ్డు వరకు సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా నిర్మాణం చేయనున్నారు. దీంతో రామలక్ష్మిపురం, యర్రారం, హుజూర్‌నగర్ ప్రజలకు లబ్ధి చేకూరనుంది. రూ.30 కోట్లతో అమరవరం నుండి కొత్త తండా వరకు 5.50 కిలో మీటర్ల మేర సింగిల్ లైన్‌ను డబుల్ రోడ్డుగా మార్చనున్నారు. గుడుగుంట్ల పాలెం నుండి ఎల్లాపురం వరకు 8 కిలో మీటర్ల మేర రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చనున్నారు. కోదాడ నియోజకవర్గ పరిధిలో రూ.30 కోట్లతో కోదాడ నుండి అనంతగిరి వరకు 6.60 కిలో మీటర్ల వరకు డబుల్ రోడ్డుగా మార్చను న్నారు. దీంతో కోదాడ, ఖానాపురం, అనంతగిరి గ్రామా లకు లబ్ధి చేకూరనుంది. రూ. 24 కోట్ల రూపాయలతో ఎన్ హెచ్9 నుండి నేలమర్రి వరకు 10కిలో మీటర్ల సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చనున్నారు. దీంతో తాడ్వాయి తండా, తడ్వాయి, వెంకట్రాంపురం, నేలమర్రి గ్రామాల ప్రజలకు లబ్ధిచేకూరనుంది. రూ.14 కోట్ల తో కాపుగల్లు నుండి దోరకుంట వరకు 6 కిలో మీటర్ల వరకు సింగిల్ లైన్ నుండి డబుల్ రోడ్డుగా నిర్మాణం చేయను న్నారు. దీంతో కాపుగల్లు, దోరకుంట ప్రజలకు లబ్ధిచేకూ రనుంది. ఈ విషయమై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లా డుతూ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ తక్షణమే టెండర్లు పిలిచి యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలు పెట్టాలని అదేశించారు.

## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికపై ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశం

99 రోజుల కార్యాచరణపై చర్చించనున్న మంత్రి,ప్రజాప్రతినిధులు

**ప్రజాపక్షం/నల్లగొండ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా అమలు చేయనున్న ప్రజా పాలప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమ లులో భాగంగా శనివారం (మార్చి 7) మధ్యా హ్నం 12 గంటలకు జిల్లా కేంద్రంలోని ఉదయా దిత్య భవన్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు.ఈ సమావేశానికి జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి తో పాటు పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మె ల్యేలు,అధికారులు హాజరుకానున్నారు.ఈ సంద ర్భంగా 99 రోజులపాటు ఐదు దశల్లో గ్రామం నుండి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించే కార్యక్ర మాలపై చర్చించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. సమావేశ ఏర్పాట్లను శుక్రవారం అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, వై.అశోక్ రెడ్డి తదితర అధికారులతో కలిసి పరిశీలించారు.



# 99 రోజుల ప్రణాళికతో పట్టణ సమగ్రాభివృద్ధి

యాదగిరిగుట్టలో 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' ప్రారంభం

మున్సిపల్ కార్మికులతో కలిసి రోడ్లు ఊడ్చిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య యాదగిరిగుట్టలో ఘనంగా ప్రారంభించారు. పట్టణంలోని 2వ వార్డులో మున్సిపల్ పనులను ప్రారంభించిన ఆయన, అనంతరం 3వ వార్డులో లబ్ధిదారురాలు ఎక్కల పద్మ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజర య్యారు. రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం చేయించిన అనంతరం, లబ్ధిదారు రాలి కుటుంబానికి పట్టుబట్టలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయక త్వంలో పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని, ప్రతి పేద కుటుంబం గౌరవంగా జీవించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. అంతకుముందు 2వ వార్డులో మున్సిపల్ చైర్మన్ వాణి భారత్ గౌడ్ జెండా ఊపి ప్రారంభించగా, ఎమ్మెల్యే నూతన మున్సిపల్ డోజర్‌ను ప్రారంభించారు. అనంతరం కార్మి కులతో కలిసి స్వయంగా చీపురు పట్టి రోడ్లను ఊడ్చారు. చెత్తను తట్టతో ఎత్తి ఆటోలో పోసి, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు.



**అభివృద్ధి పనుల వేగవంతం :** పట్టణాలు, గ్రామాలు పరిశుభ్రంగా ఉండా లని, అభివృద్ధి పనులు వేగంగా సాగాలనే ఉద్దేశంతో ఈ 99 రోజుల ప్రణా ళికను రూపొందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి వార్డులో మౌలిక వస తుల కల్పనపై అధికారులు దృష్టి సారించాలని, ప్రజలు ప్రభుత్వ పథకా లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాణి భరత్, వైస్ చైర్మన్ అనురాధ, కౌన్సిలర్లు అబ్బూరి శ్రీధర్, ముక్కెర్ల మల్లేష్, సాధనేని ధనలక్ష్మి మధుకర్, బూడిద మధు, కాటాపర్తిని స్వప్న, బోడ రాధా పాల్గొన్నారు.

# పరిశుభ్రత సహ పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్‌పై దృష్టి



కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/సూర్యాపేట :** 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల 6 నుండి మార్చి 15వ తేదీ వరకు కొనసాగనున్న పరిశు భ్రత కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కోరారు. 99రోజుల ప్రజాపాలన ప్రగతి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మొదటి థీమ్ అయిన పరిశుభ్రత కార్య క్రమాన్ని శుక్రవారం ఆయన సూర్యాపేట మున్సిపాలిటి నుండి ప్రారంభిం చారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుండి కల్నల్ సంతోష్ బాబు చౌరస్తా వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పరిశుభ్రత అవగా హన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిస రాల పరిశుభ్రతతో పాటు పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారిం చనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే అధికారులు తమ తమ కార్యాల యాల్లో ఉన్న పెండింగ్ ఫైల్స్‌ను త్వరితగతిన క్లియర్ చేయాలని ఆదేశిం చారు. అదేవిధంగా మార్చి నెల ఆర్థిక సంవత్సరానికి చివరి నెల కావ డంతో మున్సిపాలిటీల ఆదాయం పెంచేందుకు పన్నుల వసూళ్లను వేగ వంతం చేయాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో గల పెండింగ్ ఫైళ్లను, పారి శుధ్య పనులను త్వరితగతిన పరిష్కరించుటకు తగు చర్యలు తీసుకుంటా మన్నారు. మున్సిపల్ కమీషనర్ హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో పరిశుభ్ర తపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## 99 రోజుల కార్యాచరణను విజయవంతం చేయాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజా ప్రతినిధులు, అధికారులు సమ న్వయంతో ప్రజా పాలప్రగతి ప్రణాళికలో భాగమైన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని లైన్‌వాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 6 నుంచి 31 వరకు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వైద్య సేవలు అందిస్తు న్నట్లు తెలిపారు. డెంటల్, ఓబీజీ, ఆర్థో, ఆప్తమాలజీ, పీడియాట్రి షన్ నిపుణుల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లైన్ వాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆప్త మాలజీ,ఆర్థో, డెంటల్,ఇతర కౌంటర్ల తోపాటు,రిజిస్ట్రేషన్ కౌంటర్ ను పరిశీలించి రోగులతో ముఖాముఖి మాట్లాడారు. సమస్యలను విని తెలుసుకొని వారి సమస్యల పరిష్కారానికి డాక్టర్లను ఆదేశిం చారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి,ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ నేత నరసింహారావు,జిల్లా క్షయ నియం త్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి,లైన్ వాడ యూపీహెచ్ సి డాక్టర్ ఇఫ్తేయార్,లైన్ వాడ కార్పొరేటర్ మహమ్మద్ ఖాజా సమ యుద్దిన్ నదీమ్ ఉన్నారు.





## త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు ఏమి అవసరం ఉందో తెలుసుకొని వాటిని త్వరితగతిన పరిష్క రించేందుకు కృషి చేస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొ న్నారు. శుక్రవారం స్థానిక నకిరేకల్ పట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణా ళిక సన్నహాక సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అంతకు ముందు ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ ఏ. రంజిత్ కుమార్, నకిరేకల్ సిఐ హరిబాబు,కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుదారుల వద్దకే పోలీసులు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణంలోని పద్మా నగర్ కాలనీలో శుక్రవారం మైనర్ బాలిక కిడ్నాప్ ఘటనపై 100 నంబర్‌కు సమాచారం రావడంతో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాలతో వెంటనే స్పందించిన టూ టౌన్ పోలీస్ సిబ్బంది ఫిర్యాదుదారులు పోలీస్ స్టేషన్‌కు రావా ల్సిన అవసరం లేకుండా నేరుగా ఇంటి వద్దకే వెళ్లి న టూ టౌన్ ఎస్ఐ. సైదులు ఫిర్యాదు స్వీకరించి వెంటనే కేసు నమోదు చేసి దాని ప్రతిని ఫిర్యాదుదారికి అందజేశారు.ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా వెంటనే దర్యాప్తు ప్రారంభించి బాలికను త్వరితగతిన గుర్తించి కేసును ఛేదిస్తామని బాధితులకు పోలీసులు భరోసా ఇచ్చారు.ప్రజలకు తక్షణ సేవలు అందిం చడంలో నల్లగొండ పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు.

## ఉపాధ్యాయుడు లేని బాధ నాకు తెలుసు... విద్యార్థులు ఆ పరిస్థితి ఎదుర్కోవద్దు

తెలుగు ఉపాధ్యాయిని నియమింపజేసిన ఎమ్మెల్సీ సత్యంకు ఘన సన్మానం





**ప్రజాపక్షం/మునుగోడు:** తాను పదవ తరగతి చదువుతున్న సమయంలో హిందీ ఉపాధ్యాయుడు లేక ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేసుకుంటూ, ఆ పరిస్థితి ఏ విద్యార్థికీ రాకూడదనే ఉద్దేశంతో పలివెల గ్రామ పాఠశాలకు తెలుగు ఉపాధ్యాయిని నియమించేందుకు కృషి చేశానని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తెలి పారు.శుక్రవారం మండలంలోని పలివెల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు.ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థిగా ఎమ్మెల్సీగా తిరిగి ముఖ్య అతిథిగా రావడం తమకు గర్వకారణమని విద్యార్థులు ఉపాధ్యా యులు తెలిపారు. పాఠశాలకు తెలుగు ఉపాధ్యాయిని నియమించేందుకు కృషి చేసినందుకు పూలమాలలు వేసి,శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ తెలుగు ఉపాధ్యాయిని వెంటనే నియమించాలని డీఈఓకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాటి శ్రీనివాసులు,గ్రామ సర్పం చ్ గజ్జల ధనమ్మ బాలరాజు, ఉపసర్పంచ్ చెరుకు సునీత సైదులు, మాజీ ఎంపీపీ జిను కుంట్ల సాయిలు, మాజీ జెడ్పిటిసి గోస్కొండ లింగయ్య,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గోస్కొండ రాధ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురజా రామచంద్రం, నరసింహ, తీర్పార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ బౌద్ధ భిక్షువుల భిక్షాటన



**ప్రజాపక్షం/నందికొండ:** థాయిలాండ్ దేశానికి చెందిన బౌద్ధ భిక్షువులు నాగా ర్జునసాగర్ పట్టణంలో సంప్రదాయ బౌద్ధ పద్ధతిలో భిక్షాటన నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రంలోని కలబురిగి బుద్ధ విహార నుంచి ప్రారంభమైన 403 కిలోమీ టర్ల దమ్మ పాదయాత్రలో భాగంగా వారు ఇటీవల అంతర్జాతీయ బౌద్ధ కేంద ్రంగా గుర్తింపు పొందిన బుద్ధవనాన్ని చేరుకున్నారు. శుక్రవారం నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని సాగర్ పట్టణంలోని పలు వీధుల్లో సుమారు 20 మంది భిక్షువులు ఇంటింటికీ వెళ్లి భిక్షాటన చేశారు. స్థానిక ప్రజలు భక్తి భావంతో బిస్కెట్లు, చాక్లెట్లు, బ్రెడ్, పండ్లు వంటి ఆహార పదార్థాలను అందజే శారు. విదేశీ భిక్షువులు సంప్రదాయ బౌద్ధ విధానంలో భిక్ష యాత్ర చేయడం స్థానికులను ఆకట్టుకుంది. ఈ నెల 1వ తేదీన బుద్ధవనాన్ని చేరుకున్న భిక్షువులు అక్కడ నిర్వహిస్తున్న పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటూ ఈ నెల 7వ తేదీ వరకు బుద్ధవనంలోనే ఉండనున్నారు. బుద్ధవనాన్ని అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే ప్రయత్నాల నేపథ్యంలో వారి రాక ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది.అదేవిధంగా 403 కిలో మీటర్ల దమ్మ పాదయాత్రలో భిక్షువులతో పాటు నడిచిన "సాతి" అనే శునకం కూడా వారితో కలిసి భిక్షాటనలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో బుద్ధవనం ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర పాల్గొన్నారు.

## బిఆర్ఎఒయు ఆధ్వర్యంలో ఉచిత ఉపాధి శిక్షణ కోర్సులు



**ప్రజాపక్షం/నల్లగొండ :** యువతకు ఉపాధి అవ కాశాలను పెంపొందించేందుకు స్వామి రామా నంద తీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సహకారంతో ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ సెల్ లైజన్ ఆఫీసర్ డాక్టర్ బి.ధర్మా నాయక్ తెలి పారు.నల్లగొండ రీజినల్ కార్యాలయంలో శుక్ర వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ధర్మా నాయక్ మాట్లా డుతూ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఘంటా చక్రపాణి నాయకత్వంలో ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు సాంకేతిక మరియు ఉపాధి ఆధారిత కోర్సులు అందించడమే ప్రధాన లక్ష్యంగా స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వబడుతుందని చెప్పారు.ఈ శిక్షణ కార్యక్రమాల ద్వారా యువతకు మొబైల్ ఫోన్ రిపేరింగ్, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఆటోమొబైల్ సర్వీసింగ్, ఎలక్ట్రిషియన్, సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ వంటి పలు ఉపాధి ఆధారిత కోర్సుల్లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.శిక్షణకు ఎంపికైన వారికి కొన్నిచోట్ల వసతి, భోజన సదుపాయాలు కూడా కల్పించబడే అవకాశం ఉందని తెలిపారు.అర్హతలు,కోర్సుల వివరాలు దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం సంబంధిత నల్ల గొండ లోని రీజినల్ కేంద్రం లేదా ఉమ్మడి జిల్లాలోని అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.విలేకరుల సమావేశంలో రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ . అనిల్ కుమార్ బొజ్జ ఉన్నారు.

# సివిల్స్‌లో అగ్నిహోత్రికి ఫస్ట్ ర్యాంక్





**న్యూఢిల్లీ:** సివిల్స్ పరీక్ష ఫలితాలను శుక్రవారం యుపిఎస్‌సి రిలీజ్ చేసింది. ఎంబిబిఎస్ గ్రాడ్యుయేట్ అయిన అనూజ్ అగ్నిహోత్రి .. సివిల్స్ పరీక్షల్లో టాప్ ర్యాంక్ సాధించినట్లు యుపిఎస్‌సి పేర్కొన్నది. రాజేశ్వరి సువే ఎం రెండవ ర్యాంకు, ఆకాన్ష్ ధుల్ మూడవ ర్యాంకు సాధించారు. అగ్నిహోత్రి వైద్య శాస్త్రాన్ని ఐచ్ఛిక సబ్జెక్టుగా తీసుకొని పరీక్షకు అర్హత సాధించారు. ఆయన రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) నుండి ఎంబిబిఎస్ చేశారు. చెన్నైలోని అన్నా విశ్వవిద్యాలయం నుండి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఇఇఇ)లో బ్యాచిలర్ ఆఫ్ ఇంజనీరింగ్ (బిఇ) డిగ్రీని పొందిన రాజేశ్వరి, సోషియాలజీని ఐచ్ఛిక సబ్జెక్టుగా తీసుకుని రెండవ ర్యాంక్‌ను సాధించింది. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి బ్యాచిలర్ ఆఫ్ కామర్స్ (బికామ్) గ్రాడ్యుయేట్ అయిన ఆకాన్ష్, వాణిజ్యం అకౌంటెన్సీని ఐచ్ఛిక సబ్జెక్టుగా తీసుకుని మూడవ ర్యాంక్‌ను సాధించారు. అర్హత సాధించిన అభ్యర్థులలో మొదటి ఐదుగురిలో ఒక మహిళ, నలుగురు పురుష అభ్యర్థులు ఉన్నారు. రాఘవ్ ఝున్‌ఝున్‌వాలా నాల్గొవ, ఇషాన్ భట్నాగర్ ఐదవ ర్యాంక్‌లను పొందారు. టాప్ 25 మంది అభ్యర్థులలో 11 మంది మహిళలు, 14 మంది పురుషులు ఉన్నారు. వీరంతా ఇంజినీరింగ్, హ్యూమానిటీస్, సైన్స్, కామర్స్, లా, మెడికల్ సైన్స్, మాస్ మీడియా వంటి సబ్జెక్టుల్లో ఐఐటీ, ఐఐటీ, ఎన్ఎల్‌యూ, ఎయిమ్స్, డీటీయూ, అన్నా యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ, యూనివర్సిటీ ఆఫ్ ముంబయి తదితర ఉన్నత విద్యాసంస్థల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారే. అలాగే, ఆంత్రోపాలజీ, కామర్స్ అండ్ అకౌంటెన్సీ, కెమిస్ట్రీ, ఎకనమిక్స్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, హిస్టరీ, మ్యాథమెటిక్స్, మెడికల్ సైన్స్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ వంటి సబ్జెక్టులను ఆప్షనల్ ఛాయిస్‌గా ఎంచుకొని సివిల్స్‌లో మెరిశారు. మొత్తం 958 మంది అభ్యర్థులు అర్హత సాధించగా, 659 మంది పురుషులు, 299 మంది మహిళలు పరీక్షకు అర్హత పొందారు. వీరంతా కేంద్ర పౌర సేవలకు నియామకం కోసం సిఫార్సు చేయబడ్డారని కమిషన్ తెలిపింది. సిఫార్సు చేయబడిన 348 మంది అభ్యర్థుల అభ్యర్థిత్వాన్ని తాత్కాలికంగా ఉంచినట్లు తెలిపింది. 2025 సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్షను గత సంవత్సరం మే 25న నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 9,37,876 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 5,76,793 మంది వాస్తవానికి పరీక్షకు హాజరయ్యారు. అర్హత సాధించిన అభ్యర్థులలో, 317 మంది జనరల్ కేటగిరీకి చెందినవారు ఉండగా, 104 మంది ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందినవారు (ఇడబ్ల్యుఎస్), 306 మంది ఇతర వెనుకబడిన తరగతులకు చెందినవారు (ఒబిసి), 158 మంది షెడ్యూల్డ్ కులాలకు చెందినవారు (ఎస్‌సి), 73 మంది షెడ్యూల్డ్ తెగలకు (ఎస్‌టి)లకు చెందిన వారు ఉన్నారు. ఇద్దరు అభ్యర్థుల ఫలితాలను నిలుపుదల చేసినట్లు కమిషన్ తెలిపింది. సివిల్ సర్వీసెస్ పరీక్ష ద్వారా 1,087 ఖాళీలను భర్తీ చేయాలని కేంద్రం వెల్లడించింది.

### సివిల్స్‌లో మెరిసిన తెలుగు తేజాలు

సివిల్స్ ఫలితాల్లో పలువురు తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. జశ్వంత్ చంద్ర 23వ ర్యాంకుతో మెరవగా.. సృజన 55వ ర్యాంకు, భానోత్ లక్ష్మి రచన 178, డీఎస్‌కే ప్రచేత్ 193, ఎస్ వర్షిత్ రెడ్డి 259, ఎం.పవన్‌కుమార్ రెడ్డి 297, వెలిమినేటి విక్రమసింహారెడ్డి 541, గుమ్మల శ్వేత 573, పల్లి ప్రమోద్ విష్ణు 640, వెలిమినేటి విజయసింహారెడ్డి 682, పోతుపురెడ్డి భార్గవ్ 738, పుదారి రాహుల్ 748, కుమ్మరి శ్రవణ్‌కుమార్ 768, అనిరుధ్ కత్తిమాని 786, కోరపోతుల శ్రీకర్‌రాజు 806, ఇస్లావత్ శ్రీరామ్ హర్ష 823, కట్టా ప్రత్యూష 908, గోగుల రాజశేఖర్ 920, గుగులోతు జితేందర్ నాయక్ 939వ ర్యాంకులతో తమ విశేష ప్రతిభను చాటారు.

### తెలంగాణ సిఎం అభినందనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సివిల్ సర్వీసెస్ – 2025 ఫైనల్ ఫలితాల్లో విజయం సాధించిన తెలంగాణ అభ్యర్థులందరికీ తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. సివిల్ సర్వీసెస్ 2025 ఫైనల్ ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటారు. సివిల్స్ సాధించే లక్ష్యంతో ప్రిపేరయ్యే పేద కుటుంబీకులకు అండగా నిలిచేందుకు రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. సింగరేణి సంస్థ అధ్వర్యంలో సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు హాజరైన 202 మంది అభ్యర్థుల కు లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించింది. రాజీవ్ సివిల్స్ అభయ హస్తం సాయం అందుకున్న అభ్యర్థుల్లో 51 మంది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. వీరిలో 20 మంది సివిల్స్ తుది ఫలితాల్లో మంచి ర్యాంకులతో విజేతలుగా నిలిచారు.

రాజకీయాలు, అంతర్జాతీయ సంబంధాలు

# ‘చీకటి’ వైపు పరుగులు

### రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ:** ప్రస్తుత కాలంలో రాజకీయాలు, అంతర్జాతీయ సంబంధాలు ‘చీకటి వైపు’ పరుగెత్తుతున్నాయని, జ్ఞానం నుంచి దూరంగా ఉన్నాయని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ శుక్రవారం అన్నారు. రాజకీయాలు లేదా అంతర్జాతీయ సంబంధాలలో అవతలి వ్యక్తిని అర్థం చేసుకునే ప్రయత్నం జరగలేదని, భిన్నాభిప్రాయాల కారణంగా హింసకు పాల్పడుతున్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత విమర్శించారు. ‘నేడు, మన రాజకీయాల్లో, అంతర్జాతీయ సంబంధాలలో ప్రతి ఒక్కరూ చీకటి వైపు పరుగెత్తుతున్నారని, జ్ఞానం నుంచి దూరంగా ఉన్నారని మనం చూస్తున్నాం. అవతలి వ్యక్తిని అర్థం చేసుకునే ప్రయత్నం లేదు. మీరు వారిని బాంబు పేల్చి చంపేస్తారు’ అని అన్నారు. ‘మన రాజకీయాల్లో కూడా అంతే. మీరు ఎవరితోనూ ఏకీభవించరు. ఆ వ్యక్తిపై దాడి చేస్తారు లేదా వారి పట్ల హింసాత్మకంగా మారతారు’ అని తెలిపారు. మహాత్మాగాంధీ, సంస్కరణవాద సాధువు శ్రీ నారాయణ గురు మధ్య జరిగిన సమావేశానికి సంబంధించిన శతాబ్ది జ్ఞాపకార్థం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ గాంధీ, నారాయణ గురు ఇద్దరూ అలాంటి హింసను వ్యతిరేకించారని, ప్రజల మధ్య ప్రేమ, గౌరవం, క్షమాపణ, అవగాహనను సమర్థించారని తెలిపారు. నారాయణ గురు, మహాత్మా గాంధీ సూచించిన ఈ విలువలు కూడా రాజ్యాంగంలో ఉన్నాయని అన్నారు. ప్రజలు అనుసరించాల్సిన దిశను చూపించిన మార్గదర్శకులు, గురువులని వారిద్దరినీ ఆయన ప్రస్తావించారు. నారాయణ గురు విగ్రహానికి పూలమాలలు వేసి, ప్రతిమ ముందు నివాళులర్పించడం ఎవరికైనా సులభమని, కానీ ఆయన బోధనలను అనుసరించడమే సవాలు అని రాహుల్ అన్నారు. ఆ సమయంలో మహాత్మా గాంధీ ప్రపంచంలోనే అత్యంత బలమైన సామ్రాజ్యంతో పోరాడారని, వారు ఆయనకు ఏమి చేసినా, ఆయన ప్రభావితం కాలేదని కూడా కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ఆ బలమైన వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటంలో నారాయణ గురు వంటి వ్యక్తుల నుంచి మహాత్మాగాంధీ ప్రేరణ పొంది వారితో మాట్లాడారని చెప్పారు. ‘బ్రిటీషు వారికి వ్యతిరేకంగా మహాత్మా గాంధీ చేసిన పోరాటం నుంచి... శక్తికి, బలప్రయోగానికి మధ్య వ్యత్యాసం ఉందని నేను గ్రహించాను’ అని రాహుల్ అన్నారు. ‘భారతదేశంలో రాజకీయ పోరాటం కూడా చాలా పోలి ఉంటుంది. ఒక వైపు సత్యం, అహింస, వినయం, మరోవైపు కోపం, హింస, ద్వేషం, అహంకారం ఉన్నాయి. హింస, కోపం ఉన్నవారికి శక్తి ఉండవచ్చు. కానీ వారికి శక్తి లేదు. ఎందుకంటే నారాయణ గురూజీ, మహాత్మా గాంధీజీ వంటి వ్యక్తుల స్ఫూర్తి. వాస్తవానికి భారతదేశ స్ఫూర్తి ప్రాథమికంగా సత్యం, అహింస అనే ఆలోచనపై ఆధారపడి ఉంటుంది’ అని అన్నారు. కాంగ్రెస్ ఎంపీగా ఇక్కడికి రావడం తనకు దక్కిన గొప్ప గౌరవమని రాహుల్ గాంధీ తెలిపారు.

# పశ్చిమాసియా దేశాల్లో సిబిఎస్‌ఇ పరీక్షలు రద్దు



**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఆ దేశాల్లో జరగాల్సిన 10వ తరగతి బోర్డు పరీక్షలన్నీ రద్దు చేస్తున్నట్టు, 12వ తరగతి పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు సిబిఎస్‌ఇ ఒక ప్రకటనలో తెలిపింది. పశ్చిమాసియాలో ఉన్న బహ్రెయిన్, ఇరాన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ తదితర దేశాల్లో ఈ నెల ఏడో తేదీ నుంచి 11 వరకు జరగాల్సిన పరీక్షలన్నీ రద్దు చేస్తున్నట్టు తెలిపారు. అంతకుముందు ఈ నెల రెండు, ఐదు, ఆరు తేదీల్లో జరగాల్సి ఉన్న, వాయిదా పడిన పరీక్షలను కూడా రద్దు చేసినట్టు బోర్డు వెల్లడించింది. ఏడో తేదీన జరగాల్సిన 12వ తరగతి పరీక్ష వాయిదా పడిందని తెలిపింది. అంతకుముందే ఈ నెల రెండు, ఐదు తేదీల్లో జరగాల్సిన పరీక్షలను బోర్డు ఇప్పటికే వాయిదా వేసింది.

గత కొంత కాలంగా నియమాల ఆధారిత ప్రపంచ క్రమాన్ని...

# ‘నెమ్మదిగా ధ్వంసం’ చేస్తున్నారు

- రాజ్యసభ ఎంపి కపిల్‌సిబల్ కీలక వ్యాఖ్యలు
- ఇరాన్ రాయబార కార్యాలయం పుస్తకంలో ఖొమేనీ హత్యపై సంతాపం తెలుపుతూ సంతకం



**న్యూఢిల్లీ:** గత కొంతకాలంగా నియమాల ఆధారిత ప్రపంచ క్రమాన్ని ‘నెమ్మదిగా కూల్చివేస్తున్నారని’ ప్రముఖ సీనియర్ న్యాయవాది, రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ ఆవేదన వ్యక్తంచేశారు. ఆ ధోరణి ప్రపంచ శాంతికి మంచిది కాదని హితవు పలికారు. అమెరికాఇజ్రాయెల్ దేశాలు ఉమ్మడిగా టెహ్రాన్‌పై నిర్వహించిన సంయుక్త దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖొమేనీ మరణించారు. ఖొమేనీ మరణించిన కొద్ది రోజుల తర్వాత, కపిల్ సిబల్ శుక్రవారం ఇక్కడి ఇరాన్ రాయబార కార్యాలయాన్ని సందర్శించి అక్కడి పుస్తకంలో ఖొమేనీ హత్యపై సంతాప తెలియజేస్తూ సంతకం చేశారు. అనంతరం కపిల్ సిబల్ విలేకరులతో మాట్లాడుతూ ‘అయతుల్లా ఖొమేనీ హత్యపై నా హృదయపూర్వక ప్రగాఢ సంతాపాన్ని తెలియజేయడానికి నేను ఇక్కడకు వచ్చాను’ అని వారి ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. సామూహిక విధ్వంసక ఆయుధాల ద్వారా కాకుండా, సంభాషణల ద్వారా విభేదాలను పరిష్కరించుకోవాలని వ్యక్తిగతంగా తాను నమ్ము తున్నానని, ప్రతీ దేశం కూడా నమ్ముతోందని కచ్చితంగా విశ్వసిస్తున్నానని, ప్రపంచ క్రమాన్ని కాపాడుకోవడానికి అలా చేయడం అవసరం కూడా అని కపిల్ సిబల్ అన్నారు. వాస్తవానికి రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ సమాజం నియమాల ఆధారిత ప్రపంచ క్రమాన్ని ఏర్పరచాలని నిర్ణయించుకుందని ఆయన చెప్పారు. కానీ దురదృష్టవశాత్తు గత రెండు సంవత్సరాలుగా ఆ నియమాల ఆధారిత ప్రపంచ క్రమాన్ని నెమ్మదిగా కూల్చివేస్తున్నారని తాను భావిస్తున్నానని, అది ప్రపంచ శాంతికి మాత్రమే కాకుండా ఏ దేశానికీ కూడా మంచిది కాదని, ఎందుకంటే దేశాలు బలమే సరైనదని నమ్మే పరిస్థితికి మనం తిరిగి రాలేమని, అదే అడవి చట్టమని కపిల్ సిబల్ అన్నారు. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై సైనిక దాడులు ప్రారంభించాయి. సైనిక దాడి తర్వాత ఇరాన్ ప్రధానంగా యుఎఇ, బహ్రెయిన్, కువైట్, జోర్డాన్, సౌదీ అరేబియా సహా పలు గల్ఫ్ దేశాలలోని అమెరికా, ఇజ్రాయెల్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని వరుస దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. గత కొద్ది రోజులుగా ఈ సంఘర్షణ విస్తృతం అవుతోంది. ఇరుపక్షాల నుంచి దాడులు, ప్రతిదాడులు కొనసాగుతున్నాయి. చర్చల ద్వారా సంఘర్షణలను పరిష్కరించుకోవాలని భారత దేశం పిలుపునిచ్చింది.

# ఉత్పాదకత, ఎగుమతి బలాన్ని రైతులు పెంచాలి

### ప్రధాని మోదీ పిలుపు

### వ్యవసాయం ఒక వ్యూహాత్మక స్తంభమని ఉద్ఘాటన



**న్యూఢిల్లీ :** ఉత్పాదకత, ఎగుమతి బలాన్ని పెంచడానికి భారతదేశంలోని వైవిధ్యమైన వాతావరణాన్ని ఉపయోగించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ రైతులకు పిలుపునిచ్చారు. దేశ వ్యవసాయ ఉత్పత్తులు ప్రపంచంతో పోటీపడేలా అధిక విలువ కలిగిన పంటలను ఉత్పత్తి చేయాలని నొక్కిచెప్పారు. ఆయన శుక్రవారం ‘వ్యవసాయం, గ్రామీణ పరివర్తన’ అనే అంశంపై బడ్జె ట్ అనంతర వెబ్‌నార్‌ను ఉద్దేశించి ప్రసంగించా రు. ప్రపంచ నాణ్యత, బ్రాండింగ్ ప్రమాణాలను చేరుకోవడానికి నిపుణులు, పరిశ్రమలు, రైతులతో కూడిన ఏకీకృత విధానం కోసం ప్రధాని పిలుపునిచ్చారు. స్థానిక రైతులు ప్రపంచ మార్కెట్లతో అనుసంధానం అవడానికి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. మన వ్య వసాయాన్ని ఎగుమతి ఆధారంగా మార్చడంపై మరింత చర్చ జరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వైవిధ్యమైన వాతావరణాన్ని భారతీయ రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నా రు. 202627 బడ్జెట్ జీడిపప్పు, కొకోవా, గం ధపు చెక్క తదితర అధిక విలువ కలిగిన వ్యవసాయంపై కూడా దృష్టి సారించిందని ప్రధానమం త్రి చెప్పారు. ఈశాన్య ప్రాంతాలలో అగర్ ఉడ్ ను ప్రోతహించడానికి, హిమాలయన్ రాష్ట్రాల లో సమశీతోష్ణ గింజ పంటలను ప్రోత్సహించడానికి బడ్జెట్ ప్రతిపాదనను కూడా మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. నేడు ప్రపంచం ఆరోగ్యం గురించి బాగా అవగాహన పెంచుకుంటోందని , సమగ్ర ఆరోగ్య సంరక్షణ, సేంద్రీయ ఆహారం పై ప్రభుత్వం బలమైన దృష్టి పెడుతున్నదని ప్రధానమంత్రి తెలిపారు. భారతదేశ వ్యూహాత్మక ప్రయాణంలో వ్యవసాయం ఒక వ్యూహాత్మక స్తంభమని మోదీ నొక్కిచెప్పారు. ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిరంతరం బలోపేతం చేస్తున్నదని పేర్కొన్నారు. భారతదేశం ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద చేపల ఉత్పత్తిదారు అని, మన వివిధ జలాశయాలు, చెరువులలో 4.5లక్షల టన్నుల చేపలు ఉత్పత్తి అవుతున్నాయని చెప్పారు. అదనంగా మరో 20లక్షల టన్నుల చేపల ఉత్పత్తికి అవకాశం ఉందని తెలియజేశారు. మత్స్య పరిశ్రమ ఎగుమతుల వృద్ధికి ప్రధాన వేదికగా మారుతోందని ప్రధానమంత్రి వివరించారు. నష్టాలను తగ్గించడానికి పంట వైవిధ్యీకరణను సమర్థించారు. వ్యవసాయంలో సాంకేతిక స ంస్కృతిని తీసుకురావడానికి ప్రభుత్వం గొప్ప ప్రాధాన్యత ఇస్తుందని మోదీ నొక్కిచెప్పారు. సం స్థలు సహా వ్యవస్థాపకులు సాంకేతికతను ఏకీకృ తం చేసినప్పుడు అది మంచి ఫలితాలను ఇస్తుందన్నారు. లఖ్‌పతి దీదీ ప్రచారం గురించి ప్రధానమంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ 2029 నాటికి 3 కోట్ల మంది విజయవంతమైన మహి ళా పారిశ్రామికవేత్తలను సృష్టించడం లక్ష్యంగా మోదీ నిర్దేశించారు. గ్రామీణ భూభాగాన్ని శక్తివంతం చేయడానికి వ్యవసాయంఫిన్‌టెక్ సరఫరా గొలుసులలో నిల్వ, ఆవిష్కరణ రంగాలలో పెట్టుబడులను పెంచాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యవస్థాపకులను కోరారు.

# కూలిన సుఖోయ్-30 ఎంకెఐ ఫైటర్ జెట్

### ఇద్దరు పైలట్లు మృతి



**న్యూఢిల్లీ :** అసోంలో సుఖోయ్–30 ఎంకెఐ ఫైటర్‌జెట్ కూలిన ఘటనలో ఇద్దరు పైలట్లు మృతిచెందారు. ఈ మేరకు భారత వైమానిక దళం ఎక్స్‌లో పోస్టు చేసింది. స్క్వాడ్రన్ లీడర్ అనూజ్, ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్ కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపింది. కర్బీ ఆంగ్లాంగ్ జిల్లాలో గురువారం రాత్రి సుఖోయ్–30 యుద్ధవిమానం కూలిపోయింది. జోర్హాట్ వైమానిక స్థావరం నుంచి ్ఠంచి అయిన కొద్దిసేపటికే రాడార్ నుంచి యుద్ధవిమానం అకస్మాత్తుగా అదృశ్యమైంది. తెల్లవారుజామున యుద్ధవిమాన శకలాలను గుర్తించామని ఎఐఎఫ్ అధికార ప్రతినిధి తెలిపారు. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. కాగా, ఈ విమానం జోర్హాట్ నుంచి బయల్దేరినట్లు, రాత్రి 7.42 గంటల సమయంలో చివరి కాంటాక్ట్ నమోదైనట్లు సమాచారం.

#### విమాన ప్రమాదంపై సంతాపం వ్యక్తం చేసిన పలువురు నేతలు

ఇదిలా ఉండగా, సుఖోయ్ యుద్ధ విమానం కూలిపోయి ఇద్దరు పైలట్లు మృతిచెందిన నేపథ్యంలో పలువురు ప్రముఖులు స్పందించారు. ఫైటర్ జెట్ ప్రమాదంలో ఇద్దరు భారత వైమానిక దళ పైలట్లు మృతిచెందడం పట్ల అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ శుక్రవారం సంతాపం వ్యక్తం చేశారు. ఈ బాధాకరమైన సమయంలో దేశం మొత్తం మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఫైటర్ జెట్ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు చనిపోవడం చాలా బాధాకరమని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. సుఖోయ్ దర్ఘటనపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన భారత వైమానిక దళ పైలట్లకు నివాళులర్పిస్తున్నాను. ‘సుఖోయ్ విమాన ప్రమాదంలో భారత వైమానిక దళ సైనికులు స్క్వాడ్రన్ లీడర్ అనూజ్, ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్ దురాగ్కర్ చనిపోవడం బాధాకరం. వారికి నా హృదయపూర్వక నివాళి అర్పిస్తున్నాను. ఈ బాధాకరమైన పరిస్థితిలో వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఈ దుఃఖ సమయంలో మొత్తం దేశం వారికి అండగా ఉంటుంది‘ అని రాహుల్ గాంధీ తెలిపారు. మరోవైపు, ఈ ప్రమాదంపై అసోం కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ స్పందించారు. ప్రమాదంలో ఇద్దరు పైలట్లు చనిపోవడం బాధకరమన్నారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపుతున్నానని చెప్పారు. పైలట్ల త్యాగాన్ని ఎన్నటికీ మరచిపోలేమన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# ఈ నెలాఖరుకు నక్సలిజం నుంచి విముక్తి: అమిత్ షా

**కటక్:** దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఒడిశాలోని కటక్‌లో జరిగిన సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) 57వ రైజింగ్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ మార్చి నెలాఖరు నాటికి భారతదేశం నక్సలిజం నుంచి పూర్తి విముక్తి పొందుతుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలోనే నిర్ణయించుకున్న లక్ష్యం ప్రకారం, దేశాన్ని నక్సలిజం రహితంగా మార్చే ప్రక్రియ తుది దశకు చేరుకుందని ఆయన వివరించారు. ముఖ్యంగా ఒకప్పుడు మావోయిస్టులు కలలుగన్న ‘తిరుపతి నుంచి పశుపతి’ వరకు రెడ్ కారిడార్‌ను నిర్మించాలనే కలలను భద్రతా దళాలు పూర్తిగా నాశనం చేశాయని కొనియాడారు. నక్సలిజం పీడను వదిలించడంలో సీఆర్‌పీఎఫ్, కోబ్రా బెటాలియన్ల అసాధారణ కషిని అమిత్ షా ప్రశంసించారు. భద్రతా దళాల పటిష్ట వ్యూహాల వల్ల నక్సల్స్ ప్రభావం ఇప్పుడు చాలా తక్కువ ప్రాంతాలకు, అది కూడా కొన్ని మారుమూల ప్రాంతాలకే పరిమితమైందని పేర్కొన్నారు. అభివద్ధికి అడ్డుపడుతూ, పాఠశాలలు, ఆసుపత్రులను ధ్వంసం చేసే మావోయిస్టుల పట్ల ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడదని ఆయన హెచ్చరించారు. ఆయుధాలు పట్టి అమాయకులను పొట్టనబెట్టుకునే వారికి ఆయుధాలతోనే సమాధానం చెబుతామని కఠిన హెచ్చరికలు చేశారు. మావోయి జం వల్ల దశాబ్దాలుగా వెనుకబడిన గిరిజన ప్రాం తాల్లో ఇప్పుడు అభివద్ధి పరుగులు తీస్తోందని అ మిత్‌షా వివరించారు. గతంలో ఎన్నడూ లేని వి ధంగా చత్తీస్‌గఢ్‌లోని బస్తర్ వంటి మారుమూల ప్రాంతాల్లో ఇప్పుడు రోడ్లు, విద్యుత్, మొబైల్ ర హదారులు వంటి మౌలిక సదుపాయాలు వేగ ంగా అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు హింసకు నిలయంగా ఉన్న ఆ ప్రాంతాలు అభివద్ధికి చిహ్నాలుగా మారుతున్నాయని చెప్పుకొచ్చారు.

# యుద్ధం కారణంగా 23 వేల విమానాలు రద్దు

### ఇండిగోపై తీవ్ర ప్రభావం



**న్యూఢిల్లీ:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరుపుతున్న దాడుల కారణంగా పశ్చిమాసియాలో తలెత్తిన ఉద్రిక్తతల ప్రభావం విమానయాన రంగంపై తీవ్రంగా పడింది. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 23 వేలకు పైగా విమాన సర్వీసులు రద్దు కాగా, విమానయాన సంస్థలకు 100 కోట్ల డాలర్లకుపైగా (సుమారు రూ.9,165 కోట్లు) నష్టం వాటిల్లింది. పాసింజర్ ట్రాఫిక్ కోసం గల్ఫ్ రూట్లపై ప్రధానంగా ఆధారపడే భారత విమానయాన సంస్థలు యుద్ధ ప్రారంభ రోజుల్లో తీవ్రంగా ప్రభావితమయ్యాయి. మార్చి ప్రారంభం నాటికి 1,221 భారతీయ విమానాలు రద్దయినట్లు పౌర విమానయాన శాఖ తెలిపింది. దుబాయ్, అబు ధాబి, యూఏఈలోని షార్జా, జెడ్డా, రియాద్, సౌదీ అరేబియాలోని దమ్మమ్, ఒమన్‌లోని మస్కట్, ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ సహా ప్రధాన రూట్లలో రోజూ ప్రధాన విమానయాన సంస్థల సర్వీసుల నిలిపివేత జరిగింది. నిలిచిపోయిన ప్రయాణికులను స్వదేశానికి తీసుకువచ్చేందుకు దుబాయ్, జెడ్డా నుంచి ప్రత్యేక విమానాలను చాలా పరిమితంగా ఎయిర్ ఇండియా నిర్వహిస్తోంది. దేశంలో అత్యధికంగా విమాన సర్వీసులను నడిపే ఇండిగోపై యుద్ధ ప్రభావం తీవ్రంగా కనబడుతోంది. గల్ఫ్ రూట్లలో రోజూ 65 ట్రిప్పులను ఇండిగో నిర్వహిస్తుంది. ఫిబ్రవరి 28 నుంచి మార్చి మూడో తేదీ వరకు 500కిపైగా పశ్చిమాసియా, కొన్ని అంతర్జాతీయ విమాన సర్వీసులను ఇండిగో రద్దు చేసింది. ఈ నెల మూడో తేదీన 162 విమానాలు రద్దయ్యాయి. భారత్ నుంచి దోహ, దుబాయ్, అబు ధాబి వంటి నగరాలకు వెళ్లే ట్రాఫిక్‌పై తీవ్ర ప్రభావం పడింది. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ తన యావత్ గల్ఫ్ రూట్లయిన బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ సహా అంతర్జాతీయ సర్వీసులను ఈ నెల ఒకటో తేదీ వరకు రద్దు చేసింది. స్పైస్ జెట్ తన యూఏఈ, ఇతర గల్ఫ్ నగరాలకు విమాన సర్వీసులను రద్దు చేసింది. అంతర్జాతీయంగా పరిశీలిస్తే పశ్చిమాసియాలో నిర్వహించే 36,000 షెడ్యూల్డ్ విమానాలలో సగానికిపైగా రద్దయ్యాయి. యుద్ధం ప్రారంభమైన రోజుల్లో రెవెన్యూ నష్టం 260 కోట్ల డాలర్లు (రూ. 23,830 కోట్లు) ఉంటుందని సిరియం అనలిటిక్స్ అంచనా. గగనతల మూసివేతలు లేదా ఆంక్షలు ప్రధానంగా ఇరాన్, ఇరాక్, ఇజ్రాయిల్, జోర్డాన్‌ను ప్రభావితం చేశాయి. బహ్రెయిన్‌లో విమానాల రద్దు 97 శాతం జరిగింది. ఖతార్‌లో ఇది 86 శాతం, కువైట్‌లో 81 శాతం ఉంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో కొన్ని రోజులు 81 శాతం వరకు విమానాల రద్దు జరిగింది. దుబాయ్, అబు ధాబి విమానాల రద్దుకు తీవ్రంగా ప్రభావితం కాగా సౌదీ అరేబియా, ఒమన్, సిరియా, లెబనాన్‌లో పాక్షిక ఆంక్షల విధింపు జరిగింది. దుబాయ్ నుంచి రాకపోకలను యూఏఈకి చెందిన ఎమిరేట్స్ శనివారం వరకు రద్దు చేసింది. నిలిచిపోయిన ప్రయాణికులను తీసుకువచ్చేందుకు, సరకుల రవాణా కోసం మాత్రమే పరిమితంగా కొన్ని విమానాలను నడుపుతోంది. నిత్యం వందల సంఖ్యలో విమానాలు నడిపే ఎమిరేట్స్ ఇటీవల ఒకే రోజు 338 విమానాలను రద్దు చేసింది. ఖతార్ ఎయిర్‌లైన్స్ కూడా దోహ నుంచి తన విమానాల రాకపోకలను రద్దు చేసింది. అబు ధాబికి చెందిన తిహాద్ ఎయిర్‌వేస్ కూడా శుక్రవారం వరకు తన సర్వీసులను నిలిపివేసింది. యూఏఈకి చెందిన తక్కువ చార్జీలను వసూలు చేసే ఫ్లైదుబాయ్ కూడా తన సర్వీసులను దుబాయ్, రియాద్‌తోసహా ఇతర గల్ఫ్ దేశాలలో నిలిపివేసింది. యునైటెడ్ ఎయిర్‌లైన్స్ తన అమెరికాటెల్‌అవీవ్‌దుబాయ్ రూట్లను రద్దు చేసింది. హాంకాంగ్ నుంచి దుబాయ్, రియాద్‌కు క్యాథే పసిఫిక్ ఎయిర్‌లైన్స్ తన సర్వీసులను ఈ నెల 14 వరకు రద్దు చేసింది.

# ఉగ్ర ప్రచారం... ఇంజినీరింగ్ విద్యార్థి అరెస్ట్

**ముంబయి:** ఉగ్ర సంస్థలతో సంబంధమున్న ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అధికారులు అరెస్ట్ చేశారు. పాక్‌కు చెందిన నిషేధిత ఉగ్ర సంస్థల హ్యాండ్లర్‌లతో మహారాష్ట్రకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి అయాన్ షేక్ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లలో వారు పంపుతున్న ఉగ్ర సమాచారాన్ని అతడు సోషల్‌మీడియాలో ఇతర విద్యార్థులకు షేర్ చేస్తున్నట్లు వెల్లడించారు. నిందితుడి ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకొని... ఫోరెన్సిక్ పరీక్షలకు పంపామన్నారు. అయాన్ షేక్‌కు ఉగ్ర హ్యాండ్లర్‌లతో సంబంధం ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామని అధికారులు పేర్కొన్నారు. ఉగ్ర సంస్థ ‘జైషే మహమ్మద్’ చీఫ్ మసూద్ అజార్ ప్రసంగాలకు సంబంధించిన వివిధ వీడియోలు అతడి మొబైల్ ఫోన్‌లో ఉన్నాయన్నారు. ఈ వీడియోల ద్వారా యువతను ఉగ్రవాదం వైపు ప్రోత్సహించడానికి, ఉగ్ర కార్యకలాపాలకు నిధులు సమకూర్చడానికి ప్రయత్నించినట్లు తేలిందన్నారు. ఉగ్రవాదులకు సంబంధించిన ఎన్‌క్రిప్టెడ్ టెలిగ్రామ్ గ్రూపులలో ఇతర విద్యార్థులను చేర్చుతున్నాడన్నారు. ఈ కేసుకు సంబంధించి మరో ఇద్దరు యువకులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ కేసుతో ఇంకెవరికైనా సంబంధం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# సిఎం రేసులో సామ్రాట్ చౌదరి, నిత్యానందరాయ్

### రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా బిహార్ పరిణామాలు

### డిప్యూటీసిఎంగా నితీశ్ తనయుడు?



**పట్నా:** బిహార్‌లో తాజా పరిణామాలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.సిఎం నితీశ్‌కుమార్ రాజ్యసభకు నామినేషన్ వేయడంతో బిజెపిసర్కార్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. దీంతోసిఎం, డిప్యూటీసిఎం పదవులు ఎవరికి దక్కుతాయన్న విషయమై చర్చ జరుగుతోంది. మరోపక్క బిజెపిఆధిపత్యంతో జెడియులో తమ ఉనికి పట్ల ఆ పార్టీకి చెందిన కొందరు సీనియర్ నేతల్లో ఆందోళన మొదలైంది. సుదీర్ఘకాలంసిఎంగా కొనసాగిన నితీశ్‌కుమార్ రాజ్యసభకు వెళ్లనుండటంతో కాషాయ పార్టీకి మార్గం సుగమమైంది. అయితే బిజెపినుంచి సిఎం రేసులో బిహార్ ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అయితే మధ్యప్రదేశ్, రాజస్థాన్, దిల్లీ, ఒడిశాలో మాదిరిగా అనూహ్యంగా కొత్తవారికి అవకాశం దక్కే అవకాశం లేకపోలేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. బిహార్ ఉపముఖ్యమంత్రి, హోంశాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్న సామ్రాట్ చౌదరి కోయెరీ ఒబిసి సామాజికవర్గానికి చెందినవారు. ఈ వర్గానికి ఇప్పటివరకుసిఎం అయ్యే అవకాశం రాలేదు. ఆయనను పెద్ద నాయకుడిని చేస్తామని ఎన్నికల ప్రచారంలో అమిత్ షా ప్రకటించారు. అయితే సామ్రాట్ చౌదరి ఆర్జేడీ నుంచి వచ్చి పదేళ్లు కూడా కాకపోవడంతో బిజెపిఅధినాయకత్వం ఆయనపై ఎంతవరకు విశ్వాసం చూపుతుందన్నది ఆసక్తి రేపుతోంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ అయోధ్య ఉద్యమ సమయం నుంచి ఎబిసిపిలో, ఆరెస్సెస్‌లో చురుకైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆయన బిహార్‌లో అత్యధిక జనాభా కలిగిన యాదవ సామాజిక వర్గానికి చెందినవారు. నిత్యానందరాయ్‌కు అవకాశం ఇస్తే అగ్రవర్ణాలు, నీతీష్ కుమార్ వర్గానికి చెందిన కుర్మీలు, ఇతర అత్యంత వెనుకబడినవర్గాల నుంచి వ్యతిరేకత రావచ్చని బిజెపివర్గాలు భావిస్తున్నాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ, ఒడిశా మాదిరిగా ఎవరూ ఊహించని నాయకుడు లేదా అగ్రవర్ణాలకు చెందిన నేతకుసిఎం పీఠం దక్కే అవకాశం ఉందని కొందరు బిజెపినేతలు అభిప్రాయపడుతున్నారు. మండల్ ఉద్యమం తర్వాతసిఎం పీఠం అగ్రవర్ణాలకు దూరమనే అనుమానాలను యూపీ, రాజస్థాన్, మహారాష్ట్రల్లో చెరిపేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. బిహార్‌లో కూడా అర్హత ఆధారంగానేసిఎం అభ్యర్థి ఎంపిక జరగొచ్చని బిజెపినేతలు అంటున్నారు.

# సార్వభౌమాధికారం తాకట్టు?

రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేసుకునేందుకు భారతదేశం పట్ల అమెరికా దయ తలిచింది. ఆ దేశం నుంచి చమురు ససేమిరా కొనకూడదని గతంలో జారీ చేసిన హుకుంకు నెల రోజుల సడలింపును ప్రకటించింది. అది అమెరికా ఖజానా కార్యదర్శి (ఆర్థిక మంత్రి) స్కాట్ బెస్సెంట్ ఒక చిన్న ట్వీట్ ద్వారా ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు రవాణా కొనసాగేందుకు వీలుగా రష్యన్ చమురును భారతీయ రిఫైనరీలు కొనుగోలు చేసేందుకు వీలుగా తాత్కాలికంగా 30 రోజుల పాటు మినహాయింపును ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అదే సందేశంలో అమెరికాకు భారత్ ముఖ్యమైన భాగస్వామి అని, అమెరికా నుంచి చమురు కొనుగోలును న్యూఢిల్లీ మరింత పెంచుతుందని భావిస్తున్నామని సన్నాయి నొక్కులు నొక్కారు. ఈ ప్రకటన భారతదేశ స్వతంత్ర ప్రతిపత్తికి తీవ్ర విఘాతం. ఏ దేశం నుంచి చమురు కొనుగోలు చేయాలి, లేదా కొనకూడదు అని నిర్ణయించాల్సిన నిర్ణయాధికారం మన సొంతం. అంతే తప్ప మరొకరు మనల్ని నియంత్రించటమనేది ఘోర అవమానం. వరుస ఘటనలు, పరిణామాలతో140 కోట్ల జనాభా కలిగిన అతి పెద్ద ప్రజాస్వామ్యంగా గణుతికెక్కిన తదేశ సార్వభౌమాధికారం అమెరికాకు తాకట్టు పడుతున్న దుస్థితి ద్యోతకమవుతోంది.

గతంలో తక్కువ ధరకే రష్యా చమురు విక్రయించడంతో భారతదేశం మునుపెన్నడు లేని రీతిలో 80–90 శాతం ఆ దేశం నుంచే కొనుగోలు చేసింది. అది ట్రంప్‌కు కోపాన్ని తెప్పించింది. రష్యాతో చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారతదేశ వస్తు, సేవల ఎగుమతులపై ట్రంప్ అదనంగా పాతిక శాతం టారిఫ్‌ను విధించాడు. ఆ తరువాత వెనిజులా అధ్యక్షుడిని బంధించి అమెరికాకు తరలించుకుపోయింది. ఇకపై ఇరాన్ నుంచి కాకుండా తమ ఆధీనంలోని వెనిజులా చమురు క్షేత్రాల నుంచే చమురు కొనాలని కూడా భారత్‌కు హుకుం జారీ చేసింది. అయినప్పటికీ అమెరికాతో వాణిజ్య ఒప్పందం కోసం మోదీ ప్రభుత్వం తెరవెనుక విశ్వప్రయత్నాలు చేసి, తక్కువ ధరకే లభిస్తున్న రష్యా చమురు కొనుగోలు నిలిపివేసింది. తాజాగా ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ ద్వయం యుద్ధంతో పశ్చిమాసియా నుంచి ప్రపంచానికి చమురు పంపే నావలు హోర్ముజ్ జలసంధి వద్ద నిలిచిపోయాయి. దీంతో ఒక్కసారిగా చమురు ధరలు చుక్కలనంటుతున్నాయి. రష్యా నుంచి భారతదేశం చమురు కొనుగోలు నిలిపివేసిన వెంటనే చైనా అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆ దేశం నుంచి చమురు కొనుగోలును భారీగా పెంచుకుంది. ఇప్పుడు ఇరాన్ నుంచి చమురు, ఎల్‌పిజి రాక నిలిచిపోవడంతో భారతదేశం ఇరకాటంలో పడింది. చివరకు రష్యా నుంచి చమురు కొనుగోలు చేసుకునేందుకు అమెరికావైపు చూడాల్సి రావడం దారుణం. ఎట్టకేలకు అమెరికా నుంచి అనుమతి లభించినప్పటికీ, రష్యాను తక్కువ ధరకు చమురు కొనుగోలు చేయాలని అడగడం ఇబ్బందికరమే.

ఇరాన్ దేశ సర్వోన్నతాధినేత ఆయోతుల్లా ఖమేనీ సహా, అత్యున్నత మిలిటరీ అధికారులను బాంబుల వర్షంతో చంపేసిన అమెరికా, ఇజ్రాయెల్ ఘాతుకాన్ని ఖండించకపోవడం కేంద్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అదే రోజు పాఠశాలపై జరిగిన బాంబు దాడులలో 160 మంది పాల బుగ్గల విద్యార్థినుల మృతికి సంతాపం వ్యక్తం చేయకపోవడం అమానవీయతకు నిదర్శనం. అమెరికాకు సాగిలాపడిన ఐరోపా దేశాలకు భిన్నంగా 'ఇరాన్‌పై అమెరికా యుద్ధం అసాధారణ తప్పిదం' అని ఖండించిన స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ ప్రదర్శించిన ధైర్యం నుంచైనా స్ఫూర్తి పొందలేపోయాం. అమాయక ప్రజలు, పాఠశాలలు, వైద్యశాలలపై బాంబులు కురిపించే యుద్ధాన్ని ఆపాలని నేరుగా అమెరికా, ఇజ్రాయెల్ అడిగే సాహసం చేయలేనప్పుడు విశ్వగురువు భుజకీర్తులెందుకు? ఇరాన్ భారతదేశానికి వ్యతిరేకంగా పలు ప్రకటనలిచ్చిందని కాషాయ కూటమి సమర్థకులు సాకులు చూపుతున్నారు. 2024లో అనుమానాస్పద హెలికాప్టర్ ప్రమాదంలో ఇరాన్ దేశాధ్యక్షుడు మరణించినప్పుడు మనదేశం సంతాపాన్ని ప్రకటించిన నాడు ఆ విషయం వారికి గుర్తుకురాలేదా? ఇరాన్‌పై యుద్ధానికి రెండు రోజుల ముందు ఇజ్రాయెల్‌కు వెళ్ళి, అక్కడి పార్లమెంటులో ప్రసంగిస్తూ ఇజ్రాయెల్‌కు మద్దతిస్తామని మన ప్రధాని మోదీ ప్రకటన చేయడం లోనే మర్మం దాగున్నది.

అన్నిటికి మించి విషాదకరమైన ఘటన ఇరాన్ నావికులు ప్రయాణిస్తున్న 'ఐఆర్ఐఎస్ దేనా' నౌకను అమెరికా జలంతర్గామి టార్పెడోతో పేల్చేయడం. ఆ ఘోరకలిలో 84 మంది చనిపోగా, 32 మందిని శ్రీలంక రక్షించింది. తల్లిదండ్రులు, గురువు తరువాత అతిథులను దేవుడితో సమానంగా చూసే ఘన వారసత్వం మనది. అలాంటిది భారతదేశ ఆహ్వానంపై గత నెలలో(యుద్ధం ఆరంభానికి ముందు) విశాఖపట్టణంలో జరిగిన అంతర్జాతీయ నావికా విన్యాసాలు, 'మిలన్' కార్యక్రమంలో పాల్గొన్న ఇరాన్ నౌక, నౌకాదళ సభ్యులు తిరుగు ప్రయాణంలో అమెరికా బాంబుదాడికి బలైనా కూడా కేంద్ర ప్రభుత్వం కళ్ళుమూసుకొని కూర్చుంది. భారతదేశ సముద్ర జలాల నుంచి దాటి, అంతర్జాతీయ జలాల్లో చేరిన తరువాతే ఇరాన్ నౌకపై దాడి జరిగిందనే తన ప్రమేయం చాటుకునే మొక్కుబడి ప్రకటనలే వచ్చాయి. అంతే తప్ప ఇంటికి చేరకుండానే అతిథులు మరణించారనే బాధను కూడా అధికారికంగా వ్యక్తం చేయని దౌర్భల్యం ఎందుకు? ఇరాన్ విదేశాంగ మంత్రి అరాఘ్చి తన ప్రకటనలో 'భారతదేశ అతిథిగా వెళ్ళి తిరిగి వస్తున్న నిరాయుధులైన 130 నావికులతో కూడిన తమ నౌకపై, ఇరాన్ తీరానికి 2వేల మైళ్ళ దూరంలో అమెరికా ఎలాంటి హెచ్చరిక లేకుండానే దాడి జరిపిందని' నొక్కి చెప్పడం ద్వారా మన బాధ్యతను గుర్తు చేశారు. మనకంటే పొరుగుదేశమైన శ్రీలంక మానవత్వంతో వ్యవహరించింది. ఇరాన్ నౌక నుంచి సహాయ కోసం సంకేతాలు లభించిన కొద్దిసేపటికే స్పందించి కొంతమందినైనా కాపాడింది. విశాఖపట్టణం నుంచి తిరిగి వస్తున్న మరొక ఇరాన్ నౌకకు ఆపుకునేందుకు నిలవునీడనిచ్చి, పెద్ద మనస్సును చాటుకుంది. అంతే గాక, 'యుద్ధాలలో ఏ ఒక్క పౌరుడు కూడా మరణించవద్దు. ప్రతీ ప్రాణం మా ప్రాణం లాగే విలువైనదే అనేది మా విధానం. మానవతా విలువలు, ప్రాణాలు కాపాడడం మా ప్రాధాన్యతగా చూసుకుంటూనే, మా అలీన విధానాన్ని మేము జాగ్రత్తగా కాపాడుకుంటాం' అని శ్రీలంక దేశాధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశారు. ఒకప్పుడు అలీనోద్యమానికి ఆద్యురాలైన భారతదేశ విధానాన్ని పొరుగుదేశం ఘనంగా చాటుతోంది. అదే సమయంలో అమెరికా ప్రాపకం కోసం వెంపర్లాడుతూ, మన విదేశాంగ విధానాన్ని ప్రస్తుత పాలకులు తాకట్టుపెట్టడం అత్యంత విషాదకరం.



## సాహస రాజకీయ చర్య

**చిన్నదైన శ్రీలంక దేశం అంతర్జాతీయ సముద్ర చట్టం, మానవతా విధికి ప్రాధాన్యతనిచ్చింది. అమెరికా, ఇజ్రాయెల్‌లను ఆగ్రహానికి గురిచేసే ప్రమాదం కంటే వాటినే ఎక్కువ అని భావించింది. భారతదేశం ఏర్పాటు చేసిన మిలాన్–2026 బహుళపక్ష నావికా కసరత్తు నుండి తిరిగి వస్తున్న నిరాయుధ ఇరానియన్ యుద్ధనౌకను అమెరికా దాడి జలాంతర్గామి ముంచింది. శ్రీలంక నావికాదళం గల్లంతైన నావికుల భౌతికకాయాల కోసం అన్వేషణ కొనసాగిస్తోంది. అలాగే రెండవ ఇరానియన్ యుద్ధనౌక నుండి 208 మంది సిబ్బందిని సురక్షితంగా తరలించింది. మొదటి నౌకకు పట్టిన గతి రెండవ నౌకకు సంభవించకుండా చేసింది.**

- డాక్టర్ బ్రహ్మ చెల్లానీ,
భౌగోళిక రాజకీయాల నిపుణుడు



# పోషకాహార విలువల చిరునామా - తృణధాన్యాలు

ప్రపంచంలో అతి పెద్ద పంటలుగా, ప్రధాన ఆహార పదార్థాలుగా తృణధాన్యాలు గుర్తించబడ్డాయి. తృణధాన్యాల చరిత్ర, సంస్కృతి, పోషక విలువలను గౌరవిస్తూ, వాటి వినియోగాన్ని పెంచవలసిన అవసరాన్ని చర్చించడానికి ప్రతి ఏట 07 మార్చి రోజున జాతీయ తణధాన్యాల దినోత్సవం (నేషనల్ సిరీల్స్ డే) పాటించడం అనాదిగా కొనసాగుతూ వస్తున్నది. నిర్వహించడం జరుగుతుంది. అల్పాహారం, భోజనం, స్నాక్స్, కిచిడీ, సంగటీ, రొట్టెలు, ఊతప్పం, రూపంలో రుచికరమైన తృణధాన్య వంటకాలను 19వ శతాబ్దం నుంచి మానవాళి తమ ఆహారంగా తీసుకుంటున్నది. ఫైబర్, ప్రోటీన్లు, ఖనిజ లవణాలు, విటమిన్లు పుష్కలంగా ఉన్న గడ్డిజాతి చిన్న గింజల పంటను తృణధాన్యం అని పిలుస్తున్నాం. ఇవి శక్తిని ఇవ్వడంతో పాటు బరువును తగ్గించడం, మధుమేహాన్ని నియంత్రించడం లాంటి ప్రయోజనాలతో ఆరోగ్యకరమైన 'సూపర్ ఫుడ్స్'గా గుర్తించబడింది.

**తృణధాన్యాల పోషక విలువలు:**
రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు, సామలు, ఓట్స్, మిల్లెట్స్, క్వినోవా, బుక్వీట్ లాంటి చిరుధాన్యాలతో పాటు సాధారణ ఆహార పదార్థాలైన బియ్యం, గోధుమలు, మొక్కజొన్నలు కూడా తృణధాన్యాల వర్గంలోకి వస్తాయి. పోషక విలువలు అధికంగా తృణధాన్యాల్లో పిండి పదార్థాలు, పీచు పదార్థాలు, ఐరన్/ఫోలిక్ ఆసిడ్/విటమిన్ బి/కాల్షియం/జింక్/మెగ్నీషియం/ఫాస్పరస్/మాంగనీస్/కాపర్ లాంటి అత్యవసర పోషకాలు ఉంటాయి. తృణధాన్యాలు తీసుకోవడం వల్ల బ్లడ్ షుగర్స్ తగ్గడం, జీర్ణక్రియ మెరుగుపడడం, గుండె ఆరోగ్యం కలగడం, ఆరోగ్యకర కొవ్వులు పెరగడం కూడా అనుభవంలోకి వస్తుంది. చెడు కొవ్వులను కరిగించడం, రక్తహీనతను నియంత్రించడం, మలబద్ధకం తగ్గడం, ఎముకల దృఢత్వం, జీర్ణక్రియ మెరుగుపడడం, ఆకలి అదుపు కావడం వంటి సమస్యలకు ప్రతి రోజు ఉదయం రుచికరమైన అల్పాహారంగా తృణధాన్య ఆహార పదార్థాలు ఉపయోగపడుతున్నాయి. తృణధాన్యాల ద్వారా పిండి ఆధారిత ఆహార పదార్థాలతో పాటు మద్యం తయారీలో, పశుగ్రాసం రూపంలో కూడా వాడుకోవడం కొనసాగుతున్నది.

తృణధాన్యాలతో నూతన వంటకాల పోటీలను నిర్వహించడం, వాటి పోషక విలువలను విద్యార్థులకు తెలియజేయడం, తృణధాన్యాలతో విందులు, వాటి చరిత్రను వివరించడం, మానవాళితో వాటి విడదీయరాని సంస్కృతులను చర్చించడం, సామాజిక మాధ్యమాల్లో వాటి ప్రాధాన్యతలను వివరించడం లాంటి కార్యక్రమాలకు జాతీయ తృణధాన్యాల దినోత్సవం వేదిక కావాలి. తృణధాన్యాలను రోజువారీగా అన్నం, రొట్టెలు, ఇడ్లీ, దోశ లాంటి ఆహార పదార్థాల రూపంలో తీసుకోవడం జరుగుతోంది. దాదాపు 8,000 ఏండ్ల నాటి నుంచి తృణధాన్యాల సాగు జరుగుతోంది. 20వ శతాబ్దంలో హరిత విప్లవం ద్వారా తృణధాన్యాల ఉత్పాదకత గణనీయంగా పెరిగింది.

*(07 మార్చి జాతీయ తృణధాన్యాల దినోత్సవం సందర్భంగా)*

# ఎన్‌సిఇఆర్‌టి చరిత్ర వక్రీకరణలపై దర్యాప్తు అవసరం

డా. జ్ఞాన్ పాఠక్

భారత సుప్రీంకోర్టు ఎన్‌సిఇఆర్‌టి పుస్తకం ఒకదానిపై సంపూర్ణ నిషేధాన్ని విధించాలని ఆదేశించింది. ఒక అధ్యాయంలో అవినీతి ఆరోపణలు, న్యాయవ్యవస్థ పనితీరు గురించి వివరించిన సందర్భాన్ని ప్రస్తావిస్తూ, అది 'లోతుగా పాతుకుపోయిన, ప్రణాళికాబద్ధమైన కుట్ర'గా వ్యాఖ్యానించింది. 2014లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి దేశ సామాజిక, రాజకీయ నిర్మాణానికి ముప్పు కలిగించే కుట్రపై దర్యాప్తు చేస్తేనే వాస్తవ కోణం వెల్లడి అవుతుంది. ఆర్‌ఎస్‌ఎస్– బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వంతో అత్యంత లోతైన కుట్ర జరుగుతున్నదా అనేది ప్రశ్న. ప్రస్తుత కేసులో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆందోళనలు న్యాయవ్యవస్థ గురించిన చిత్రీకరణ, సంస్థాగత విశ్వసనీయతను దెబ్బతీసే అవకాశం, పాఠశాల విద్యార్థుల కోసం అంశాలను రూపొందించే అంశాల పద్ధతి చుట్టూ తిరుగుతున్నాయి. అయితే, లోతుగా పాతుకుపోయిన, ప్రణాళికాబద్ధమైన కుట్ర అనేది 2014 నుండి అనేక ఇతర విషయాలకు సంబంధించిన, అనేక పాఠ్యపుస్తక సవరణల కోసం లేవనెత్తిన పాత ఆరోపణే. పాఠ్యపుస్తకాల సవరణల ద్వారా మన పిల్లలకు ఒక నిర్దిష్ట మార్గంలో బోధించడానికి ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం మొత్తం విద్యా వ్యవస్థను మార్చడంలో ఎంతవరకు భాగస్వామ్యం అయిందో భారతదేశం తెలుసుకోవాలి.

ప్రస్తుత కేసులో పుస్తకం యొక్క అన్ని కాపీలు, అది హార్డ్ కాపీ అయినా లేదా డిజిటల్ అయినా, ప్రజా బాహుళ్యం నుంచి ఎన్‌సిఇఆర్‌టి, కేంద్ర, రాష్ట్ర విద్యా శాఖలు తొలగించాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ , న్యాయమూర్తులు జోయ్ మాల్య బాగ్చి, విపుల్ ఎం పంచోలిలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. 'మేము లోతైన దర్యాప్తు జరగాలని భావిస్తున్నాము. బాధ్యులెవరో మనం కనిపెట్టాలి. వారెవరో మేము చూస్తాము. బాధ్యులపై చర్య తీసుకోవాల్సిందే! మేము కేసును మూసివేయబోము' అని సిజెఐ అన్నారు. వివాదాస్పద అంశాలు వెలుగులోకి వచ్చిన తర్వాత ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ సుప్రీంకోర్టుకు అందించిన సమాచారం పట్ల కోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అత్యంత ధిక్కార, నిర్లక్ష్యపూరితంగా రూపొందించిన పుస్తకంలో రాసిన దానిపై ఆత్మావలోకనం చేసుకొని ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ సమాధానం దాఖలు చేయాల్సింది పోయి.. అందులో అంశాలను సమర్థిస్తూ జవాబిచ్చారని కోర్టు వ్యాఖ్యానించింది.

'సంస్థాగత అధికారాన్ని అణిచివేయటానికి, న్యాయవ్యవస్థ గౌరవాన్ని కించపరచడానికి ఒక ప్రణాళికాబద్ధమైన చర్య జరుగుతున్నట్లు మాకు అనిపిస్తోంది. దీనిని అదుపు చేయకుండా వదిలేస్తే, ప్రజల ఆలోచనల్లో, యువత మనసుల్లో ఆకట్టుకునే న్యాయ వ్యవస్థ పవిత్రతను క్షీణింపజేస్తుంది' అని కోర్టు ఆర్డర్ పేర్కొంది. ఇవి న్యాయవ్యవస్థకు సంబంధించిన ఉదాహరణలు మాత్రమే. ధర్మాసనం ఎత్తి చూపిన 'లోతుగా పాతుకుపోయిన, ప్రణాళికాబద్ధమైన కుట్ర'ను భారతదేశం బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంటే, పరిగణనలోకి తీసుకోవలసిన అనేక ఇతర అంశాలు కూడా ఉన్నాయి.

నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి) పాఠ్యపుస్తకాలను ఎలా సవరించారనే దానిపై భారతదేశంలో వివాదాలు, రాజకీయ చర్చలు జరిగాయి. ప్రభుత్వం, దాని సైద్ధాంతిక మద్దతుదారులైన బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్‌లు చరిత్ర, సాంఘిక శాస్త్ర బోధనను పునఃరచించేందుకు చేసిన ప్రయత్నాన్ని మార్పులు ప్రతిబింబిస్తాయని ప్రతిపక్షం, పౌర సమాజం నుంచి విమర్శకులు పేర్కొన్నారు. ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాలలో




ఇటీవలి మార్పులు రాజకీయ ప్రేరేపిత సవరణ లేదా చరిత్ర 'కాషాయీకరణ'ను సూచిస్తున్నాయని రాజకీయ నాయకులు, విద్యావేత్తలు సహా విమర్శకులు ఆరోపిస్తున్నారు.

మహాత్మా గాంధీ హత్య, ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేధం, మొఘల్ చరిత్రలోని కొన్ని భాగాల గురించిన అధ్యాయాలు, విభాగాలను ఎన్‌సిఇఆర్‌టి తొలగిస్తోందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆరోపించారు. ఇవి ఆర్‌ఎస్‌ఎస్ అనుగుణమైన కోణంలో చరిత్రను ప్రోత్సహించేందుకు ఉద్దేశించినవని అన్నారు.

మాణికం ఠాగూర్ వంటి ప్రతిపక్ష నాయకులు బిజెపి పాఠశాల పుస్తకాలలో ఆర్‌ఎస్‌ఎస్ కథనాన్ని ప్రవేశపెడుతోందని అన్నారు.

తమ పేర్లతో సవరించిన పాఠ్యపుస్తకాలను ఎన్‌సిఇఆర్‌టి అనుమతి లేకుండా ప్రచురించడాన్ని విద్యావేత్తలు యోగేంద్ర యాదవ్, సుహాస్ పాల్శికర్ బహిరంగంగా వ్యతిరేకించారు. గతంలో పాఠ్యపుస్తక హేతుబద్ధీకరణ (ఉదాహరణః 9, 12 తరగతుల లోని అధ్యాయాల తొలగింపు) అంటే కీలకమైన చారిత్రక ఘట్టాలను విస్మరించడం లేదా ఇస్లామిక్ చరిత్ర విస్తృతిని తగ్గించడమేనని అని విమర్శించారు.

ప్రధాన ఆరోపణ ఏమిటంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఫాసిజాన్ని అనుసరిస్తోంది, న్యాయవ్యవస్థను నియంత్రించడంతో సహా దేశంపై సంపూర్ణ నియంత్రణను స్థాపించేందుకు ప్రయత్నిస్తోంది. అందువల్ల, 'లోతైన పాతుకుపోయిన, అత్యంత ప్రణాళికాబద్ధమైన కుట్ర' అని సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్య కీలకమైనది.

చరిత్రను కాషాయీకరణ చేస్తున్నారని ప్రధాన ఆరోపణ ఉంది. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌తో అనుసంధానించబడిన హిందూ జాతీయవాద ప్రపంచ దృష్టికోణాన్ని ప్రతిబింబించేలా పాఠ్యపుస్తకాలను పునఃరచిస్తున్నారని విమర్శకులు ఆరోపించారు. ప్రాచీన భారతదేశం నాగరికతను మరింతగా కీర్తించే పదాలలో చూపిస్తున్నారు. వేద జ్ఞానం, స్వదేశీ శాస్త్రీయ విజయాలు నొక్కిచెప్పబడ్డాయి. ఇస్లామిక్, మొఘల్ కాలాలు గతంలో కంటే కుదించడమో లేదా పునఃరచించటమో జరిగింది. లౌకిక చరిత్ర కంటే సాంస్కృతిక జాతీయత చరిత్ర ముందుంచారు.

మొఘలులపై వివరణాత్మక అధ్యాయాలను తొలగించడం లేదా తగ్గించడం, ఘరానాల సంస్కృతి, పరిపాలన, సమ్మిళిత సంప్రదాయాలకు సంబంధించిన అంశాలను తగ్గించడం, ఢిల్లీ సుల్తానులకు సంబంధించిన అంశాలను తగ్గించడం వంటి చర్యలను సిలబస్ హేతుబద్ధీకరణ (2020–2023) సమయంలో విమర్శకులు గుర్తించారు. ఇది చారిత్రక కవరేజీని తగని రీతిలో వక్రీకరిస్తుందని చరిత్రకారులు వాదిస్తున్నారు. కొవిడ్ మహమ్మారి కాలం నుంచి సిలబస్ భారాన్ని కుదించటంలో ఈ కోతలు భాగమని ఎన్‌సిఇఆర్‌టి చెబుతోంది.

మహాత్మా గాంధీ హత్య, తరువాత ఆర్‌ఎస్‌ఎస్ నిషేధానికి సంబంధించిన అంశాలను తగ్గించటం లేదా సవరించడం జరిగింది. ఇది హత్య చుట్టూ సందర్భోచిత చర్చలను కూడా పునర్నిర్మించింది. ఇది స్వాతంత్ర్యానంతర భారతదేశంలో తీవ్రవాద రాజకీయాల చర్చను బలహీనపరుస్తుందని విమర్శకులు పేర్కొన్నారు. ముఖ్యమైన వాస్తవాలు చెక్కుచెదరకుండా ఉన్నాయని, సవరణలు సాంకేతికంగా లేదా బోధనాపరంగా ఉన్నాయని ఎన్‌సిఇఆర్‌టి పేర్కొంది.

సమకాలీన రాజకీయ సంఘటనలకు సంబంధించిన అంశాలను కూడా తొలగించారు. తొలగించబడిన లేదా కత్తిరించబడిన అధ్యాయాలలో 2002 గుజరాత్ అల్లర్ల చర్చ; నిరసనలు, సామాజిక ఉద్యమాల సారాంశం; పెరుగుతున్న అసహనంపై చర్చల సంబంధిత అంశాలు; కొన్ని తరగతులలో ప్రజాస్వామ్యం అసమ్మతికి సంబంధించిన భాగాలు ఉన్నాయి. కొన్ని సామాజిక శాస్త్ర, రాజకీయ శాస్త్ర అంశాలు తగ్గించినట్లు వార్తలు వచ్చాయి. అవి కుల ఆధారిత అసమానతలపై చర్చలు, మైనారిటీ పోరాటాలకు సంబంధించిన భాగాలు; వివక్ష, మత ఘర్షణను ప్రస్తావించే భాగాలు.జాతీయ విద్యా విధానం (ఎన్‌ఇపి)–2020 తర్వాత కాలం లో కొత్త పాఠ్యాంశాల్లో నాగరికత కథనం దిశలో మార్పు ఉంది. భాషా నిర్మాణం, గాథతలో మార్పులు ఉన్నాయి. న్యాయ వ్యవస్థ లో అవినీతికి మించి 'లోతుగా పాతుకుపోయిన, అత్యంత ప్రణాళికాబద్ధమైన కుట్ర' వ్యాప్తి చెందుతుందని సూచించే అనేక ఆరోపణలు ఉన్నాయి. కాబట్టి మొత్తం విషయాన్ని దర్యాప్తు చేసి కుట్రను బహిర్గతం చేయాలి. **(ఐపిఎ సర్వీస్)**

# మేధో మథనంపై 'అర్బన్' ముద్ర ఎందుకు?

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ఒక ప్రాథమిక హక్కు. కానీ, ప్రస్తుత కాలంలో విమర్శనాత్మక గొంతుకలను అణచివేయడానికి 'అర్బన్ నక్సలైట్' అనే పదం ఒక శక్తివంతమైన ఆయుధంగా మారింది. జర్నలిస్టు లు, విద్యార్థులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులపై ఈ ముద్ర వేసి, కఠినమైన 'ఉపా' (UAPA) చట్టం కింద ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గేలా చేయడం, కేసులపాలు చేయడం, కోర్టుల చుట్టూ తిప్పడం, సమాజంలో తమ గౌరవాన్ని తగ్గించేలా చేయడం జరుగుతుంది. ఈ చర్య రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమంటే ఎవరైన కాదంటే ఇక చేసేదేమీ లేదు. ఒక వైపు ప్రభుత్వం మావోయిస్టులను ఆయుధాలు వీడి రమ్మని ఆహ్వానిస్తోంది. మావోయిస్టులు కూడా తమ పంథా మార్చుకోవడం ఆహ్వానించదగిన అంశంగానే చూడాలి. అనేక మంది నాయకులు లొంగిపోయి సాధారణ జీవితం కూడా గడుపుతున్నారు. కానీ అదే సమయంలో ప్రజాస్వామ్య పంథాలో ఉండి రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛతో విమర్శించే వారిని, ప్రశ్నించే వారిని మాత్రం 'అర్బన్ నక్సల్స్' అని ముద్ర వేయడం ఇదెక్కడి ప్రజాస్వామ్యమో... ఇదెక్కడి రాజ్యాంగ సూత్రమో పాలకులకే తెలియాలి. ప్రభుత్వ గణాంకాల ప్రకారమే దేశంలో మావోయిస్టుల ప్రభావం గణనీయంగా తగ్గింది. ఒకరకంగా ఉనికి లేకుండా ఉండే పరిస్థితి ప్రస్తుతం ఉంది. ముందే చెప్పినట్లుగా అగ్రనాయకత్వం అనేక మంది మావోయిస్టులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలోకి వస్తున్నారు. రాజ్యాంగబద్ధమైన పోరాటాలే మార్గమని వారు భావిస్తున్న తరుణంలో నగరాల్లో నివసించే మేధావులను 'అర్బన్ నక్సలైట్లు'గా చిత్రించడం వెనుక అర్థం ఏమిటి..? అడవుల్లో తుపాకీ పట్టిన వారికంటే, నగరాల్లో కలం పట్టిన వారు ప్రమాదకరమని ప్రభుత్వం భావించడం విడ్డూరం కాక ఏమవుతుంది...? క్షేత్రస్థాయిలో మావోయిస్టుల ఉనికి తగ్గుతున్నప్పుడు, అకస్మాత్తుగా 'అర్బన్ నక్సల్స్' వాయిస్ ను ముందుకు తీసుకురావడం దేనికి సంకేతం..? దీని వెనుక రాజకీయ ప్రయోజనాలు లేవనగలమా..? మన దేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ఇక్కడ భిన్నత్వంలో ఏకత్వం అంటే కేవలం కులమతాలే కాదు, భిన్న భావజాలాలు కూడా. ఇలాంటి మన దేశంలో గత దశాబ్ద కాలంగా 'అర్బన్ నక్సల్' అనే పదం సామాజిక కార్యకర్తలను, మేధావులను వేధించడానికి ఒక సాధనంగా మారిందనే విమర్శలు అంతర్జాతీయ స్థాయిలో వినిపిస్తున్న పరిస్థితి ఉంది. అడవుల్లో తుపాకీ పట్టిన మావోయిస్టుల కంటే, నగరాల్లో ఉండి వ్యవస్థను ప్రశ్నించే మేధావులు ప్రమాదకరమనే సిద్ధాంతాన్ని ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. క్షేత్రస్థాయిలో వాస్తవాలను రాసే జర్నలిస్టులను కూడా మావోయిస్టుల సంబంధాలు ఉన్నాయని చిత్రీకరించి జైలుకు పంపడం ద్వారా మీడియాను సైతం భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం కూడా జరుగుతోందనేది మరువొద్దు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (NCRB) నివేదికల ప్రకారం ఉపా (UAPA) కింద నమోదైన కేసుల్లో శిక్ష పడే శాతం కేవలం 2% నుండి 3% మాత్రమే ఉంటుంది. అంటే 97% కేసులు నిరూపణ కాకుండా ఇంకా కోర్టుల చుట్టూ తిరుగడం, జైల్లో అండర్ ట్రాయల్ ఖైదీలుగా మగ్గడం జరుగుతున్న పరిస్థితి. ఈ లెక్కన సగటున ఒక వ్యక్తి నిర్దోషిగా తేలడానికి 5 నుండి 10 ఏళ్లు పడుతోంది. అప్పటికే ఆ వ్యక్తి జీవితం, ఆరోగ్యం, సామాజిక గౌరవం మంటగలసిపోతున్న పరిస్థితి ఉంది. ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సిన అంశం ఏంటంటే భావజాల పోరాటాన్ని చట్టపరమైన వేధింపులతో ఎదుర్కోవడం సరైన పద్ధతి కాదు. మావోయిస్టులు ప్రజాస్వామ్య మార్గంలోకి వస్తుంటే స్వాగతిస్తున్న ప్రభుత్వం, అదే ప్రజాస్వామ్య మార్గంలో విమర్శించే వారిని శత్రువులుగా చూడటం సరికాదు. రాజ్యాం గం కల్పించిన స్వేచ్ఛను గౌరవించినప్పుడే దేశం బలంగా ఉంటుంది. 'అర్బన్ నక్సల్' అనే ముద్ర పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాసే ఆయుధం కాకూడదు. ప్రభుత్వ విధానాలను విమర్శించడం అంటే దేశాన్ని విమర్శించడం కాదు. 'అర్బన్ నక్సల్' అనే ముద్రను రాజకీయ లబ్ధి కోసం వాడటం ఆపి, పౌర హక్కులను కాపాడటమే నిజమైన దేశభక్తి. జైళ్లలో మగ్గుతున్న అండర్ ట్రయల్ ఖైదీలకు త్వరితగతిన న్యాయం జరగాలి. చట్టం శిక్షించడానికి ఉండాలి కానీ, భయపెట్టడాని ఉండకూడదు.

**దామెర రాజేందర్ (దారా)**

# ఆధిపత్య రాజకీయాలకు కొత్త పరీక్ష?

పశ్చిమ ఆసియా మరోసారి అంతర్జాతీయ రాజకీయాల దృష్టిని ఆకర్షించే కీలక మలుపులో నిలిచిం ది. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక ఉద్రిక్తతలు, గాజా యుద్ధానంతర పరిణామాలు, గల్ఫ్ ప్రాంత భద్రతా సమీకరణాల్లో కనిపిస్తున్న కదలికలు.. ఇవి కలిసి ప్రాంతీయ శక్తి సమతుల్యతను కొత్త దిశగా మలుస్తున్నాయి. గతంలో పరోక్షంగా సాగిన ప్రతిస్పర్థ ఇప్పుడు బహిరంగ ప్రకటనలు, దౌత్య హెచ్చరికలు, రక్షణరంగ చురుకుదనం రూపంలో మరింత స్పష్టత పొందుతోంది. అంతర్జాతీయ వేదికలపై పరస్పర ఆరోపణలు, మిత్రదేశాల వ్యూహాత్మక సమన్వయ చర్చలు వేగం పుంజుకోవడం పరిస్థితికి రాజకీయ తీవ్రతను జోడిస్తోంది. ఇంధన సరఫరా మార్గాల భద్ర త, సముద్ర మార్గాల పర్యవేక్షణ, సాంకేతిక ఆధిపత్య పోటీ వంటి అంశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపే అవకాశాలుగా చర్చ కు వస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ కలిసి పశ్చిమ ఆసియాను కేవలం ప్రాంతీ య సంఘర్షణల వేదికగానే కాక, గ్లోబల్ శక్తుల వ్యూహపరమైన ప్రయోగశాలగా మలుస్తున్నాయనే అభిప్రాయాన్ని బలపరుస్తున్నాయి.

**దాడి వర్సెస్ రక్షణ**

దశాబ్దాలుగా ఆర్థిక ఆంక్షలను ఎదుర్కొంటున్న ఇరాన్, రక్షణరంగంలో స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యం తో ముందుకు సాగుతున్నట్లు ప్రకటిస్తోంది. డ్రోన్ సాంకేతికత, దీర్ఘశ్రేణి క్షిపణి వ్యవస్థలు, అధిక వేగ ఆయుధాల అభివృద్ధి వంటి అంశాలు అంతర్జాతీయ చర్చకు వస్తున్నాయి. అయితే ఈ సామర్థ్యాలపై లభ్యమవుతున్న వివరాలు ప్రధానంగా అధికారిక ప్రకటనలు, మీడియా నివేదికల ఆధారంగానే ఉన్నందున, వాటిని విశ్లేషణాత్మక దృష్టితో చూడాల్సిన అవసరం ఉందని భద్రతా నిపుణులు సూచిస్తున్నారు. ఇజ్రాయెల్ తన బహుళస్థాయి రక్షణ వ్యవస్థలపై విశ్వాసాన్ని వ్యక్తం చేస్తోంది. ఆధునిక యుద్ధాల్లో దాడి–రక్షణ సాంకేతిక పోటీ నిరంతరం మారుతూ ఉండటం సహజమని రక్షణ విశ్లేషకులు చెబుతున్నారు. ఎటువంటి రక్షణ వ్యవస్థ శాతం వంద భద్రతను హామీ ఇవ్వలేనట్లే, దాడి సామర్థ్యాల ప్రభావం కూడా అనేక పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని వారు గుర్తు చేస్తున్నారు. ఈ పోటీ ప్రాంతీయ భద్రతా సమీకరణాలను మరింత సున్నితంగా మారుస్తోంది.

**బహుళ ధృవ ప్రపంచం**

పశ్చిమ ఆసియాలో అమెరికా పాత్ర కూడా పరిణామ క్రమంలో మారుతున్నట్లు కనిపిస్తోంది. గతంలో ప్రత్యక్ష సైనిక జోక్యం ప్రధానంగా కనిపించగా, ప్రస్తుతం దౌత్యపరమైన ఒత్తిడి, ఆంక్షలు మరియు మిత్రదేశాల సమన్వయం ద్వారా ప్రభావాన్ని కొనసాగించే ప్రయత్నం స్పష్టమవుతోంది. ఇది ఆధిపత్య రాజకీయాల నుంచి నియంత్రిత సమతుల్యతవైపు కదులుతున్న సంకేతంగా భావించవచ్చు. రష్యా, చైనా దేశాలతో ఇరాన్ పెంచుకుంటున్న సంబంధాలు ప్రపంచ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా చైనా మధ్యవర్తిత్వంతో ప్రాంతీయ ప్రత్యర్థుల మధ్య సంభాషణలు పునఃప్రారంభం కావడం గమనార్హం. ప్రపంచ వ్యవస్థ క్రమంగా బహుళ ధృవ నిర్మాణం వైపు పయనిస్తోందనే అభిప్రాయాలు బలపడుతున్నాయి.

**శాంతి దిశగా అవసరమైన మార్గం**

అణు ఒప్పంద భవిష్యత్తు ఇంకా స్పష్టత పొందలేదు. యురేనియం శుద్ధి స్థాయిలపై అంతర్జాతీయ పర్యవేక్ష ణ సంస్థలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు, దౌత్య చర్చల్లో పురోగతి లేకపోవడం, ఇవి ప్రాంతీయ ఉద్రిక్తతలను పూర్తిగా తగ్గనివ్వడం లేదు. చిన్న ఘటన కూడా విస్తృత ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత పరిణామాలు ఒక స్పష్టమైన సందేశా న్ని ఇస్తున్నాయి. యుద్ధం ఎవరికీ శాశ్వత విజయం ఇవ్వదు. శక్తి ప్రదర్శనలు తాత్కాలిక ప్రభావం చూపవచ్చు; కానీ దీర్ఘకాలిక స్థిరత్వం కోసం సంభాషణ, పరస్పర గౌరవం, వ్యూహాత్మక సమన్వయం అవసరం. పశ్చిమ ఆసియా భవిష్యత్తు ఆయుధాల గర్జనలో కాదు, దౌత్య మార్గాల్లోనే స్థిరపడే అవకాశం ఉంది. శాంతి అనేది బలహీనత కాదు, అది రాజకీయ పరిపక్వతకు ప్రతీక.

ఫిరోజ్ ఖాన్, 9640466464

# వెలుగుమట్ల నేర్పిన పాఠమేమిటి...?

-అధికారుల నిర్లక్ష్యమే ఈ స్థితికి కారణం
-బాధితుల ఆక్రందనకు దక్కని ఫలితం
-ప్రత్యామ్నాయం చూపాల్సిన బాధ్యత పాలకులదే







**ప్రజాపక్షం/ఖమ్మం :** వెలుగుమట్ల ఘటన కొందరిని దోషులుగా మరికొందరిని బాధితులుగా మార్చింది. దశాబ్దాల నాటి భూ వివాదాల మొదలు రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలు వెలుగుమట్ల రెవెన్యూలో భూ క్రయ విక్రయాలు ఇప్పుడు పరస్పర ఆరోపణలకు తావిస్తున్నాయి. సత్య, అసత్య ప్రచారాలు కూడా జోరుగా సాగుతున్నాయి. దశాబ్ద కాలం దాటిన ఈ పంచాయతీలో ఔనన్న కాదన్న ప్రభుత్వం కూడా తొందరపడిందన్న భావన వినపడుతుంది. సంక్షేమ పథకాలతో ముందుకు పోతున్న ప్రభుత్వానికి వెలుగుమట్ల ఘటన ఇబ్బందికరమే. అదే సమయంలో మంత్రులకు రాజకీయంగా నష్టమే. పేదలు ఇటువంటి ఘటనల ద్వారా నేర్చుకోవాల్సింది చాలా ఉంది. ఆశ ప్రేరేపించవచ్చు కానీ తదనంతర పరిణామాలను కూడా పరిగణలోకి తీసుకోకపోతే ఇటువంటి ఘటనలు జరగక తప్పక పోవచ్చు.

**ఈ స్థితికి బాధితులు బాధ్యులే :**
వెలుగుమట్లలో సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఆక్రమణలు ప్రారంభమయ్యాయి. తొలుత ఖమ్మం జిల్లాకు సంబంధించిన పేదలు ఎవరు భూదాన్ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రాలేదు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు నివాసాలు ఏర్పాటు చేసుకోవడం ప్రారంభించిన తర్వాతే ఖమ్మం జిల్లాకు చెందిన కొందరు అక్కడకు చేరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించినట్లుగా భూదాన్ భూముల్లో ఏర్పాటు చేసిన వినోబానగర్‌లో అక్కడి వారు ఒక రకంగా సమాంతర ప్రభుత్వాన్ని నడిపారు. అధికారులను, రాజకీయ నాయకులను ఆఖరుకు మీడియాను కూడా లోపలికి రానివ్వలేదు. ఓ టోల్‌గేట్‌లా ఏర్పాటు చేసి ఎవరైనా లోపలికి వెళ్లేందుకు ప్రయత్నిస్తే అసభ్యపదజాలంతో దూషించడం మొదలుపెట్టి దాడి చేసే వరకు వెళ్లారు. రెండవది స్థానికేతరులు భూమి అక్రమించడానికి ప్రేరేపించడం ఒక వ్యవస్థను కాకుండా వ్యక్తులను నమ్ముకోవడం వెలుగుమట్ల బాధితులు చేసిన పొరపాటుగా భావించాల్సిందే. వ్యక్తుల మాటలను నమ్మి వారు చూపిన కాగితాలపై ఆధారపడి స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకుని మరో పదేళ్లు కోలుకోలేనంతగా కొన్ని కుటుంబాలు దెబ్బతిన్నాయి. ఈ భూ ఆక్రమణలకు నాయకత్వం వహించిన వారికి స్థానికులకు ఎటువంటి సంబంధాలు లేకపోవడం కూడా కూల్చివేతల తర్వాత ఆందోళనలు ఉధృతం కాకపోవడానికి కారణమైంది. గూడు ఏర్పాటు చేసుకోవాలన్న ఆశతో భూదాన్ భూముల వైపు వెళ్లి ఉండవచ్చు కానీ తదనంతర పరిణామాలను బాధితులు ఆలోచించలేకపోయారు. ఇప్పుడు వీధిన పడ్డారు. ఆర్థికంగా నష్టపోయారు. ఈ పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించిన ఒక నిర్మాణాత్మక పద్ధతిలో ఈ భూ ఆక్రమణ జరగక పోవడం, కూల్చివేతల తర్వాత ఆందోళనలు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే పరిస్థితి లేకపోవడం, వ్యవస్థ కాకుండా కొంత మంది వ్యక్తులపైనే ఆధారపడటం బాధితులు చేసిన తప్పిదంగా భావిస్తున్నారు.

**బదనామైన ప్రభుత్వం :**
వెలుగుమట్ల ఆక్రమణల తొలగింపులో ప్రభుత్వం బదానమైంది. కొంత మంది రాజకీయ నాయకుల అనుచరుల భూ వ్యవహారాల కోసం వెలుగుమట్ల రెవెన్యూలోని వినోబానగర్‌లోని నివాసాలను తొలగించారని కర్కశంగా వ్యవహరించారని ప్రభుత్వంపై విమర్శలు వినవస్తున్నాయి. దశాబ్ద కాలం నిర్లక్ష్యం ఈ స్థితికి కారణమైంది. తొలి ఆక్రమణలు జరిగినప్పుడే అధికార యంత్రాంగం చర్యలు తీసుకుని ఉంటే ఇప్పుడు అధికారులు చెబుతున్నట్లుగా లక్షలాది రూపాయలు పేదలు దళారులకు చెల్లించడంతో పాటు లక్షలు ఖర్చు పెట్టి స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నష్టపోయి ఉండేవారు కారు.
తొలుత న్యాయ పరమైన వ్యవహారమే రాలేదు. భూదాన్ యజ్ఞ బోర్డు రద్దయిన తర్వాతనైన చర్యలకు ఉపక్రమించాల్సి ఉంది. ఇప్పుడు వినోబానగర్‌లో కూల్చివేతలకు ముందే ఇంటింటి సర్వే నిర్వహించి స్థానికులు ఎవరు, స్థానికేతరులు ఎవరు, ప్రభుత్వ ఉద్యోగులు ఎవరు, పథకాలకు అర్హులు ఎవరు, అనర్హులు ఎవరు ఒక జాబితా తయారు చేసి అనర్హులను అధికారికంగానే బయటకు పంపే అవకాశం ఉంది.
ప్రభుత్వం అలా చేసి నోటీసులు ఇచ్చి నిర్ణీత సమయం తర్వాత ఖాళీ చేయని వారిపై చర్యలు తీసుకుని అర్హులైన వారికి ప్రత్యామ్నాయం చూపించి ఉంటే ప్రభుత్వం ఇంతగా బదానం అయ్యేది కాదు. పది నుంచి 12 ఏళ్ల పాటు ఆక్రమణలను పట్టించుకోని అధికార యంత్రాంగం మరో కొంత కాలం వేచి చూసి ఎటువంటి ఇబ్బందులు జరగని రీతిలో వినోబానగర్‌ను ఖాళీ చేయించే అవకాశం ఉంది. కానీ అధికార యంత్రాంగం ఆ పనిచేయలేదన్న విమర్శ వ్యక్తమవుతుంది. భూ ఆక్రమణకు సంబంధించి కూడా అధికార యంత్రాంగం చెబుతున్న దానికి వాస్తవ ఆక్రమణకు చాలా తేడా ఉంది. ప్రభుత్వ విద్యా సంస్థలకు కేటాయించిన భూమి పోగా మిగిలిన 20 ఎకరాల్లో 10 ఎకరాల పైన మట్టి తోలకాల ద్వారా ఏర్పడిన పెద్ద పెద్ద లోయలే ఉన్నాయి. పేదలు అక్రమించింది కేవలం 10 ఎకరాల లోపు మాత్రమే. ప్రభుత్వాన్ని అధికార యంత్రాంగం ఈ విషయంలో తప్పుదారి పట్టించింది.



## సాగు పద్ధతిపై అవగాహన కల్పించండి

ప్రగతి ప్రణాళిక సమీక్షలో మంత్రులు వాకాటి, పొంగులేటి

**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీహరి, రాష్ట్ర సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా సమీక్షా సమావేశం శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్‌లో జరిగింది. వాకాటి శ్రీహరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రులు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలన్నారు. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోయినా పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాలని మంత్రి శ్రీహరి సూచించారు. ప్రణాళిక క్షేత్ర స్థాయిలో అమలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టి, బిసి, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లకు ఓ మండలి అధికారిని ఇన్‌చార్జిగా నియమించి వారంలో ఒక రోజు విద్యార్థులతో కలిసి భోజనం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్య, వైద్యం వ్యవహారంలో ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను రూపొందించిందని పొంగులేటి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులను మరింత మెరుగుపరిచి వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరయ్యాయని వాటిని దుర్వినియోగం కాకుండా సద్వినియోగం అయ్యేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలతో పాటు వ్యవసాయ రంగంపై అవగాహన కల్పించాలని ఆయన కోరారు.
ఈ సమావేశంలో ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, భద్రాద్రి కలెక్టర్ అంకిత్, శాసన మండలి సభ్యులు తాతా మధుసూన్, శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, జారె ఆదినారాయణ, మాలోత్ రాందాస్ నాయక్, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఐటిడిఏ పివో రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## పెరిగిన గంజాయి వాడకం

శాసన సభ్యుడు కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/ఖమ్మం :** యువత మత్తు పదార్థాల వాడకానికి బలైపోతున్నారని, గతంలో ఎన్నడులేని విధంగా ముఖ్యంగా గంజాయి వాడకం పెరిగిందని దీనిపై అధికార యంత్రాంగం దృష్టిసారించాలని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికకు సంబంధించి శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం సందర్భంగా ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయని పలు కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆయన తెలిపారు. వాడకాల నిషేధానికి సంబంధించి ప్రణాళికబద్ధ చర్యలు చేపట్టి మత్తు పదార్థాల వాడకం నుంచి యువతను తప్పించే ప్రయత్నానికి ప్రణాళిక బద్ధ చర్యలు చేపట్టాలని కూనంనేని కోరారు. గ్రామ స్థాయి నుంచి క్రీడలు, వ్యాయామం పట్ల ఆసక్తి పెంపొందించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆది నుంచి క్రీడల పట్ల ఆసక్తి పెరిగేవిధంగా చర్యలు చేపడితే భవిష్యత్తులో యువత క్రీడా రంగంలో రాణించే అవకాశం ఉందన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి చిన్నచిన్న లోటుపాట్లను సాకుగా చూపి బిల్లులు నిలుపుదల చేయడం సరికాదని వీలైనంత మేర సరళంగా వ్యవహరిస్తూ ఇందిరమ్మ గృహ లబ్ధి దారుల సమస్యలు పరిష్కరించాలనిఆయన కోరారు. ప్రజాపాలన ప్రగతిప్రణాళిక అభినందించదగిన కార్యక్రమం అని దీనికి కొంత బడ్జెట్‌ను కేటాయించి క్షేత్ర స్థాయినుంచి అమలయ్యేవిధంగా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.



## రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఇంటర్ పరీక్షలు వ్రాసి బైక్ లపై వస్తున్న విద్యార్థులు, కారు ను ఢీకొట్టి, రెండు బైక్ లు ఢీకొన్న ఘటన లో ఆరుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని అనంతనగర్‌నేలకొండపల్లి గ్రామాల మధ్య మూలమలుపు వద్ద శుక్రవారం ప్రమాదం జరిగింది. కోరట్లగూడెం కు చెందిన బచ్చలకూరి అభిరామ్, అమ్మగూడెం గ్రామానికి చెందిన వాసంశెట్టి ఉదయ్, ఆరెగూడెం గ్రామానికి చెందిన బోయిన ఉదయ్ లు నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ లో ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్ష ను వ్రాసిబైక్ పై ఇంటికి బయలుదేరారు. అదే విధంగా సదాశివాపురం గ్రామానికి చెందిన యంద్రాతి విశాల్, జె.జశ్వంత్, కొంగర గ్రామానికి చెందిన పొట్టా ఆకాష్ లు అనంతనగర్ గురుకుల పాఠశాల ఇంటర్ పరీక్ష కేంద్రంలో పరీక్ష వ్రాసి బైక్ పై నేలకొండపల్లి కి బయలుదేరారు. రెండు బైక్ లు మూలుమలపు వద్ద కు రాగానే, నేలకొండపల్లి నుంచి కారు కూసుమంచి వైపు వెళ్తుంది. కారును ఢీకొట్టి తప్పించే క్రమంలో రెండు బైక్ లు ఢీకొన్నాయి. దీంతో బైక్ లపై ఉన్న విద్యార్థులు ఎగిరిపడ్డారు. తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంద్వారా నేలకొండపల్లి ప్రభుత్వ హస్పిటల్ కు తరలించారు. ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ వారిలో బచ్చలకూరి అభిరామ్ పరిస్థితి విషమంగా ఉంది. మిగతా ఐదుగురు కూడ కాళ్లు, చేతులకు, తలకు తీవ్ర గాయాలైయ్యాయి. ప్రమాద సమయంలో విద్యార్థులు స్పృహకోల్పోవటంతో స్థానికులు పాకనాటి కన్నారెడ్డి, బచ్చలకూరి నాగరాజు తదితరులు సీపీఆర్ చేయటం, రక్తం కారకుండా గుడ్డలు చించి కట్టులు కట్టుటం. 108 వాహనం లోకి ఎక్కించి అత్యవసర పనులు దగ్గర ఉండి సేవలు అందించారు. మానవత్వం ను చాటారు. క్షతగాత్రులను తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ యం.యర్రయ్య, ఆయా పంచాయతీ సర్పంచ్ లు పరామర్శించారు. పలు గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలు. బంధువులు, స్నేహితులు, కాలేజీ సహచర విద్యార్థులు. స్థానికులు హస్పిటల్ కు రావటంతో హస్పిటల్ కిక్కిరిసింది. ఆర్తనాధాలు, రోధనలతో మారుమోగింది.

## అరసం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

**ప్రజాపక్షం/ఖమ్మం :** అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అరసం బాధ్యులు కోంపల్లి రామయ్య తెలిపారు. అరసం బాధ్యులు పల్లెరు వీరస్వామి, కవి ఎల్, నిధి, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ వివిధ సాహిత్య వేదికల బాధ్యులు సాధనాల వెంకట స్వామి నాయుడు, మువ్వా శ్రీనివాసరావు, రాంబ్రహ్మం, లెనిన్ శ్రీనివాస్, సృజన్ కుమార్, రౌతు రవి, సిపిఐ బాధ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహారావు హాజరవుతున్నట్లు తెలిపారు.

## ప్రగతి ప్రణాళికను విజయవంతానికి పాటుపడాలి

సమన్వయంతో ముందుకు సాగాలి
ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని, ఇందుకోసం అంతా సమన్వయంతో మందుకు సాగాలని కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యాతిథిగా హాజరైన ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రగతిప్రణాళి లక్ష్యాలు సాధించేందుకు కార్పొరేషన్ వ్యాప్తంగా అంతా కృషి చేయాలన్నారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా షెడ్యూల్ ఆధారంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్ల వ్యాప్తంగా కార్పొరేటర్లు వారి వారి ప్రాంతాల్లో చేపట్టాల్సి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా పూర్తిచేయాలన్నారు. పారిశుధ్యానికి ప్రధాన్యత ఇవ్వాలని, ఇందులో ప్రజలను కూడా భాగస్వాములను చేయాలన్నారు. విద్యా, వైద్య శాఖల కార్యక్రమాల నిర్వహణకు ఆయా అధికార యంత్రాంగం పనిచేయాలని ఆదేశించారు. రైతుల సమస్యల పరిష్కారానికి పెద్దపీఠ వేయాలని, వ్యవసాయానికి కావాల్సిన యూరియా ఎరువులు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు అనేక మంచికార్యక్రమాలు చేశామని, దానిని కూడా ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని, స్వయం సహాయక సంఘాల బలోపేతానికి పాటుపడుతూ వారిలో ఆర్థిక స్థిరత్వం తెచ్చేందుకు బ్యాంకు లింకేజీ రుణాలు ఇప్పించేందుకు కృషి చేయాలని కూనంనేని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వామ్యంతో 99 రోజుల ప్రత్యేక కార్యచరణను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడు గణేష్, డిప్యూటీ మేటర్ సిరిపురపు లలితకుమారి, కమీషనర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కూలీల హక్కుల కోసం పోరాటం

**మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య**



**ప్రజాపక్షం/కారేపల్లి :** దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారుతూ పేదల జీవితం కష్టాల్లోకి నెట్టబడుతోందని సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు, ఇల్లందు మాజీ ఎంఎల్‌ఏ గుమ్మడి నరసయ్య అన్నారు. కారేపల్లి మండలం గ్రామంలోని అమరుడు లక్ష్మీ నరసునగర్‌లో శుక్రవారం జరిగిన అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం డివిజన్ తొలి మహాసభలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో అనేక చట్టాలను మార్చి ప్రజలపై భారాలు మోపుతున్నారని, రెండు కోట్ల ఉద్యోగాల హామీ నెరవేరలేదని, నల్ల ధనం తీసుకొన్ని ప్రతి కుటుంబానికి రూ.15లక్షలు ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మహాసభలో ఖమ్మం డివిజన్ అధ్యక్షుడిగా కూరాకుల నరసయ్య, ఉపాధ్యక్షుడిగా చల్ల రాజు, ప్రధాన కార్యదర్శి కేలోతు పాపారావు, సహాయ కార్యదర్శిగా కోడెం సీతారాములు, కోశాధికారిగా ఎస్‌కె హుస్సేన్ బి తదితరులను ఎన్నుకున్నారు. ఉపాధి హామీ పనిదినాలను 200 రోజులకు పెంచాలని, రోజుకు రూ 600వేతనం ఇవ్వాలని సభ తీర్మానించింది. కార్యక్రమంలో పలు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## కల్తీని కట్టడి చేయకపోతే ముప్పే

ఎంఎల్‌సి తాతా మధు

**ప్రజాపక్షం/ఖమ్మం :** కల్తీని కట్టడి చేయకపోతే అది పెద్ద ముప్పు తప్పదని శాసన మండలి సభ్యులు తాతా మధు తెలిపారు. శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆహార పదార్థాల కల్తీ విపరీతంగా పెరిగిందని ముఖ్యంగా రంగుల వాడకం ప్రజల ఆరోగ్యానికి ముప్పు తీసుకు రానుందని ఆయన తెలిపారు. ఆహార పదార్థాల కల్తీ కారణంగానే తీవ్ర అనారోగ్యం చోటు చేసుకుంటుందని ఆయన తెలిపారు. వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వాడకం విపరీతంగా పెరిగిందని దీనితో పెట్టుబడులు పెరగడమే కాకుండా భూమి నిస్సారం అవుతుందని గ్రామ స్థాయి నుంచి రైతులకు అవగాహన కల్పించేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. కోతులు అతి పెద్ద సమస్యగా మారాయని కోతులు, కుక్కల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టకపోతే ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదన్నారు. ప్రగతి ప్రణాళిక రూపకల్పన బాగున్నా ఇందుకు సంబంధించి బడ్జెట్ కేటాయింపులు ఉండాలని ప్రణాళికబద్ధ అమలుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## అక్రిటిడేషన్ సమస్యలు పరిష్కరించండి

మంత్రి పొంగులేటికి ఐజెయు వినతి



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్రంలో జర్నలిస్టులకు సంబంధించిన అక్రిడిటేషన్ సమస్యలను పరిష్కరించాలని టియుడబ్ల్యూజె (ఐజెయు) కోరింది. ఈ మేరకు శుక్రవారం సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ జర్నలిస్టులు అక్రిడేషన్ విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. జిల్లా కేంద్రంలో ప్రస్తుతం నిర్దేశించిన ప్రకారం చాలా మందికి అక్రిడేషన్ వచ్చే అవకాశం లేదని ముఖ్యంగా ప్రధాన స్రవంతి మీడియాలో పని చేసే వారు వివిధ విభాగాల రిపోర్టర్లు నష్టపోయే అవకాశం ఉందన్నారు. గతంలో మున్సిపాలిటీలకు, కార్పోరేషన్లకు ఉన్నట్లుగా ప్రస్తుతం కూడా ఆయా రిపోర్టర్లకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని రాంనారాయణ మంత్రిని కోరారు. ఖమ్మం లాంటి ప్రధాన నగరాల్లో ఒక్కో సంస్థలో వివిధ విభాగాలకు సంబంధించి 10 నుంచి 12 మంది పనిచేస్తున్నారని వారందరికీ అక్రిడేషన్లు వచ్చేవిధంగా జీవోను సవరించాలన్నారు. నియోజక వర్గ రిపోర్టర్లకు ముఖ్యంగా డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు మంజూరు చేయాలని కోరారు. ప్రచురణ కేంద్రం ఉన్నచోటే డెస్క్ జర్నలిస్టులకు అదికూడా నలుగురికి మాత్రమే అక్రిడేషన్లు ఇస్తామని చెబుతున్నారని దీని వల్ల సబ్ ఎడిటర్లు చాలా మంది అక్రిడేషన్ కోల్పోయే అవకాశం ఉందని రాంనారాయణ తెలిపారు. జర్నలిస్టులందరికీ ఉద్యోగస్తుల మాదిరిగా హెల్త్ పాలసీని ప్రవేశపెట్టాలని, లైఫ్ ఇన్సూరెన్స్ పథకాన్ని తీసుకురావాలని గతంలో ఉన్నట్లుగా జిల్లా మీడియా కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. అధికారులతో మాట్లాడి అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, జాతీయ కౌన్సిల్ సభ్యులు నలజాల వెంకట్రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వర రావు, మైసా పాపారావు, మాజీ అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, హౌజింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి మహేందర్, నగర అధ్యక్ష, కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, జనార్ధనాచారి, జిల్లా ఉపాధ్యక్షులు మోహినుద్దీన్, సత్యనారాయణ, నాయకులు ఏలూరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఓట్లు@32కోట్లు..




ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ నామ మాత్రమే
తనఖా ఆస్తులు అమ్మకం, లోన్లు తెచ్చి అప్పులు చెల్లింపు
వార్డులను బట్టి రూ.20 లక్షలు మొదలు 90లక్షల వరకు ఖర్చు
ఆడిట్‌లో రూ.3వేలిచ్చి తప్పులు సరిచేసుకుంటున్న వైనం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగగా చెప్పుకుంటాం. కానీ ఆ పండుగ ఇప్పుడు డబ్బుల వర్షంగా మారింది. ఇటీవల జరిగిన ఏదులాపురంమున్సిపాలిటీ ఎన్నికల సాక్షిగా ప్రజాస్వామ్యం కూని అయ్యింది. ఓట్ల కోసం భారీగా పెట్టిన ఖర్చులతో వినిపిస్తున్న వార్తలతో ప్రజల్లో చర్చనీయాంశమయ్యాయి. నిఘా వర్గాల అంచన ప్రకారం ఓట్ల కోసం రూ. 32కోట్ల వరకు డబ్బు ప్రవాహం కొనసాగినట్లు తెలిసింది. వార్డులను బట్టి రూ.90 లక్షల నుంచి 20లక్షల వరకు ఖర్చు పెట్టారంటే ఆశ్చర్యం కలగక మానదు. ఈ నేపథ్యంలో అందించిన ప్యాకేజీల గురించి అయితే చెప్పతరం కాదనే చెప్పాలి. అలాగే ఎన్నికల సమయంలో తనక పెట్టి తెచ్చిన ఆస్తులను తాజాగా అమ్ముకోవడంతో పాటు లోన్లు తెచ్చి కొందరు కౌన్సిలర్లు, పోటీ చేసిన అభ్యర్థులు అప్పు కట్టారంటే అతిశయోక్తి కాదు. ఇలా ఓటు ప్రజాస్వామ్య విలువలపై కాకుండా డబ్బుపై ఆధాపరడుతుంటం విస్తుగొలుపుతోంది.

**తనఖా ఆస్తులు అమ్మకం...**
ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగిన కొందరు అభ్యర్థులు భారీగా ఖర్చు చేసి ఇప్పుడు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రచారం, ఓటర్లను ఆకర్షించే కార్యక్రమాలు, వివిధ ఖర్చుల కోసం లక్షల రూపాయాలు వెచ్చించిన అభ్యర్థులు ఎన్నికల తర్వాత అప్పుల భారంతో సతమతమవుతున్న విషయం విధితమే. గెలుపుకోసం చేసిన ఖర్చులను తీర్చడాఇకి కొందరు తనక పెట్టిన ఆస్తులను అమ్ముకున్నారు. మరికొందరు బ్యాంకుల వద్ద నుంచి లోన్లు తీసుకొని, అప్పులను చెల్లింపు చేస్తున్నారు. కాగా ప్రజాస్వామ్యంలో ప్రజా సేవే ప్రధాన లక్ష్యంగా ఉండాల్సిన ఎన్నికలు, డబ్బు ప్రభావంతో భారమైన ఆర్థిక పోరాటంలా మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఎన్నికల ఖర్చులు పెరగడం వల్ల సాధారణ స్థాయి నాయకులు పోటీ చేయడం కూడా కష్టతరమవుతోందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితి మారాలంటే ఎన్నికల ఖర్చులపై కట్టుదిట్టమైన నియంత్రణతో పాటు, ప్రజల్లో కూడా అవగాహణ పెరగాల్సిన అవసరం ఉందని, నిపుణులు సూచిస్తున్నారు.

**రూ.3వేలతో ఆడిట్‌లో మేనేజ్...**
మున్సిపాలిటీ ఎన్నికల నిబంధనల ప్రకారం పోటీ చేసే అభ్యర్థి లక్ష రూపాయల వరకే ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ ఖర్చుకు గాను ముందుగానే ఒక ఎకౌంట్ ఓపెన్ చేయాలి.
ఇలా ఇందులో నుంచి డోర్ పోస్టర్లు, ప్రచార రథాలు, మైకులు, తదితర ఖర్చులు లక్ష వరకే పెట్టాల్సి ఉంటుంది. ఇప్పటివరకు అధికారకంగా సుమారు 70శాతం మంది తమ చేసిన ఖర్చులను ఎన్నికల ఆడిట్‌కు అందించారు. లక్షల రూపాయలను మంచినీళ్లలా వార్డుల్లో ఖర్చు పెట్టి, ఆడిట్‌లో తమ ప్రచారం కోసం రూ.25,15వేలంటూ లెక్కలను చూపించడం ఆశ్చర్యం కలగక మానదు. ఈ ఖర్చులలో చోటు చేసుకున్న తప్పుల తడకలను సరిదిద్దేందుకు ఎన్నికల ఆడిట్ విభాగంలో రూ.3వేల వరకు ప్రస్తుత కౌన్సిలర్లు, ఓడిపోయిన అభ్యర్థులు ఇస్తుండటం అవినీతి పరిస్తితికి అద్దం పడుతోంది.

**నామ మాత్రంగా ఎన్నికల కోడ్...**ఎన్నికల సమయంలో అమలు కావాల్సిన ఎన్నికల ప్రవర్తన నియమావళి(ఎలక్షన్‌కోడ్) ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత ముఖ్యమైనది. కానీ ఈ కోడ్ కేవలం పర్యవేణకే పరిమితమవుతున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారికంగా నియమాలు ఉన్నప్పటికీ, వాటి అమలులో మాత్రం నిర్లక్ష్యం కనిపిస్తున్నది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత డబ్బు పంపిణీ, విందులు, మద్యం, బహుమతులు వంటి ప్రలోభాలు పూర్తిగా నిషేధం, అయినప్పటికీ ఇవి బహరింగా రహస్యాలుగా కొనసాగుతున్నాయి. అభ్యర్థులు ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా వివిధ మార్గాల్లో ఓటర్లను ప్రభావితం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే ఇంత పెద్ద ఎత్తున్న పగలు, రాత్రి అనే తేడా లేకుండా రెండు, మూడు రోజులు, డిజిటల్ పేమెంట్ల ద్వారా కొనసాగిన ఒక్కటంటే ఒక్క ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు నమోదు కాలేదు. ఈ నేపథ్యంలో ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయడం, అక్రమాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం అవసరమని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్త చేస్తున్నారు. అలాగే ఓటర్లు కూడా తమ ఓటు విలువను గురితచి బాధ్యతతో వినియోగిస్తేనే ప్రజాస్వామ్యం బలపడుతుందని నిపుణులు తెలుపుతున్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
శనివారం
07-03-2026
www.prajapaksham.in
స్థానికం LOCAL NEWS

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఉమ్మడి వరంగల్ జిల్లా అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుకు చేరేలా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంపై మహబూబాబాద్ ఐడిఒసి కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్సీ రవీందర్ రావు, ఎమ్మెల్యేలు మురళీనాయక్, దొంతి మాధవరెడ్డి, రాజేందర్ రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామి రెడ్డి, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ నెల 6వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యా, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరతను తీర్చాలని, అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని చెప్పారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో కూడా వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలనిసూచించారు. అవసరమైన పరికరాలకు తగిన సిబ్బందిని నియమించి వాటిని సమర్థంగా వినియోగంలోకి తేవాలని పేర్కొన్నారు. పాఠశాలల వాహనాలు ఫిట్ నెస్ లేకపోతే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. జిపిఆర్ఎస్ ద్వారా పాఠశాల వాహనాలు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. స్లమ్ ఏరియాల్లో నివసిస్తున్న ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని తెలిపారు. ప్రతీ హాస్టల్ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించి తనిఖీలు చేయాలని, విద్యార్థులతో కలిసి భోజనాలు చేయాలని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాబితా తయారు చేయాలని తెలిపారు. మార్చి నెలాఖరు వరకు ఇందిరమ్మ ఇండ్లు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని, గ్రౌండ్ కాని ఇండ్లు లబ్ధిదారుల నుంచి అంగీకారాన్ని తీసుకుని రద్దు చేయాలని తెలిపారు.మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కార స్థితిని దరఖాస్తుదారులు తెలుసుకునేలా ప్రత్యేక సాఫ్ట్ వేర్ ను రూపొందించి సమాచారం వారి సెల్ ఫోన్లకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలికల వసతి గృహాల్లో వైద్య పరీక్షలు నిర్వహించాలని, మండల స్థాయిలో ఆరోగ్య సదస్సులు నిర్వహించి వైద్య పరీక్షలు చేపట్టాలని మంత్రి పేర్కొన్నారు. అలాగే గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్మన్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే జిఎస్ఆర్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో జంగేడు కెజిబివి హాస్టల్లో జరిగిన హెల్త్ మిషన్ 100 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మార్చి 2 నుండి జూన్ 9 వరకు కొనసాగే ఈ బృహత్తర కార్యక్రమం ద్వారా గర్భిణులు, బాలింతలు,చిన్నారులు, వృద్ధులకు నాణ్యమైన వైద్య సేవలను నేరుగా చేరువేయడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ మిషన్ మొత్తం నాలుగు దశల్లో అమలవుతుందనితెలిపారు. మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్స్, జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయ లక్ష్మీ, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, టౌన్ అధ్యక్షులు ఇస్లావత్ దేవన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రణాళికపై సమీక్ష



**ప్రజాపక్షం/మంగపేట :** మండల ప్రజా పరిషత్ అధికారి కార్యాలయంలో ఎంపిడిఒ బానోత్ బద్రునాయక్ డిఎల్పిఒ శ్రీధర్ అధ్యక్షతన శుక్రవారం ప్రజా పాలనప్రణాళిక లో భాగంగా మండల ప్రభుత్వ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజా పాలన ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ అధికారులు ఆయా శాఖలపై చేయలవలసిన అభివృద్ధి పనులు వారు చేయవలసిన ప్రణాళిక లు రచించి తదనుగుణంగా సమావేశం నిర్వహించి పలు సూచనలు శాఖ అధికారులకు ఎంపిడిఒ బద్రు నాయక్ వివరించినారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తోట రవీందర్, ఏఈ ఆర్ డబ్ల్యూ ఎస్.యాకన్నా, డిఆర్‌డిఒ డిపిఎం సుజాత, ఎంఇఒ పోదెం మేనకా, అగ్రికల్చర్ ఎఒ చేరాలు, ఐకెపిఎపిఎం సత్యనారాయణ, పీహెచ్సి డాక్టర్స్, పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ములుగు జిల్లా యువకుడికి సివిల్స్‌లో 793వర్యాంక్



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలానికి చెందిన దైనంపల్లి ప్రవీణ్ తన కృషి, పట్టుదలతో మరో విజయాన్ని సాధించారు. కష్టపడి చదివితే ఏదైనా సాధ్యమేనని ఆయన నిరూపించారు. ఇటీవల నిర్వహించిన గ్రూప్ 1 పరీక్షల్లో 105వ ర్యాంక్ సాధించి డిఎస్పిగా ఎంపికైన ప్రవీణ్, డిఎస్పి శిక్షణ పొందుతూనే తాజాగా విడుదలైన యూపిఎస్‌సి సివిల్స్ ఫలితాలలో 793వ ర్యాంక్ సాధించి ములుగు జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన ప్రవీణ్‌ను పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న ఆయన నానమ్మ ఎంతో కష్టపడి పెంచారు. ప్రవీణ్ సాధించిన ఈ విజయంపై స్థానిక ప్రజలు, స్నేహితులు, ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా ప్రగతి బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/మరిపెడ:** మరిపెడ మున్సిపాలిటినీ అభివృద్ధిలో పరుగులు పెట్టించాలని,నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మరిపెడ మున్సిపాలిటి చైర్‌పర్సన్ విసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి ఉద్దేశించి ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్ర నాయక్ అన్నారు.శుక్రవారం మరిపెడ మున్సిపాలిటిలో జరిగిన ఈ కార్యక్రామనికి ఆయన ముఖ్య ఆతిధిగా హాజరై మాట్లడుతూ మున్సిపాలిటి పరిధిలోని అన్ని వార్డులను అభివృద్ధి చెయ్యాలని అన్నారు.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్‌పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి కి,వైస్ చైర్మన్ కాలం సునిత రవీందర్ రెడ్డికి శుభకాంక్షలు తెలిపారు.జిల్లా నాయకులు యుగెంధర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్,మర్కెట్ కమిటి వైస్ చైర్మన్ అయిలమల్లు,జిల్లా ప్రధన కార్యదర్సి గగులోతు రవి నాయక్,అన్ని వార్డుల కౌన్సిలర్లు,కమీషనర్ విజయనంద్, సిబ్బంది, పాలొన్నారు.

## మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసిన కలెక్టర్

**ప్రజాపక్షం/జనగామ:** రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని శుక్రవారం కలెక్టర్ సందీర్ కుమార్ ఝా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి కలెక్టర్ జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల అమలు గురించి సంక్షిప్తంగా వివరించారు. అనంతరం మంత్రి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.

## ఇంటి పన్నులో ప్రభుత్వ అధికారులకు ఒక న్యాయం .. సామాన్యుడికి మరో న్యాయమా?

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** మండల కేంద్రంలోని పసర గ్రామంలో ఇంటి పన్నుల వసూళ్ల విషయంలో ద్వంద వైఖరి కనిపిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి సామాన్య ప్రజల నుంచి బకాయిల పేరుతో కఠినంగా వసూళ్ల చేస్తున్న ప్రభుత్వ అధికారుల ఇళ్ల విషయంలో మాత్రం సడలింపులు ఇస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి పన్నుల బకాయిల విషయంలో ఒత్తిడి తెస్తున్న అధికార యంత్రాంగం అదే సమయంలో ప్రభుత్వ అధికారుల ఇళ్లపై 40000 నుండి 50000 వేల వరకు బకాయిలు ఉండగా మాత్రం చర్యలు తీసుకోవడం లో ఆలస్యం చేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది ప్రభుత్వ నిబంధనలు అందరికి సమానంగా అమలు కావాలి పేద ధనిక సామాన్యుడు అనే తేడా లేకుండా చట్టం ముందు అందరూ సమానమే అన్న సూత్రం పాటించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు ఇంటి పన్ను వసూళ్లలో పారదర్శకత సమానత్వం ఉండాలని ఒకరికి ఒక రకం మరొకరికి మరో రకం విధానం కొనసాగితే ప్రజల్లో అవిశ్వాసం పెరుగుతుందని స్థానికలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఈ అంశంపై ఉన్నతాధికారులు స్పందించి స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

## 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగస్వామ్యులు కావాలి

స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, మేయర్, కలెక్టర్



**ప్రజాపక్షం/హనుమకొండ :** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా వేగంగా అమలవుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం వద్ద నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి, బల్దియా మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ పాల్గొన్నారు. అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులతో కలిసి స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా తీసుకుని ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికను రూపొందించిందన్నారు. పట్టణాలు, గ్రామాలు సమానంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో మౌలిక వసతుల కల్పన, పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కాలనీలు, వీధులు పరిశుభ్రంగా ఉండేలా మున్సిపల్ యంత్రాంగం సమర్థవంతంగా పనిచేయాలని, ప్రతి పౌరుడు కూడా పరిశుభ్రతను కాపాడటంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా వచ్చే 99 రోజులలో పట్టణాభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి అంశాల్లో స్పష్టమైన మార్పులు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మున్సిపల్ అధికారులు, సానిటరీ సిబ్బంది, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


## ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అత్యంత కీలకం

ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**ప్రజాపక్షం/జనగామ:** ప్రజలకు మెరుగైన వైద్యం అందించి జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తుందని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం లింగాలఘణపురంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వైద్యాధికారి డా. మల్లిఖార్జునరావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డిసిపి రాజమహేంద్ర నాయ్‌లతో కలిసి స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి లాంచనంగా ప్రారంభించి మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ గోపిరామ్,డిపిహెచ్‌ఎస్ డా. నరేందర్ శర్మ, వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ శివకుమార్, సర్పంచ్ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే పట్టణాభివృద్ధి సాధ్యం

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**ప్రజాపక్షం/పరకాల :** పరకాల పట్టణ అభివృద్ధి ప్రజల ఆశయాలను నెరవేర్చే విధంగా పాలక మండలి పని చేయాలని,పరకాల పట్టణాభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు.శుక్రవారం పరకాల పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో పరకాల మున్సిపాలిటీ నూతన పాలక మండలి బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్,పాలక మండలి సభ్యులకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పట్టణ అభివృద్ధి ప్రజల ఆశయాలను నెరవేర్చే విధంగా పాలక మండలి పని చేయాలి అన్నారు.పరకాల పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే దిశగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు మున్సిపాలిటీ పాలక మండలి కృషి చేయాలని కోరారు.పరకాల పట్టణ అభివృద్ధికి నూతనకౌన్సిలర్లు,అధికారులుసమన్వయంతోపనిచేయాలని సూచించారు.

## ప్రజల ఆరోగ్యంపట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అత్యంత కీలకం* స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

* జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం శ్రద్ధ చూపుతుందని, స్టేషన్ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పటిస్తాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వైద్యాధికారి, డాక్టర్ మల్లికార్జునరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డిసిపి రామచంద్ర నాయక్, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్యం అందించి జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తుందని స్టేషన్ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. పేద ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ ఆరోగ్య శిబిరాలలో కంటి, దంత, డైనకాలజీ, ఆర్థోపెడిక్స్, పిరియా ట్రిక్స్, జనరల్ మెడిసిన్ విభాగాలకు చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు పాల్గొంటారని, ఇలాంటి శివరాలను ప్రజలందరూ తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే బీపీ, షుగర్, క్యాన్సర్, ఎముకల నొప్పుల, వంటి వ్యాధుల గుర్తించేందుకు, వైద్య పరీక్షలు చేపట్టి, అవసరమైన మందులు అందించాలన్నారు. ఇందుకు ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, కీలక పాత్ర పోషిస్తారని వారు తెలిపారు. జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా, తప్పనిసరిగా స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. హాస్పటల్ ను పరిశీలించారు. పేషంట్ల రిజిస్టర్ చేయు పద్ధతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా వీలుకాని పక్షంలో పెద్ద ఆసుపత్రులకు రెఫరల్ చేయాలన్నారు. అలాగే రోజువారిగా నిర్దేశించి లక్ష్యాలను సాధించుటకు ఆశ వర్కర్లు స్థానికుల సహకారం తీసుకోవాలన్నారు. ఆస్పత్రిలో పనిచేసే సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి గోపి రామ్, డిపిహెచ్ఎస్ డాక్టర్ శర్మ, డాక్టర్ స్వర్ణలత, జనగామ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కొల్లూరి శివకుమార్, సర్పంచులు, ఎట్లా లావణ్య రాజు, నర్సింగ రామకృష్ణ, సదానందం, చీటకోరు సంపత్, గాదే పాక విష్ణు, ఆయాశాక అధికారులు, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ కుటుంబం పరిశుభ్రతను పాటించాలి

ప్రజా సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ లక్ష్యం* ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** పట్టణంలోని ప్రతి కుటుంబం పరిశుభ్రతను పాటించి వార్డులో శుభ్రంగా ఉండాలని భూపాలప ల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో 3వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని గండ్ర సత్యనారాయణ రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్ర జాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, డ్రైనేజీలు, కాలనీలు, ఇళ్ల పరిసరాల ను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని ప్రజలకు సూచించారు. గ్రామాలు మరియు పట్టణాల్లో విద్యుత్ సౌకర్యాలు, డ్రైనేజీ స మస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, మిడిల్ పోల్స్ అవసరం వ ంటి సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో వి ద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యాలను మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. అలాగే విద్యార్థుల వి ద్య, హాస్టల్ సౌకర్యాలు మరియు ప్రజల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఆరోగ్య శాఖ ద్వారా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధులను ముందుగానే గుర్తించి తగిన వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అన్ని శా ఖల అధికారులు పాల్గొని ప్రజల సమస్యలను పరిష్కరించే ది శగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ వార్డులు, గ్రా మాల అభివృద్ధికి భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్ కౌన్సిలర్లు, అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రైతు వేదికలో యంత్ర పరికరాలు పంపిణీ



**ప్రజాపక్షం/నెక్కొండ:** నర్సంపేట నియోజకవర్గ స్థాయిలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం క్రింద రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమం నెక్కొండ రైతు వేదికలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, నెక్కొండ గ్రామ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, కలిసి రైతులకు రోటవేటర్లు, స్ప్రేయర్లు, వరిగడ్డి కట్టే యంత్రాలు, 11 చాళ్ల నాగళ్లు తదితరంగా మొత్తం 86 వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నర్సంపేట మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యంత్ర పరికరాల సబ్సిడీ పథకాన్ని పునరుద్ధరించిందన్నారు. ఈ రోజు రూ.16.5 లక్షల విలువైన యంత్ర పరికరాలను 86 మంది రైతులకు అందించామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను నర్సంపేట నియోజకవర్గ రైతులకు రూ. 95లక్షల విలువైన సబ్సిడీ యంత్ర పరికరాలను ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు. ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డి మార్గదర్శకత్వంలో రైతులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నామని చెప్పారు. అనంతరం ఆత్మ పథకం కింద రైతులకు వ్యవసాయంలో నైపుణ్యత పెంపు సాంకేతిక పద్ధతులపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వరంగల్ జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ విజయనిర్మల మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి, విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా అధిక లాభాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు దామోదర్ రెడ్డి, నెక్కొండ మండల వ్యవసాయ అధికారి నాగరాజుతో పాటు నర్సంపేట మండల వ్యవసాయ అధికారి, ఏఈఓ అరుణ్, వసంత, ఆత్మ కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

## 'ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం ప్రారంభం



**ప్రజాపక్షం/ములుగు:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా పురపాలక సంఘాలలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ములుగు మున్సిపాలిటీ పరిధిలోని వార్డు నెంబర్ 1 జీవంతరావుపల్లిలో ఇట్టి కార్యక్రమం లాంఛనంగా ప్రారంభించారు. మార్చి 6 నుండి 15 వరకు చేపట్టి ప్రత్యేక పారిశుధ్యం కార్యక్రమాల్లో భాగగా మొదటి రోజు ప్రతిజ్ఞ చేసి 1, 2, 3 వార్డులలో సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, గౌరవ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, కమిషనర్ టి రమేష్, వైస్ చైర్‌పర్సన్ ఆసియా షాహీన్, గౌరవ వార్డు కౌన్సిలర్లు, ప్రముఖులు పాల్గొన్నారు.

## వృథాగా పోతున్న మంచినీరు



**ప్రజాపక్షం/నడికూడ :** అసలే ఎండాకాలం నీటి ఎద్దడి లేకుండా చూడాల్సిన పని అంతేకానీ యదేచ్ఛగా వృధాగా నీరు పోతున్న దృశ్యం..హనుమకొండ జిల్లా నడికూడ మండలం ధర్మారం గ్రామం మెయిన్ రోడ్ అనుకోని బొడ్రాయి వద్ద పైపు పగిలి ప్రజలకు త్రాగునీరు అందే మంచినీరు వృధాగా పోతున్న (పట్టించుకోరా) పట్టింపులేనట్లుగా కనిపిస్తోంది. మంచినీరు గ్రామ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది.పైపు పగిలి నీరు బయటికి వచ్చి రోడ్డు పక్కనుండి వెళ్తూ,పక్కనే ఉన్న కాలువలో కలుస్తుంది.కావున ఎండాకాలం దృష్ట్యా జిపి,సంబంధిత అధికారులు స్పందించి వృధాగా వెళుతున్న నీరు ప్రాంతంలోని ఆ పైపును మరమ్మత్తులు చేసి ప్రజల దాహాన్ని తీర్చే విధంగా కృషి చేయాలని గ్రామస్తులు,పలువురు కోరుతున్నారు.

# అక్షర్ అద్భుతం..బౌండరీ వద్ద కళ్లు చెదిరే క్యాచ్



పొట్టి ప్రపంచకప్ కీలక మ్యాచ్‌లో భారత వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్ మైదానంలో అద్భుతం చేశాడు. సెమీఫైనల్స్‌లో టామ్ బ్యాంటన్‌ను క్లీన్‌బౌల్డ్ చేసిన అక్షర్.. కళ్లు చెదిరే క్యాచ్‌తో బిగ్ వికెట్ అందించాడు. అర్షదీప్ సింగ్ వేసిన 14వ ఓవర్ చివరి బంతికి విల్ జాక్స్(35) పెద్ద షాట్ ఆడగా.. పరుగెడుతూ వెళ్లిన అక్షర్ పటేల్ బంతిని అందుకున్నాడు. బ్యాలెన్స్ తప్పి బౌండరీ లైన్‌కు తాకుతున్నట్లు గమనించిన అతడు.. అప్రమత్తమై బంతిని శివం దూబే వైపు విసిరాడు. దూబే కూల్‌గా బంతిని అందుకోవడంతో డేంజరస్ జాక్స్ ఔటయ్యాడు. అంత.. భారత డగౌట్, స్టేడియంలోని అభిమానులు సంబురాల్లో మునిగిపోయారు. భారత్ నిర్దేశించిన 254 పరుగుల ఛేదనలో 95కే ఇంగ్లాండ్ నాలుగు వికెట్లు పడ్డాయి. ఆ దశలో ప్రత్యర్థిని టీమిండియా చిత్తు చేయడం ఖాయమనుకున్నారంతా. కానీ, జాకబ్ బెథెల్ (105)కు తోడుగా.. విల్ జాక్స్(35) చెలరేగాడు. దాంతో.. ఇంగ్లాండ్ లక్ష్యానికి చేరువ కాసాగింది. ఆ సమయంలో 14వ ఓవర్ వేసిన అర్షదీప్. మూడు వైడ్లతో ఆందోళన కలిగించాడు. కానీ, జాక్స్‌ను ఊరిస్తూ అతడు వేసిన చివరి బంతిని అక్షర్ పటేల్ బౌండరీ వద్ద కళ్లు చెదిరే విధంగా క్యాచ్ అందుకున్నాడు. బౌండరీని తాకేలోపే.. బంతిని దూబే చేతికి అందించి.. జాక్స్ వికెట్ తీయడంలో కీలకమయ్యాడు. అతడు అప్పటివర కూ బెథెల్తో కలిసి బౌండరీల మోతతో ఇంగ్లాండ్ స్కోర్ బోర్డును ఉరికించిన జాక్స్ ఔటవ్వడంతో మ్యాచ్ భారత్ వైపు తిరిగింది. చివరి ఓవర్‌లో 30 పరుగులు అవసరమవ్వగా.. తొలి బంతికే బెథెల్ రనౌట్ కావడంతో ఇంగ్లాండ్ ఓటమి ఖాయమైంది. చివరి మూడు బంతుల్లో ఆర్చర్ సిక్సర్లు రాబట్టినా.. 7 పరుగులతో గెలుపొందిన సూర్యకుమార్ సేన ఫైనల్లో అడుగుపెట్టింది.

## మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ నాకు కాదు.. అతడికి ఇవ్వాలి : సంజూ శాంసన్




**ముంబై:** టి–20 వరల్డ్ కప్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన సెమీఫైనల్లో ఇండియా ఉత్కంఠ విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. పరుగుల ప్రవాహం సృష్టించిన ఆ మ్యాచ్‌లో ఇండియా ఏడు పరుగుల తేడాతో నెగ్గింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఇండియా ఏడు వికెట్ల నష్టానికి 253 రన్స్ చేసింది. అయితే బ్యాటర్ సంజూ శాంసన్ కేవలం 42 బంతుల్లో 89 రన్స్ చేసి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. వాంఖడే స్టేడియంలో బౌండరీల మోత మోగించాడు. అతని ఇన్నింగ్స్ లో 8 ఫోర్లు, ఏడు సిక్సర్లు ఉన్నాయి. నువ్వా నేనా అన్నట్లుగా సాగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ ఆఖరి వరకు పోరాడింది. ఇంగ్లాండ్ ఏడు వికెట్ల నష్టానికి 246 రన్స్ చేసి ఏడు పరుగుల తేడాతో ఓటమి పాలైంది. ఇంగ్లాండ్ బ్యాటర్ బేథెల్ సూపర్ సెంచరీ కొట్టాడు. 48 బంతుల్లో 8 ఫోర్లు, ఏడు సిక్సర్లతో 105 రన్స్ చేసి ఔటయ్యాడు. అయితే భారత్ ఇన్నింగ్స్‌తో అత్యధిక రన్స్ చేసిన సంజూ శాంసన్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. అవార్డు అందుకున్న తర్వాత సంజూ మాట్లాడుతూ.. ఈ అవార్డు తనకు దక్కాల్సింది కాదన్నారు. భారత జట్టు విజయంలో బౌలర్ బుమ్రా కీలక పాత్ర పోషించినట్లు పేర్కొన్నారు. గెలుపు క్రెడిట్ బుమ్రాకే దక్కుతుందని, అతనో ప్రపంచ మేటి బౌలర్ అని, తరానికి ఓసారి అలాంటి ఆటగాడు దొరుకుతారని, సెమీస్ మ్యాచ్‌లో అద్భుతంగా బౌలింగ్ చేశాడని, ఈ అవార్డు వాస్తవానికి ఆయనకే దక్కాలన్నారు. డెత్ ఓవర్లలో బుమ్రా వేసిన బౌలింగ్ తీరు ప్రత్యేకమైందని, ఒకవేళ అలా బౌలింగ్ చేయకుంటే, బహుశా తాను ఇక్కడ నిలబడేవాడిని కాదన్నారు. ఈ విజయంలో బౌలర్లకే క్రెడిట్ దక్కుతుందన్నారు. కఠినమైన పరిస్థితుల్లో ఉత్తమంగా రాణించారన్నారు. ఇన్నింగ్స్ 18వ ఓవర్లో బుమ్రా యార్కర్లతో ఇంగ్లాండ్ బ్యాటర్లను అడ్డుకున్నాడు. కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి తక్కువ పరుగులు ఇచ్చాడు. ఇండియా విక్టరీలో ఆ ఓవర్ అత్యంత కీలకంగా మారింది.

## ఆల్‌ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్స్‌కు లక్ష్య




**బర్మింగ్‌హామ్:** ఆల్‌ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ టోర్నీలో టైటిలే లక్ష్యంగా ఆడుతున్న భారత నంబర్ వన్ షట్లర్ లక్ష్యసేన్ ఆ దిశగా మరో మందడుగు వేశాడు. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్లో అతడు.. 21–19, 21–23, 21–10తో ఇంగ్ క లాంగ్ అంగస్ (హాంకాంగ్)ను ఓడించి క్వార్టర్స్ చేరాడు.

హాంకాంగ్ షట్లర్‌తో ఆడిన గత మూడు మ్యాచ్‌లో ఓడిన సేన్.. గంటా 18 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో మాత్రం అతడికి షాకిచ్చాడు. మిస్టడ్ డబుల్స్‌లో ధృవ్ కపిలతనీషా క్రాస్టో 19–21, 2–9తో సెయింగ్, టాంగ్ చున్ (హాంకాంగ్) చేతిలో ఓడిపోయింది.

## సైన్స్

# రంగులు ఉంటాయా?



ఈ ప్రశ్న వింతగా కనిపించవచ్చుగానీ, సైన్స్ ప్రకారం ఇది ఒక పరిశోధనాంశం. ఒకే రకమైన వెలుగు, ఉదాహరణకు సూర్యకాంతి, వేరువేరు మెదళ్లలో, వేరువేరు రంగుల లోకాలకు తీసుకెళుతుంది. నిజానికి వెలుగు మారదు. దానిని అర్థం చేసుకునే మెదడు యంత్రాంగమే మారుతున్నది. మనం చూస్తున్న రంగుల పరిధి ఒకటైతే, ఇతర జంతువులు అదే దృశ్యాన్ని మరో విధంగా చూస్తాయి. తేనెటీగలు మనకు ఊహకందని అల్ట్రావయలెట్ నమూనాలను చూస్తాయి. పాములు ఇన్‌ఫ్రారెడ్ వేడిని గుర్తిస్తాయి. కొన్ని పక్షులకు మనకంటే ఎక్కువ రంగు ఛానళ్లు ఉంటాయి. అయినా బయట ఉన్న వాస్తవం మారలేదు. మారిందల్లా దాన్ని అనువదించే మెదడు. ముడి ఎలక్ట్రోమాగ్నెటిక్ సమాచారాన్ని తీసుకుని, దానికి అర్థం, భావోద్వేగం జోడిస్తుంది. ఎరుపు రంగు వేడి లేదా అత్యవసరంగా అనిపిస్తుంది. నీలం ప్రశాంతంగా అనిపిస్తుంది. కానీ ఈ వేడి, శాంతి అన్న భావాలు వెలుగులో లేవు. అవన్నీ మెదడు నిర్మించిన అర్థాలు. అవి ఉపయోగకరమైనవే, కానీ పూర్తిగా వ్యక్తిగతమైనవి. అందుకే విశ్వం స్వయంగా రంగులమయం కూడా కాదు. అలాగని నిస్సారం కూడా కాదు. అది మౌనంగా, రంగుల్లేకుండా, తరంగాలతో, శక్తితో నిండి ఉంటుంది. ఆ వడపోతలేని డేటాపై రంగులను పూసేది.. పూయించేది చైతన్యమే. మనం చూసే ప్రతి క్షణం లోనూ వాస్తవాన్ని యథాతథంగా చూడటం లేదు. మన మెదడు నీ కోసం ప్రత్యేకంగా నిర్మించిన ఒక సంస్కరణను మాత్రమే చూస్తున్నాం. ఇది భ్రమ కాదు. అయితే, పూర్తి సత్యం కూడా కాదు. ఇది జీవించడానికి సరిపడే, అర్థవంతమైన అనువాదం మాత్రమే. కాబట్టి రంగులు ఉన్నాయా? అనే ప్రశ్నకు నేరుగా లేదా ఒకే పదంలో సమాధానం ఇవ్వడం అసాధ్యం.

## కాంతివేగం చిత్రీకరణ



కేవలం ఊహించడానికి కూడా కసాధ్యంకానిది కాంతి వేగం. సెకనుకు సుమారు 3 లక్షల కిలో మీటర్ల వేగంతో కాంతి దూసుకెళుతుంది. దీనిని అంచనా వేయడం కూడా సులభసాధ్యం కాదు. అయితే, శాస్త్రవేత్తలు ఇటీవల సాధించిన ఒక సాంకేతిక విజయం కాంతి విజ్ఞాన చరిత్రలో కీలక ఘట్టంగా పరిగణించబడుతోంది. మొదటిసారిగా కాంతి తన స్వభావ పరమ వేగమైన ప్రయాణ ప్రక్రియను చిత్రీకరించగలిగారు. కాంతి కదలికను నేరుగా చూడటం మన ఇంద్రియాలకు సాధ్యం కాదు. ఎందుకంటే మన నాడీవ్యవస్థ అటువంటి కాల పరిమాణాలను గ్రహించేలా అభివృద్ధి చెందలేదు. అయితే అతి వేగవంతమైన అల్ట్రాఫాస్ట్ ఇమేజింగ్ సాంకేతికతల సహాయంతో ఈ అసాధ్యమైనదాన్ని సాధ్యంగా మార్చారు. ఈ విధానాలు ఫెమ్టోసెకండ స్పెక్ట్రోస్కోపీ పరిశోధనలు పునాది వేశాయి. తదనంతరం అధునాతన ఫోటోనిక్ పరికరాలు కాంతి తరంగాల క్షణిక గమనాన్ని నమోదు చేయగలిగాయి. ఈ విజయం కేవలం సాంకేతిక ప్రదర్శన మాత్రమే కాదు. పరిశోధకులు తమ పరికరాలను క్వాంటం స్థాయికి మళ్లించినప్పుడు, అక్కడ బయటపడిన దృశ్యాలు సాధారణ భావనలకు సవాలు విసిరాయి. సూక్ష్మ కణాల ప్రవర్తనను నియంత్రించే క్వాంటం మెకానిక్స్ సూత్రాలు, ముఖ్యంగా వార్నర్ హీసెన్‌బెర్గ్ ప్రతిపాదించిన అనిశ్చితి సూత్రం, వాస్తవికత నిర్దిష్టంగా కాకుండా సంభావ్యతల రూపంలో ఉంటుందని సూచిస్తాయి. కణాలు ఒకేసారి తరంగాల్లా, కణాల్లా ప్రవర్తించడం మానవ మేధస్సుకు సవాళ్లు విసురుతున్నది. అంతేకాదు, కొలిచే ప్రయత్నం చేసినప్పుడు ఒక్కసారిగా వాయు లేదా ధ్వని రూపంలోకి మారిపోవడం కూడా ప్రస్తుతానికి సమాధానం లేని ప్రశ్నగానే ఉంది. దూరంగా ఉన్న కణాలు పరస్పరం అనుసంధానంగా ప్రవర్తించడం వంటి లక్షణాలు మన సాధారణ తార్కిక నిర్మాణానికి విరుద్ధంగా కనిపిస్తాయి. అంటే, మన మెదడు అభివృద్ధి చెందిన పరిధి మాక్రో స్థాయి ప్రపంచం వరకు మాత్రమే.

## బ్లాక్‌హోల్స్‌కూ.. వైఫైకీ సంబంధం!



బ్లాక్ హోల్స్‌పై పరిశోధనలు చేస్తూ ఖగోళ శాస్త్రవేత్తలు ఒక ముఖ్యమైన అంశాన్ని గుర్తించారు. బ్లాక్ హోల్‌లోకి గ్యాస్, ధూళి, నక్షత్ర అవశేషాలు పడిపోతున్నప్పుడు అవి నిశ్శబ్దంగా అంతరించిపోవు. ఆ పదార్థం ఈవెంట్ హరైజన్‌కు చేరుకునే ముందు తీవ్ర ఘర్షణ, అయస్కాంత క్షేత్ర పరస్పర చర్యల వల్ల అధిక ఉష్ణోగ్రతలకు చేరుకుని విపరీతమైన శక్తిని విడుదల చేస్తుంది. ఈ శక్తి ఎక్స్‌రేలు, గామా కిరణాలు మాత్రమే కాకుండా రేడియో తరంగాల రూపంలో కూడా వెలువడుతుంది. ఇలాంటి శక్తివంతమైన రేడియో ఉద్గారాలు సూపర్‌మాసివ్ బ్లాక్ కేంద్రకాల్లో స్పష్టంగా కనిపించాయి. ఉదాహరణకు ధనస్సురాశి పరిసరాల్లోని కదలికలు దీనికి సాక్ష్యం. అంతరిక్షం నుంచి వస్తున్న ఈ రేడియో సంకేతాలను 20వ శతాబ్ద ప్రారంభంలో గుర్తించినప్పుడు శాస్త్రవేత్తలు ఆశ్చర్యపోయారు. గాలి లేకపోయినా, పూర్తిగా ఖాళీగా కనిపించే అంతరిక్షంలో ఈ తరంగాలు వేల, లక్షల కాంతి సంవత్సరాల దూరం ప్రయాణించడం ఎలా సాధ్యమవుతోంది అన్న ప్రశ్న ముందుకొచ్చింది. ఇక్కడ ఒక ప్రాథమిక సూత్రం స్పష్టమైంది. ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ తరంగాలకు మాధ్యమం అవసరం లేదు. అవి శూన్యంలోనూ స్వేచ్ఛగా వ్యాపిస్తాయి. ఈ సిద్ధాంత పునాది 19వ శతాబ్దంలోనే జేమ్స్ క్లార్క్ మాక్స్‌వెల్ సమీకరణాల ద్వారా ఏర్పడింది. తరువాత హెన్రిచ్ హెర్ట్జ్ ప్రయోగాలు ఆ తరంగాల ఉనికిని నిర్ధారించాయి. ఖగోళ పరిశీలనల ద్వారా రేడియో తరంగాలు విశ్వవ్యాప్తంగా సహజసిద్ధంగా ఉత్పత్తి అవుతున్నాయని తెలిసింది. ఈ అవగాహన భూమిపై ఒక సాంకేతిక విప్లవానికి దారితీసింది. శక్తి తరంగాలు శూన్యంలోనూ ప్రయాణిస్తే, సమాచారాన్ని కూడా వాటి ద్వారా పంపవచ్చుకదా? అన్న ఆలోచన నుంచే వైర్‌లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థలు అభివృద్ధి చెందాయి. రేడియో ప్రసారాల నుంచి మొబైల్ కమ్యూనికేషన్ వరకూ, చివరికి వైఫై ఒంటి సాంకేతికతల వరకు ఎన్నో సాంకేతికతలకు ఈ మూల సూత్రమే ఆధారం.

## ఎఐటియుసిలో చేరిన ఎస్‌డబ్ల్యుఎఫ్ మాజీ నాయకుడు సంజీవ్




**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** ఆర్‌టిసిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకోవడం కోసం ఎంప్లాయిస్ యూనియన్, ఎఐటియుసిలు కార్మిక పక్షాన నిలుస్తు జెఎసి ఏర్పాటు చేసి కార్మికుల సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్నామని ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకట్‌గౌడ్, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. శుక్రవారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో వెంకట్‌గౌడ్, వై.ఓమయ్య, ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ కార్యదర్శి సాయిలు సమక్షంలో ఆర్‌టిసిలో కండక్టర్‌గా విదులు నిర్వహిస్తున్న ఎస్‌డబ్ల్యు ఎఫ్ మాజీ నాయకుడు డి.సంజీవ్‌కు ఎఐటియుసిలో చేరారు. ఆయనకు కండువా వేసి ఎఐటియుసి ఎంప్లాయిస్ యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌టిసిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ఆర్‌టిసిలో ఖాళీగా ఉన్న సుమారు 20 వేల పోస్టుల భర్తీ చేయాలని, ఆర్‌టిసిలో తీసుకుంటున్న ఎలక్ట్రిక్ బస్సులను ప్రయివేటు వారికి కాకుండా ఆర్‌టిసికే కేటాయించాలని, ఆర్‌టిసిలో పెంచిన తీవ్రమైన పని భారాలను తగ్గించాలని, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ నియామకాల ప్రక్రియలను నిలిపివేసి రెగ్యులర్ ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంజీవ్ మాట్లాడుతూ ఎంప్లాయిస్ యూనియన్, ఎఐటియుసి పనివిధానం నచ్చి యూనియన్‌లో చేరానని అన్నారు. రాబోయే కాలంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి సీనియర్ నాయకులు పి.సుధాకర్, విఠల్ గౌడ్, రాధాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని నియంత్రించండి : ఎఐఎస్‌ఎఫ్ వినతి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడిని నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల విద్యాధికారి మనోహర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆకాష్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలల వ్యవహరిస్తుంటే ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పాఠశాల అవరణలోనే విద్యార్థులకు బుక్స్, యూనిఫాం విక్రయిస్తూ వేల రూపాయాలు వసూళ్లు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం నిద్రమత్తులో జోగుతున్నారని మండిపడ్డారు. పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాం విక్రయాలను నిలిపివేయాలని, నిబంధనలకు విరుద్ధంగా పెంచిన ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని, విద్యాశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల తలిదండ్రులతో కలిసి ఉద్యమాలు చేస్తామని నాయక్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు అరుణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల పోరాట దినమే మహిళా దినోత్సవం

### భారత జాతీయ మహిళా సమఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి





**ప్రజాపక్షం/వరంగల్ :** మహిళల హక్కుల పోరాట దినమే మహిళా దినోత్సవమని ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదాలక్ష్మి తెలిపారు. గురువారం వరంగల్ జిల్లా శివనగర్‌లోని మహిళా సమాఖ్య కార్యాలయంలో టి.రహేలా అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదాలక్ష్మి ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో నేదునూరి జ్యోతి మాట్లాడుతూ సమాజం ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ ఇంకా మహిళల పట్ల వివక్షత, పీడన, దోపిడీ, హత్య, హత్యాచారాలు నిత్య కృత్యమైనాయని ఆవేదన వెలిబుచ్చారు. సమాజంలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది సాంఘికంగా సమానత్వం చెందినప్పుడు రాజకీయరంగంలో సమాన భాగస్వామ్యం కల్పించినప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సంక్షేమం పేరుతో మహిళలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని, మహిళలని అసెంబ్లీకి , పార్లమెంటుకు పంపించి మహిళా సాధికారతను సాధించి పెట్టాలని పాలకవర్గాలను డిమాండ్ చేశారు. సనాతన ఆచారాల పేరుతో కేంద్ర పాలకులు మహిళా శక్తిని నిర్వీర్యం చేస్తున్న ధ్వజమెత్తారు. సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్‌మియా మాట్లాడుతూ మహిళా సాధికారిత కొరకు నివాస స్థలాలు కేటాయించి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని ఇప్పటికే వివిధ ప్రాంతాలలో నిరుపేద మహిళలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న వారికి పట్టా ఇచ్చి పక్క గృహాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి లాదేళ్ల శరత్ భవాని, సౌందర్య, సువర్ణ, ఉమా, షహనాజ్ బేగం, విజయలక్ష్మి, షఫీ నా గౌతమి, మానస తదితరులు పాల్గొన్నారు.

### సమాజాన్ని తీర్చిదిద్దడంలో మహిళల పాత్ర అమోఘం

**భూపాలపల్లి :** సమాజాన్ని తీర్చిదిద్దడంలో మహిళల పాత్ర అమోఘం అని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి అన్నారు. శుక్రవారం భూపాలపల్లి మహిళా సమఖ్య కార్యదర్శి కొరిమి సుగుణ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ మాతృస్వామ్య వ్యవస్థ నిర్మాణమే ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది అన్నారు. నాటి మాతృ స్వామ్య వ్యవస్థ నిర్మాణం కొరకు రోజా లగ్జం బర్గ్ క్లారా జెట్కిన్ త్యాగాల స్ఫూర్తితో అడవి బిడ్డల హక్కుల కోసం ప్రాణాలర్పించిన గిరిజన వీరవనితలు సమ్మక్కల సారక్కల అమరత్వం సాక్షిగా మహిళా పోరాటాలను ఉధృతం చేస్తూ ముందుకు నడిపిస్తామని తెలిపారు. జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలకు చట్టసభలలో, స్థానిక సంస్థలలో, విద్యా ఉద్యోగాలలో ఉపాధి రంగాలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. వర్గాధిపత్యాన్ని పితృస్వామ్యాన్ని చేదించి సమాన అవకాశాలు కల్పించే నూతన సమ సమాజాన్ని నిర్మాణం చేసుకుంటేనే స్త్రీ జాతికి విముక్తి కలుగుతుందని అందుకు ప్రజాస్వామిక పోరాటాలలో మహిళలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మద్యం, మత్తు పదార్థాలను నిషేధించి పసిపిల్లలు, బాలికలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, హత్యలను నిరోధించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఇంటి పని వంట పని, పంటపని, కండక్టర్ నుండి కలెక్టర్ వరకు కర్తవ్యాన్ని నెరవేరుస్తున్న మహిళ రాజకీయ రంగాలలో రాణించగలరని, అందుకు పార్లమెంటు; శాసనసభలలో రిజర్వేషన్లు కల్పించాలని నేదునూరి జ్యోతి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షురాలు సుజాత, జిల్లా అధ్యక్షురాలు గోలి లావణ్య, సహాయ కార్యదర్శి సంధ్య, పొనగంటి లావణ్య, నాగమణి, తిరుపతమ్మ, సంధ్య, రాజేశ్వరి, సమత, శారదా, శేఖరమ్మా, శాంతి, అంజలి, శోభ, సమ్మక్క, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడిన సంగేమయ్య

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల్ నరసింహ్మ

**ప్రజాపక్షః/నాగర్‌కర్నూల్ :** భూస్వాములకు వ్యతిరేకంగా, పేద ప్రజల పక్షాన జరిగిన అనేక పోరాటాలలో సిపిఐ సీనియర్ నాయకుడు మండ్ల సంగేమయ్య కీలక పాత్ర పోషించారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్ నరసింహ్మ అన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గం సింగోటం గ్రామానికి చెందిన సిపిఐ నాయకులు మండ్ల సంగేమయ్య గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న బాల్ నరసింహ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ శుక్రవారం సింగోటం గ్రామానికి వెళ్లి మండ్ల సంగేమయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భం గా బాల్ నరసింహ మాట్లాడుతూ దున్నే వాడిదే భూమి కావాలని, పేద ప్రజలకు దక్కాల్సిన హక్కుల రావాలని, భూసంస్కరణ తీసుకురావాలని జరిగిన అనేక పోరాటాలలో తొలితరం కమ్యూనిస్టు పార్టీ నాయకులలో మండ్ల సంగేమయ్య ఒక్కరన్నారు. సంగేమయ్య మాత్రమే కాకుండా వారి కుటుంబ సభ్యులందరూ కమ్యూనిస్టు సిద్ధాంతాలను నమ్మిన వారని, సంగేమయ్య మరణం సిపిఐకి తీరనిలోటన్నారు. సంగేమయ్య కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. అంతిమయాత్ర లో సిపిఐ నాయకులు ఇంద్ర, కొల్లాపూర్, శివుడు, కిరణ్‌కుమార్, గోపాల్, చందు, బాలయ్య గౌడ్, నరసింహ, కృష్ణ, వెంకటస్వామి, మల్లయ్య, పవన్, శివకృష్ణ, శివలింగం తదితరులు పాల్గొన్నారు.



## సీతమ్మ మృతి సిపిఐకి తీరని లోటు



### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** భైరవునిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కనకబండి సీతారాములు సతీమణి కనకబండి సీతమ్మ మృతి సిపిఐకి తీరని లోటని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం ఆయన సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావుతో కలిసి సీతారాములు కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సీతమ్మ ప్రజా సేవలో ముందుండేవారని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో సిపిఐ బలోపేతానికి సీతమ్మ చేసిన సేవలను కొనియాడారు. పార్టీ తరపున సీతమ్మ కుటుంబానికి అండగా ఉంటామని కూనంనేని భరోసా ఇచ్చారు. అనంతరం సీతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నాటి భాను ప్రసాద్, మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వర రావు, సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి బాలిన కృష్ణం రాజు, ఉప సర్పంచ్ ఆలేటి ఉమామహేష్, భద్రాజీ వేంకటేశ్వర రావు, బాలేబోయిన వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణానికి శంకుస్థాపన



ప్రజాపక్షం/బైంసా : బైంసా మండలంలోని పెండ్ పెల్లి గ్రామంలో రెండు మహిళా సమైక్య సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ 35 లక్షల 50 వేల నిధులతో పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలను ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఘనంగా ప్రారంభించారు.పాఠశాలల్లో విద్యార్థులకు భద్రత లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని,ప్రహరీ గోడ నిర్మాణంలో వారికి పూర్తి రక్షణ కలుగుతుందని తెలిపారు.అలాగే,మహిళా సమైక్య సంఘ భవనాల ద్వారా మహిళలు ఆర్థికంగా,సామాజికంగా అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు.గ్రామాల సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని,విద్యారంగం మహిళా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.సర్పంచులు, మండల నాయకులు,ప్రజాప్రతినిధులు,అధికారులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికకు శ్రీకారం

మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్



ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని క్యాతనపల్లిలో శుక్రవారం ప్రారంభించారు. రాజీవ్ చౌక్ వద్ద ఏర్పాటు చేసినఅధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. రాబోయే 10 రోజుల్లో పట్టణంలో చేపట్టబోయే అభివృద్ధి, పారిశుద్ధ్య పనులపై స్పష్టతనిచ్చారు. ముఖ్యంగా పట్టణం లో చెత్త సేకరణను క్రమబద్ధీకరించడం, తడి, పొడి చెత్తను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. కాలువలను శుభ్రపరచడం, రహదారుల పక్కన ఉన్న పిచ్చి మొక్కల తొలగింపు, ఫాగింగ్ నిర్వహణ, బోరింగ్ మరమ్మత్తులు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. మున్సిపల్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను పరిష్కరించాలని నిర్ణయించారు. మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, ప్రత్యేక అధికారి సాయి కుమార్, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయి ఉపాధి హామీ తనిఖీలు



ప్రజాపక్షం/భానాపూర్ : ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించిన సామాజిక తనిఖీ ప్రక్రియ మొదలైంది.పట్టణంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎస్ఆర్పీలు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనులు చేసిన వాటి వివరాలు తెలుసుకోవాలని డీఆర్పీ సభ్యులకు సూచించారు.భానాపూర్ మండలంలో 2024–25 లో జరిగిన పనులకు సంబంధించిన తనిఖీలు మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో ఈజీఎస్ పనులకు గాను.రూ.10,32,26,847 పంచాయతీరాజ్ ద్వారా జరిగిన పనులకు రూ.5,67,33,920,అటవీ శాఖలో జరిగిన పనులకు రూ.46,29,410 పనులు జరిగాయని.ఈ పనులపై సామాజిక తనిఖీని ప్రారంభిస్తామని సోషల్ ఆడిట్ ఎస్ఆర్పీ మహేష్ తెలిపారు.ఈ పనులకు సంబంధించిన ఈ నెల 7వ తేదీ నుంచి 14 టీంలు 14 మంది డీఆర్పీల ద్వారా పనులు జరిగిన ప్రాంతాల్లోకి వెళ్లి క్షేత్రస్థాయిలో ఎలాంటి పనులు జరిగాయో తనిఖీ చేయడం జరుగుతుందన్నారు.అదే విధంగా నేరుగా లబ్ధిదారుల వద్దకు వెళ్లి వివరాలు సేకరించనున్నట్లు వెల్లడించారు.అనంతరం తనిఖీ వివరాలను ఆయా గ్రామాల్లో జరిగే గ్రామ సభలతో పాటు ఎంపీడీవో కార్యాలయంలో జరిగే ప్రజావేదికలో వెల్లడిస్తామని వివరించారు. రికార్డులు సేకరిస్తున్నామని వివరించారు.

## రక్షణతో కూడిన ఉత్పత్తే లక్ష్యం

జీఎం మునిగంటి శ్రీనివాస్

ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : సంస్థ అభివృద్ధికి సమిష్టి కృషితో రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యంగా ఉద్యోగులు ముందుకెళ్లాలని ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఏరియాలోని ఆర్కె 5 గనిలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ఉత్పత్తి, ఉత్పాదకతపై భూగర్భ గని ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు నెలలుగా వరుసగా నెల వారీ లక్ష్యంలో 100 శాతం ఉత్పత్తి సాధిస్తున్నప్పటికీ, వార్షిక లక్ష్యంలో 95 శాతం వద్ద ఉండడం కొంత వెనకబాటుకు గురిచేస్తుందన్నారు. మిగిలిన 20 రోజుల్లో ప్రతిరోజు ఎక్కువ రక్షణతో కూడిన ఉత్పత్తికి అందరూ కృషి చేయాలని కోరారు. ఎత్తు తక్కువ సీమ్ లలో 95 శాతం ఉత్పత్తి సాధించడం కూడా నూరు శాతానికి మించి విజయం సాధించినట్లేనని పేర్కొన్నారు. ఏరియా గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ బాజీ సైదా, గ్రూప్ ఏజెంట్ ఎస్ శ్రీధర్, మేనేజర్ సుధీర్ కుమార్ ఝా, గ్రూప్ ఇంజనీర్ భట్టాచార్య, రక్షణ అధికారి శివయ్య, సంక్షేమ అధికారి హరికృష్ణ, అసిస్టెంట్ మేనేజర్లు రాంచార్, వినయ్ రెడ్డి, గని పిట్ సెక్రటరీ నర్సింగరావు, అండర్ మేనేజర్, మైనింగ్ స్టాఫ్, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

## సారంగాపూర్‌లో మెగా ఆరోగ్య శిబిరం

ప్రజాపక్షం/సారంగాపూర్ : సారంగాపూర్ మండల ప్రాథమిక ఆరోగ్య శిబిరం నిర్వహించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం 99 రోజుల క్యాంపెయిన్ లో భాగంగా శుక్రవారం సారంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ కూనేరు భూమన్న ప్రారంభించారు.ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆకోష్ రెడ్డి,ఎంపీడీఓ లక్ష్మీకాంత్ రావు,ఆరు ప్రత్యేక విభాగాల స్పెషలిస్టు వైద్యులు డాక్టర్ నిహారిక, డాక్టర్ స్వామి,డాక్టర్ రవినా,డాక్టర్ అభిలాష్,డాక్టర్ అరవింద్,డాక్టర్ శశి ప్రీతం లు హాజరయ్యారు.గర్భిణీలకు చిన్నపిల్లలకు,కంటి జబ్బులు,ఎముకల వ్యాధులు,పంటి వ్యాధులు,జనరల్ ఫిజీషియన్ విభాగాలకు సంబంధించిన సుమారు 300 మందికి పైగా రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు అందజేశారు.అనంతరం స్థానిక గ్రామపంచాయతీలో బోదకాలు వ్యాధితో బాధపడుతున్న 20 మందికి ప్రత్యేక చికిత్స విధానంపై శిక్షణ అందించారు.వారికి కూడా ఉచితంగా మందులతో పాటు ప్రత్యేక చికిత్సకు అవసరమైన కిట్లను అందించారు.శ్రీనివాస్,ప్రేమ్ సింగ్,ఉషారాణి,లెప్రసీ విభాగం అధికారులు రాజేశ్వర్ గంగన్న కిషన్ రావు ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రగతి ప్రణాళికలో ఉమ్మడి జిల్లాను నిలుపుదాం

జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనసూయ సీతక్క, పాల్గొన్న ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యే భూపతిరెడ్డి





ప్రజాపక్షం/నిజామాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలులో నిజామాబాద్, కామారెడ్డిలతో ఉమ్మడి జిల్లాను ముందంజలో నిలపాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి,పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసురిఅనసూయ సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలుపై నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా విచ్చేసి ఉమ్మి జిల్లా అధికారులకు దిశానిర్ధేశం చేయగా, ప్రభుత్వ సలహాదారులు పి.సుదర్శన్‌రెడ్డి, మహ్మద్ షబ్బీర్ అలీ, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ఇలా త్రిపాఠి, ఆశిష్ సంగ్వాన్‌లు ప్రగతి ప్రణాళిక అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై ఆయా శాఖలు, అంశాల వారిగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క మాట్లాడుతూ పల్లెలు, పట్టణాల సమగ్రాభివృద్ధి కోసం ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు వీలుగా ప్రభుత్వం ఆయా శాఖల వారిగా పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ ఆఫీసుల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స ఆరోగ్యం, అరైవ్, అలైవ్, సంక్షేమం, పిల్లల భద్రత, డ్రగ్స్‌కు అడ్డుకట్ట, రైతు సంక్షేమం, వ్యవసాయం, విద్య, యువత, క్రీడలు, మహిళలు పర్యావరణం అంశాలలో నిర్ధేశిత లక్ష్యం మేరకు ప్రభుత్వం అభిమతానికి అనుగుణంగా విజయవంతమయ్యేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా ఉద్యోగులు ప్రగతి ప్రణాళిక అమలులో క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేస్తూ ప్రజలకు జవాబుదారీగా పారదర్శకతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విస్తృతం గా పర్యటించాలన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రం గాలతో కూడిన అంశాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. సమావేశంలో నగర మేయర్ కె ఉమారాణి, నుడా చైర్మన్ కేశ వేణు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, సిపి సాయిచైతన్య, కామారెడ్డి ఎస్పీ రాజేష్‌చంద్ర, అదనపు కలెక్టర్లు కిరణ్‌కుమార్, దిలీప్‌కుమార్, బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి, డీఎఫ్ఓ లు వికాస్ మీనా, నిఖిత, ఏసిపి చైతన్య రెడ్డి, ఉమ్మడి జి ల్లాకు చెందిన అన్ని శాఖల అధికారులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు పాల్గొన్నారు. దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ముగ్గురు దివ్యాంగులకు మంత్రి సీతక్క చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌లు అందజేవారు.

### 'మినీ సరస్‌ఫెయిర్' ప్రారంభించిన సీతక్క

జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ప్, నాబార్డుల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ సరస్‌ఫెయిర్ 2026 ను ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠిలతో కలిసి జిల్లా ఇన్‌చార్జిమంత్రి ధనసురి అనసూయ సీతక్క లాంఛనంగా ప్రారంభించారు.సహాయక సంఘాల ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన ప్రదర్శన, విక్రయ, స్టాళ్లను తిలకించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజిరెడ్డి, డీఆర్‌డీఓ సాయగౌడ్ పాల్గొన్నారు. అంతకుముందు వినాయక్‌నగర్‌లోని విజయ లక్ష్మి గార్డెన్స్‌లో నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా సాధికారతలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. జిల్లా పర్యటనకు విచ్చేసి ఇన్‌చార్జి మంత్రి అనసూయ సీతక్కకు ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇతర జిల్లా అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు.


## మహిళలకు అవకాశాలు ఇవ్వండి

మంత్రి ధనసరి సీతక్క

ప్రజాపక్షం / నిజామాబాధ్ అర్బన్ : మహిళలకు అవకాశాలు ఇవ్వడం ద్వారా సమాజ అభివృద్ధికి తోడ్పడతామని తెలంగాణ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసూరి సీతక్క అన్నారు. శుక్రవారం స్తానిక విజయలక్ష్మి గార్డెన్‌లో ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ సెక్యూరిటి కౌన్సిల్ ఆధ్వర్యంలో మహిళా సాధికారతకు యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వందేమాతర గీతాన్ని ఆలపించి సభను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా, జిల్లా ఇన్ చార్జి మంత్రి సీతక్క పాల్గొని మాట్లాడుతూ 1911లో కమ్యూనిస్టు నాయకురాలు జంక్షన్ అన్నగారి ఉన్న మహిళల అసమానత్వాన్ని నివారించుటకు పోరాటం చేశారు. దానిని పురస్కరించుకొని మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కొన్ని నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని, అందులో భాగంగా 2026 సంవత్సరానికి గాను గివ్ టు గైన్ అన్న నినాదాన్ని తీసుకోవడం జరిగిందన్నారు. మహిళలకు సమాన అవకాశాలను ఇచ్చినట్లయితే వారి నుండి సమాజ అభివృద్ధికి ఎంతో దోహదపడిన వారమవుతామన్నారు. ఈ సందర్భంగా కామారెడ్డి ఏసిపి చైతన్యరెడ్డి, కామారెడ్డి డిఎఫ్ఓ నిఖితలు యువతగా మహిళా సాధికారతకుకర్తవ్యాలను, బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నిజామాబాద్ మేయర్ కె. ఉమారాణి, నిజామాబాద్ సెక్యూరిటి కౌన్సిల్ కన్వీనర్ డిసిపి బసవారెడ్డి, కౌన్సిల్ ట్రెజరర్ కె. సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి కవితారెడ్డి, సభ్యులు కాకతీయ కాలేజ్ రజినికాంత్, నుడా ఛైర్మన్ కేశ వేణు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రజాపక్షం/నిర్మల్ : ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి (జిల్లా ఇన్ చార్జి మంత్రి)జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు.శుక్రవారం మంత్రి జూపల్లి,ఆదిలాబాద్ కలెక్టరేట్ నుంచి,ఎంపీ గోడం నగేష్,పలువురు ఎమ్మెల్యేలతో కలిసిఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లతో వీడియా కాన్ఫరెన్స్ ద్వారా ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న పలు అభివృద్ధి,సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలందరికీ క్షేత్రస్థాయిలో మెరుగ్గా అందాలన్న ఉద్దేశ్యంతో 'ప్రజా పాలనప్రగతి ప్రణాళిక' కార్యక్రమన్న చేపట్టిందని అన్నారు. భాగంగా 99 రోజులపాటు,అన్ని శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక పరిశుధ్య పనులు చేపట్టాలని వివరించారు. అన్ని వర్గాల ప్రజలు,ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ ఆనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి,జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులతో మాట్లాడుతూ,జిల్లాల్లో ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. భాగంగా వివిధ శాఖలకు కేటాయించిన పనులన్నీ ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని అన్నారు.గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు,పెండింగ్ ఫైల్స్ పరిష్కారం,వైద్యారోగ్య కార్యక్రమాలు,మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన,అరైవ్ అలైవ్ కార్యక్రమం,తదితర కార్యక్రమాలన్నీ ప్రణాళికాబద్దంగా చేపట్టాలని అన్నారు. అధికారులు,ప్రజలు,ప్రజాప్రతినిధులు సంయుక్త భాగస్వామ్యంతో 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు .ఈ కార్యక్రమాల నిర్వహణను స్వయంగా పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు.సంబంధిత శాఖల అధికారులు అందరూ తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమలలో పాల్గొనాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌లు వెంకటేశ్వర్లు,కిషోర్ కుమార్,ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్,నిర్మల్ మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి,బైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి,నిర్మల్,బైంసాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు సోమ భీమ్‌రెడ్డి,షిండే ఆనంద్ రావు పటేల్,వివిధ శాఖల జిల్లా అధికారులు,ఇతర అధికారులు,సిబ్బంది, పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి

కమిషనర్ వెంకట గోపాల్



ప్రజాపక్షం/గజ్వేల్: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం కాగా, గజ్వేల్ పట్టణ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దామని మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, కమిషనర్ వెంకట గోపాల్, మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మాబాయి స్పష్టం చేశారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో ర్యాలీ నిర్వహించగా, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి హా జరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చే యాలని తెలిపారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి అమలు చేస్తున్నట్లు చెప్పారు. మం డల పరిషత్ కార్యాలయాన్ని వయో వృద్ధుల పెన్షన్ల కొరకు, యువత రీడింగ్ కోసం ఈ భవనాన్ని అందుబాటులోకి తేవాలని ఆ ప్రాంత వాసులు సూచించారు. శిథిలావస్థకు చేరిన సమీప ప్రాంతాన్ని తొలగించాలని కోరారు. సమీప ప్రజల ఇబ్బందితో ముడిపడి ఉన్నందున పరిశీలిస్తామని హామీ ఇచ్చిన వారు పట్టణ అభివృద్ధికి సలహాలు ఇవ్వాలని అన్నారు. ము ఖ్యంగా పట్టణ ప్రజల సంపూర్ణ ఆరోగ్యాన్ని దృ ష్టిలో పెట్టుకొని వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యం, విద్య, ప్రజా సంక్షేమం, తాగునీరు, విద్యుత్ తదితర అంశాలపై దృష్టి సారించి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కౌన్సిలర్లు నాయిని సత్యలక్ష్మి, కప్ప మమత, గోలి మమత గుప్త, కాముని ము రళి, మన్నే రూప, బొగ్గుల స్వప్న, విష్ణువర్ధన్ రె డ్డి, గుగ్లోత్ రమేష్, ఉపేందర్ రెడ్డి, బాపు రాజు, నరసింహారెడ్డి, మార్కంటి భాగ్యలక్ష్మి, గుంటుకు లక్ష్మి, నక్క సంతోషిని, మామిడి శ్రీధర్, అత్తెల్లి శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు.

## ఉపాధ్యాయునిపై దాడి హేయమైన చర్య



ప్రజాపక్షం/నిజామాబాద్: ధర్పల్లి మండలంలోని హోన్నాజీపేట్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై దాడి చేయడం హేయమైన చర్య అని పీఆర్‌టీయు మండల అధ్యక్షులు వెంకట రాజిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల టీచర్లపై అనేక చోట్ల భౌతికదాడులు జరుగుతున్నాయని అలాంటి సంఘటన జరగకుండా ప్రభుత్వం ఉపాధ్యాయులకు భద్రత రక్షణ కల్పించాలన్నారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షులు అంకం నరేష్ మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పైని కలిసి బాధిత ఉపాధ్యాయుడికి న్యాయం చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో మండల అసోసియేట్ అధ్యక్షులు సత్యనారాయణ, లింగారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రవిరాజ్, ఉపాధ్యాయులు నరేందర్, గంగాధర్, గోవింద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


## వయోవృద్ధుల సంక్షేమానికి డే కేర్ సెంటర్

ఎమ్మెల్యే రోహిత్ రావు, ఎంపి రఘునందన్ రావు

ప్రజాపక్షం/మెదక్ : మెదక్ జిల్లా మహిళా శిశు దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి హేమ భార్గవి ఆధ్వర్యంలో వయోవృద్ధుల సంక్షేమం కోసం డే కేర్ కేంద్రాన్ని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, మెదక్ ఎంపీ రఘునందన్ రావులు ప్రారంభించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తను సొంత నిధులతో బ్యాటరీ వెహికల్ ను అందిస్తామన్నారు. ఈ డే కేర్ సెంటర్ ద్వారా మెదక్ జిల్లాలోని వయోవృద్ధులు వారి యొక్క కాలక్షేపం కొరకు ఆట సామగ్రి, వార్తా పత్రికలు, పుస్తకాలు, తినడానికి వంట సామగ్రి కూడా అందుబాటులో ఉంటుందని అన్నారు. వయోవృద్ధులకు అధికారులందరూ పని చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ రాధిక, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, కౌన్సిలర్లు, శ్రీధర్, డిసబుల్ సెక్షన్ అధికారి రవీందర్, వయోవృద్ధులు పాల్గొన్నారు.



# కంచరోని చెరువు ఆక్రమణలపై కలెక్టర్ ఉక్కుపాదం




ప్రజాపక్షం/నిర్మల్ : నిర్మల్ పట్టణంలోని చారిత్రక కంచరోని చెరువు(కంచరోడి కట్ట) భూముల పరిరక్షణ విషయంలో జిల్లా యంత్రాంగం కఠిన వైఖరిని ప్రదర్శించింది.ఈ చెరువు శిఖం భూములు,కబ్జాకు గురవుతున్నాయంటూ 'ప్రజా పక్షం'దినపత్రికలో ప్రచురితమైన వరుస కథనాలకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తక్షణమే స్పందించారు.పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించి,ప్లాట్లుగా మార్చేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై కలెక్టర్ సీరియస్ అయ్యారు.ఆమె ఆదేశాల మేరకు రెవెన్యూ,ఇరిగేషన్ శాఖ అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఆక్రమణలను అడ్డుకున్నారు.నిర్మల్ పట్టణ మండల పరిధిలోని ఈ చెరువు శిఖం భూములను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆక్రమించి,అక్కడ భారీగా మొరం(మట్టి)పోసి ప్లాట్లుగా విక్రయించేందుకు సిద్ధపడ్డారు.ఈ వ్యవహారంపై 'ప్రజాపక్షం' పత్రికలో వచ్చిన వార్తతో యంత్రాంగం ఒక్కసారిగా అప్రమత్తమైంది.జేసీబీలతో రంగంలోకి దిగిన అధికారులు,ఆక్రమణదారులు వేసిన మొరం కుప్పలను పూర్తిగా తొలగించి చెరువు భూమిని పూర్వస్థితికి తీసుకొచ్చారు.కేవలం ఆక్రమణలను తొలగించడమే కాకుండా,భవిష్యత్తులో ఇలాంటి కబ్జాలు పునరావృతం కాకుండా చెరువు సరిహద్దులను శాస్త్రీయ పద్ధతిలో గుర్తిస్తూ,పక్కాగా హద్దులు నిర్ణయించే ప్రక్రియను అధికారులు చేపట్టారు. ప్రభుత్వ భూములను లేదా కట్టలను ఆక్రమించే వారు ఎంతటి వారైనా సరే వదిలిపెట్టే ప్రసక్తి లేదని వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు .ప్రజా ప్రయోజానాల దృష్ట్యా ప్రతికలో వచ్చిన వార్తకు జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని,పనులు చకచకా పూర్తి చేయించడం పట్ల స్థానిక ప్రజలు,పర్యావరణ ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.చెరువుల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం చూపుతున్న ఈ చొరవ కబ్జాదారుల గుండెల్లో వణుకు పుట్టిస్తోంది.




# ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు


మంత్రి డాక్టర్ గడ్డం వివేక్

ప్రజాపక్షం/మెదక్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో జిల్లా అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు ప్రజలు సమిష్టి గా కృషి చేయాలని, అధికారులంతా ప్రజలతో మమేకం కావాలని, సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యక్రమాన్ని తీసుకొచ్చారని జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా అధికారులు బాధ్యత తీసుకుని ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు రఘునందన్ రావు, సురేష్ షెట్కార్, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, సంగారెడ్డి కలెక్టర్ ప్రవీణ్య, సిద్దిపేట కలెక్టర్ హైమావతి, జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, మెదక్ మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక, వైస్ చైర్మన్ నరేష గౌడ్, ఉమ్మడి జిల్లాల అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు హాజరయ్యారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో 6 గ్యారంటీలు ప్రజలకు పూర్తిగా అందేలా చూడాలని, నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్దిదారులచే గృహప్రవేశాలు చేయించాలని అన్నారు. రవాణా శాఖ డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చేటప్పుడు రోడ్డు భద్రత నియమాలపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. వివిధ నిర్మాణాలు, రహదారులు, పరిశ్రమలలో కాలుష్యాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని, ప్లాస్టిక్ వ్యర్థాల నుండి డీజిల్ ను తీసేందుకు ముందుకు వచ్చిన స్వచ్ఛంద సంస్థకు సిద్దిపేట పట్టణంలో అర ఎకరం స్థలం కేటాయించాలని, నార్మట్టలో నిర్మించిన ఆయిల్ ఫెడ్ సూచించారు. జిల్లాలో 2 నియోజకవర్గాలకు నోడల్ అధికారులను నియమించడం జరిగిందని అన్నారు. సిద్దిపేట కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ అధికారులతో పాటు ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారిస్తామన్నారు. అనంతరం మంత్రి పోలీసుల చే గౌరవ వందనం స్వీకరించారు.



## అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాపక్షం/బైంసా : బైంసా లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో ఈ రోజు ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులు విద్యార్థులకు అగ్ని ప్రమాదాల వల్ల జరిగే నష్టాలు అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఎలా జాగ్రత్తలు తీసుకోవాలి,అగ్నిని ఎలా నియంత్రించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు.ఫైర్ సేఫ్టీ పరికారాల వినియోగాన్ని ప్రదర్శిస్తూ,అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో విద్యార్థులకు వివరించారు.పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థులు పాల్గొన్నారు.



## హెచ్‌పివి టీకా తీసుకుని గర్భాశయ క్యాన్సర్ నుండి పిల్లలను రక్షించుకోవాలి



**ప్రజాపక్షం/సిద్దిపేట:** హెచ్‌పివి టీకా తీసుకొని ..గర్భాశయ క్యాన్సర్ నుండి మీ బిడ్డలను రక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ హైమావతి పిలుపునిచ్చారు. శుక్రవారం హెచ్‌విపి వ్యాక్సివేషన్ సంబంధించి అవగాహన పోస్టర్‌ను డిఎంహెచ్‌ఓ ధనరాజ్‌తో కలసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ఈనెల మార్చి 8 నుండి జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని హెచ్‌పివి టికాను 14 ఏండ్ల లోపు బాలికలకు ఉచితంగా కొన్ని ప్రత్యేక ఆసుపత్రుల్లో ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. హెచ్‌పివి టికా జిల్లాలోని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి. జిజిహెచ్ సిద్దిపేట. ఏరియా ఆసుపత్రి దుబ్బాక., సిహెచ్‌సి నంగునూరు, చేర్యాల. సిహెచ్‌సి హుస్నాబాద్‌లో 14ఏండ్ల బాలికలకు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. దీంతో బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నుండి రక్షణ పొందవచ్చునన్నారు. రుతుస్రవం అవుతున్నప్పటికి తీసుకోవచ్చునన్నారు. టీకా తీసుకోవటం వల్ల ఏలాంటి దుష్ప్రభావాలు కలుగవన్నారు. ఈ టీకా సురక్షితమని ఈ అవకాశాన్ని 14 ఏం డ్ల బాలికలకు తల్లిదండ్రులు గమనించి ఆయా టికా కేంద్రాల్లో మార్చి 31 వరకు తీసుకునేవిధంగా సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో డిఎంహెచ్‌ఓ ధనరాజ్. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ దీప్తి. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్‌గా మైలారపు లింబాద్రి బాధ్యతల స్వీకారం



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలో మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్‌గా మైలారపు లింబాద్రి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు పాల్గొని లింబాద్రి గారికి శుభాకాంక్షలు తెలిపారు. మెట్‌పల్లి పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది అభివృద్ధి పథంలో నడిపించాలని నూతన పాలకవర్గానికి సూచించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, కౌన్సిలర్లు మాసుల ప్రవీణ్, అజీమ్, అజయ్, పందిరి రమేష్, మెట్‌పల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు,ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు. అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై మైలారపు లింబాద్రి గారికి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలో శుభ్రత, పరిశుభ్రత, సీసీ రోడ్లు, తాగునీటి సదుపాయం, హిందూ స్మశానవాటిక అభివృద్ధి, మురుగు కాలువల నిర్మాణం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు.

## ప్రతీ విద్యార్థికీ విద్యా ప్రమాణాలు అందించాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కనీస విద్యా ప్రమాణాలు ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే ప్రతి విద్యార్థికి అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో విద్యా శాఖ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లోని ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందాలనే ఉద్దేశంతో జిల్లాలో ఉపాధ్యాయులు చేపట్టిన చర్యల వల్ల మంచి పురోగతి సాధించామని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తి కొనసాగిస్తూ మరిన్ని మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల తనిఖీ నిమిత్తం విద్యా శాఖ ఉన్నతాధికారులు వీక్లీ ప్లాన్ ప్రకారం ప్రతి మండలంలో నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం పాఠశాలల తనిఖీలను ప్రతి అధికారి కనీసం 80 శాతం పూర్తి చేయాలని అన్నారు. ప్రతి పాఠశాల తనిఖీ నాణ్యతతో ఉండాలని, చెక్ లిస్ట్ ప్రకారం ప్రతి అంశాన్ని పరిశీలించి పాఠశాల పర్యటన సంబంధించి రిపోర్టు తయారు చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు ఉండే విధంగా కృషి చేయాలని, పిల్లలు ప్రస్తుత విద్యా ప్రమాణాల స్థితిగతులను సరిగ్గా నమోదు చేయాలని అన్నారు. విద్యా ప్రమాణాలు సరిగ్గా లేకున్నా అంతా బాగుందని చూపేట్టేందుకు తప్పుడు వివరాలు ఇవ్వవద్దని అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 7వ తరగతి చదివే విద్యార్థులకు బేసిక్స్ దృఢంగా ఉండాలే ప్రతిరోజు గంట సమయం స్పెషల్ క్లాస్ ఏర్పాటు చేయాలని అన్నారు. 8వ తరగతి, 9వ తరగతి విద్యార్థులపై సైతం శ్రద్ధ వహిస్తూ వారికి విషయ పరిజ్ఞానం సరిగ్గా అందేలా చూడాలని అన్నారు. పాఠశాలలో పాత సామాన్లు, స్టోరేజ్ వస్తువులను పూర్తి స్థాయిలో తొలగించాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శారద, అకాడమిక్ మానిటరింగ్ అధికారులు పిఎం. షేక్ మండల విద్యా ధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



**ప్రజాపక్షం/చొప్పదండి:** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ప్రభుత్వం మహిళా సంక్షేమానికి తగిన ప్రాధాన్యత కల్పిస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి స్వరూప శ్యాం ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి మహిళలకు ఉమెన్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని, మహిళలు పురుషులతో సమాన అవకాశాలు అందిపుచ్చుకుని మహిళలు అపూర్వ విజయాలు సాధిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

## మహిళ ఆత్మహత్య

**ప్రజాపక్షం/శంకరపట్నం:** శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామానికి చెందిన తణుకు స్వప్న ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు తణుకు స్వప్న (42) భర్త సురేష్‌కు శంకరపట్నం మండలంలో రైస్ మిల్స్ ఉన్నాయి. తమకు ఉన్న రైస్‌మిల్‌కు సంబంధించిన సిఎంఆర్ కింద 2021—22 సంవత్సరంలో తీసుకున్న వడ్లు తడిచిపోవడంతో తిరిగి సిఎంఆర్ ఇవ్వలేదు. అదే విధంగా రైస్‌మిల్స్ నిర్వహణ కోసం బ్యాంకులో తీసుకున్న అప్పులు చెల్లించలేకపోవడంతో మనస్తాపానికి గురై ఇంటిలో ఉరివేసుకుని మృతి చెందినట్లు మృతురాలి భర్త సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను సమష్టిగా సక్సెస్ చేద్దాం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాను అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుదాం

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/కరీంనగర్:** రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో 99 రోజులపాటు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వ యంత్రాంగము ప్రజా ప్రతినిధులు ప్రజలు, అందరం కలిసి విజయవంతం చేద్దామని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో ప్రగతి పథంలో తీసుకెళ్లి అగ్ర భాగాన నిలుపుతామని పేర్కొన్నారు. ఒకవైపు సంక్షేమాన్ని మరోవైపు అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం పరుగులు పెట్టిస్తుందని తెలిపారు. రెండున్నర సంవత్సర కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలందరికీ వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారని పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన కరీంనగర్ ఉమ్మడి జిల్లా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశానికి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పెద్దపెల్లి ఎంపీ ఉమ్మడి జిల్లా పరిధిలోని కలెక్టర్లు సిపి, ఎస్పీలు అడిషనల్ కలెక్టర్లు అన్ని శాఖల ఉన్నత అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఇరిగేషన్, ఆర్ అండ్ బి కి సంబంధించిన పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. 99 రోజులపాటు ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగా గ్రామాలు పట్టణాల్లో ప్రధాన సమస్యలన పరిష్కారం, రెండున్నర సంవత్సరాల ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలందరికీ అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో దేశంలోనే మహత్తరమైన అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. జిల్లా యంత్రాంగం ముందుండి 99 రోజుల పాటు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్లు ముందుండి నడిపించాలని ప్రజలు, ప్రజా ప్రతినిధులు అధికారులు స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. తద్వారా కరీంనగర్ జిల్లాను అగ్ర భాగాన నిలుపుదామని పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని రాజకీయాల కతీతంగా అందరూ కలిసి విజయవంతం చేయాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కరీంనగర్ జిల్లా ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం జిల్లా కలెక్టర్లు యంత్రాంగం ముందుండి విజయవంతం చేయడంలో కీలకంగా వ్యవహరించాలని సూచించారు. ఎక్కడ కూడా ఎటువంటి గ్యాప్స్ లేకుండా ఈ ప్రణాళిక ను సమర్థవంతంగా నిర్వహించేలా కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సత్వరమే స్పందించి ప్రాణాలు కాపాడిన వారికి ప్రభుత్వం రహవీర్ పేరిట తగిన ప్రోత్సాహం అందిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు: ఎమ్మెల్యే మేడిపల్లి



**ప్రజాపక్షం/గంగాధర:** చొప్పదండి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర మండలం కాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారు పెద్ది సత్తవ్వ మల్లేశం దంపతుల గృహ ప్రవేశం కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సంధర్భంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు సత్తవ్వ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో చొప్పదండి నియోజకవర్గంలో రెండేళ్లలోనే అర్హులైన లబ్దిదారులకు 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మందికి ఇందిరమ్మ ఇండ్లను అందజేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. చొప్పదండి నియోజకవర్గంలో నిరుపేదల సొంతింట కలను నిజం చేస్తామని పేర్కొన్నారు. గత బిఆర్‌ఎస్ పాలనలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేస్తామని, ఆందోళన చెందవద్దని కోరారు. కార్యక్రమంలో ఎంపిడివో దమ్మని రాము, సర్పంచ్ కోల మమత శ్రీనివాస్ తదితరులున్నారు.

## పాడి పశువుల ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/చొప్పదండి:** మండలంలోని గుమ్లాపూర్‌లో పాడిపశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణ శిబిరం శుక్రవారం నిర్వహించారు. జిల్లా పశువైద్య, పశుసంవర్ధకశాఖ అధికారి డా.లింగారెడ్డి హాజరై గ్రామ సర్పంచ్ లింగాల ఆనంద్‌తో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. పాడి సంపదను పెంచడంతో పాటు రైతులకు మేలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రమణారెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహణ అధికారి డా.శ్రీదేవి, మండల పశువైద్యాధికారి డా.శశికాంత్, వైద్యులు రాజిరెడ్డి, సాయిచైతన్య, ట్రైనీ డాక్టర్స్, సిబ్బంది, వార్డు సభ్యులు, పాలకేంద్రం అధ్యక్ష కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై చర్యలేవీ?

ఇందిరమ్మ అక్రమ పట్టాలు సృష్టించి విక్రయిస్తున్న దళారులు

జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన సిపిఐ నాయకులు



**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల మున్సిపాల్ పరిధిలో డబుల్ బెడ్ రూం అర్బన్ కాలనీలో 4520 గృహాల సముదాయంల వద్ద ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, ఇందిరమ్మ ఇండ్ల అక్రమ పాట్టాలు సృష్టించి విక్రయిస్తున్న దళారుల పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కు భారత కమ్యూనిస్టు పార్టీ జగిత్యాల జిల్లా సమితి తరుపున శుక్రవారం పిర్యాదు చేశారు.ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు వెన్న సురేష్ మాట్లాడుతూ జగిత్యాల మున్సిపాల్ పరిధిలో డబుల్ బెడ్ రూం అర్బన్ కాలనీలో 4520 గృహాలలోప్రజలు నివసిస్తున్న, నివసించబోయే కుటుంబాల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గతంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారముగా 4520 కుటుంబాలకు మౌలిక సదుపాయాల కోసం అంగన్వాడి స్కూల్స్, ప్రైమరి పాఠశాల, హైస్కూల్, కాలేజ్, 50 పడకల అసుపత్రి, మార్కెట్, దుకాణాల సముదాయం, ఉద్యనవనం, పోలీస్ స్టేషన్, మున్సిపల్ కార్యాలయం, మతచారాలకు సంబంధించిన దార్మిక స్థలాలు గుళ్లు, మసీదు, చెర్చ్ శ్మశాన వాటికలు మోదలైన వాటి కోసం భూమి కేటాయించడం జరిగినది వెన్న సురేష్ తెలిపారు. కొంత మంది రియాల్టర్స్ ఖాళి స్థలంలో బేసిమెంట్ నిర్మాంచి దొంగ ఇందిరమ్మ పాట్టాలు సృష్టించి విక్రయిస్తుండగా మరి కొంత మంది ఇందిరమ్మ పట్టా బేసిమెంట్ పూర్తి కాని ఇండ్లను చూపిస్తు విక్రయిస్తున్నారు. కొంత మంది ఇందిరమ్మ పట్టాలు రద్దు అయి 2బి హెచ్.కెలో ఇంటి పట్టా తీసుకున్న వాళ్లు పాత ఇందిరమ్మ పట్టాతో మౌలిక సదుపాయలకు కేటాయించిన ప్రభుత్వ భూమిలో ఇల్లు నిర్మిస్తున్నారు. అలా నిర్మిస్తున్న నిర్మించిన వాటిని తొలగించి, 4520 కుటుంబాల మౌలిక సదుపాయాల కొసం ఉపయోగపడవలసిన భూమిని ఇలా వివిధ రకాలుగా వివిధ పేర్లతో ఖబ్జా చేసి సొమ్ము చేసుకుంటున్న వ్యక్తులను గుర్తించి వారిని చట్టపరంగా శిక్షించాలని భారత కమ్యూనిస్టు పార్టీ జగిత్యాల జిల్లా కార్యవర్గ సభ్యులు వెన్న సురేష్ జగిత్యాల మున్సిపల్ కమిషనర్ ను కోరుతున్నారు.

## రోడ్డు ఆక్రమణలపై సమగ్ర విచారణ

సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు డిమాండ్



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నగరంలో కొందరు ప్రజాప్రతినిధులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రోడ్లను ప్రభుత్వ ఆస్తులను ఆక్రమణలకు గురిచేసారని వీరిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించి ప్రభుత్వం ఆస్తిని స్వాధీనం చేసుకోవాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పైడిపల్లి రాజు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా కరీంనగర్ నగరాన్ని ప్రజాప్రతినిధులే ప్రభుత్వ ఆస్తులను కబ్జాలు చేస్తూ జైలుకు పోయారని అయినా వీరి వక్రబుద్ధి మారడం లేదని ప్రభుత్వ ఆస్తులను, రోడ్లను కబ్జా చేస్తూ ప్రజాదనాన్ని కొల్లగొట్టుతున్న పట్టించుకునే అధికారులు జిల్లాలో లేకపోవడం సిగ్గుచేటన్నారు. నూతనంగా ఎన్నికైన మేయర్ కు చిత్తశుద్ధి ఉంటే వెంటనే కబ్జాలకు గురైన స్థలాలను కాపాడాలని రామచంద్రాపూర్ కాలనీ భగత్ నగర్ లో రోడ్లను మూసేసి భవనాలు నిర్మించారంటే ఎంత స్థాయిలో కబ్జాలు జరుగుతున్నాయో అర్థం చేసుకోవాలని కబ్జాల వైపు మున్సిపల్ అధికారులు కన్నెత్తి చూడకపోవడం చూస్తుంటే వారి అవినీతి ఎంత ఉందో అర్థం చేసుకోవాలన్నారు. గతంలో ఒక లెక్క ఇప్పుడు ఒక లెక్క అని ఊక దంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన బండి సంజయ్ కి కబ్జాలు కనబడడం లేదా అని ప్రశ్నించారు. ఆక్రమణలకు అవినీతి పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని చెప్పిన బండి సంజయ్ రామచంద్రాపూర్ కాలనీ, భగత్ నగర్ లో తమ పార్టీ ప్రజా ప్రతినిధులు చేసిన కబ్జాపై మాట్లాడాలన్నారు. నగర పాలక సంస్థ పరిధిలో ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లు వేసి అమ్మిన చరిత్ర ఉందని, చెరువులు, కుంటలను, పరం పోగు భూములను మాయం చేసిన ప్రజాప్రతినిధులు ఉన్నారని రానున్న కాలంలో వీటన్నింటిని బహిర్గతం చేసి ప్రజా ఆందోళన చేపడుతామని పైడిపల్లి రాజు హెచ్చరించారు.

## అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/జగిత్యాల:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని శుక్రవారం జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి ప్రారంభించారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను విజయవంతంగా అమలు చేయాలని ప్రతిజ్ఞ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ముఖ్యంగా పట్టణ పరిశుభ్రత అంశంపై చర్చించారు. పట్టణంలో పరిశుభ్రతను మెరుగుపరచి, ప్రజలకు శుభ్రమైన వాతావరణాన్ని అందించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని వారు సూచించారు. అనంతరం అధికారులు వార్డుల్లో తిరిగి డ్రైనేజీ వ్యవస్థ, నల్లా నీటి సరఫరా పరిస్థితులను పరిశీలించారు. అలాగే వార్డుల్లో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను కూడా పరిశీలించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని చేపట్టిన ప్రజా పాలన—ప్రగతి ప్రణాళికలో భాగంగా రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పట్టణాల్లో పారిశుధ్యం, తాగునీరు, డ్రైనేజీ, గృహ నిర్మాణం వంటి ముఖ్యమైన సమస్యలను ప్రాధాన్యతగా పరిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ప్రజలు కూడా అధికారులతో కలిసి పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. .జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రజా పాలన—ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, కౌన్సిలర్లులు, మున్సిపల్ కమిషనర్ స్పందన, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల హెల్త్ ప్రొఫైల్ తయారీకి కార్యాచరణ: ఎమ్మెల్యే,కలెక్టర్



**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్ :** జిల్లాలోని స్వశక్తి మహిళా సంఘాలో ఉన్న మహిళలందరికీ హెల్త్ ప్రొఫైల్ తయారు చేసే దిశగా కార్యాచరణ అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో 99 రోజుల కార్యక్రమం అమలు పై నిర్వహించిన సన్నాహక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణ లో భాగంగా జిల్లాలో ఇందిర మహిళా శక్తి క్రింద ఉన్న లక్షా 20 వేల మహిళల హెల్త్ చెకప్ చేస్తూ వారికి డిజిటల్ హెల్త్ కార్డులు అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని అన్నారు. మార్చి 6 నుంచి మార్చి 15 వరకు గ్రామం లో పారిశుధ్యం నిర్వహణ ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని, ప్రభుత్వ కార్యాలయాలు చాలా రోజులుగా పెండింగ్ ఉన్న ఫైల్స్ చేసేందుకు కూడా చర్యలు చేపట్టామని అన్నారు. ప్రజలు భాగస్వామ్యం ఐతే 99 రోజుల కార్యక్రమం విజయవంతం అవుతుందని, మన కార్యక్రమంగా భావించి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ మన ఆరోగ్యం బాగుంటే ఎలాగైనా బ్రతుకవచ్చని అన్నారు. దేశ వ్యాప్తంగా కల్తీ ఆహరపు వాడకం వల్ల క్యాన్సర్ వ్యాప్తి పెరుగుతుందన్నారు. నూనె వాడకం తగ్గించాలని లేకపోతే గుండెలో హోల్ పడే అవకాశం కూడా ఉంటుందని అన్నారు. మన సమస్య తీవ్రం అయ్యే వరకు వేచి చూడవద్దని, మొదటి దశలో కేన్సర్ గుర్తిస్తే మెరుగైన చికిత్స వల్ల త్వరగా మనం ఆరోగ్యవంతులం కావచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవపూర్ సర్పంచ్ తాడి చెట్టు చామంతి శ్రీకాంత్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## సంక్షేమమే లక్ష్యంగా ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళిక అమలు

కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/చందుర్తి:** అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళిక అమలు చేస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళిక అమలులో భాగంగా మార్చి 6 వ తేదీ నుంచి జూన్ 12 వ తేదీ వరకు చేపట్టనున్న కార్యక్రమానికి చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శ్రీకారం చుట్టారు. చందుర్తిలోని ఆసుపత్రిలో శుక్రవారం జనరల్ మెడిసిన్, గైనకాలజిస్ట్, పిల్లల, కంటి, దంత, ఎముకల వైద్య నిపుణుల వైద్య సేవలను ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం చందుర్తిలోని కేజీబీవీ విద్యార్థులకు హెచ్ పీవీ వ్యాక్సిన్, పరీక్షల సమయంలో ఒత్తిడి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీపీఆర్ పై అవగాహన కల్పించి, ఎలా చేయాలో విద్యార్థులతో చేయించారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య, కంటి పరీక్షలు చేశారు. చందుర్తి మండల కేంద్రంలో పారిశుధ్య, ఇతర పనులపై ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు.. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, వాటి పై ప్రజలను చైతన్య పరచాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల ప్రజలకు ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళిక కింద ఆరు విభాగాల్లో స్పెషలిస్ట్ వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. ఈ సేవలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. విద్యాలయాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, విద్య అందుతుందని, వారికి ఇప్పటికే కాస్మోటిక్, డైట్ చార్జీలు ప్రభుత్వం పెంచిందని వెల్లడించారు. ఇప్పుడు విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయిస్తున్నామని తెలిపారు. చందుర్తి గ్రామంలో మొత్తం 67 మందికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని, 803 మందికి రూ. 500 లకే గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని, 135 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని, 363 మంది రైతులకు రుణ మాఫీ చేశామని, 980 మంది రైతులకు రైతు భరోసా అందించామని, గృహ జ్యోతి 845 మందికి ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని వెల్లడించారు. ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని విప్ పిలుపు నిచ్చారు.

## రాష్ట్రస్థాయి అర్చరీ పోటీలకు ఆల్ఫోర్స్ విద్యార్థులు ఎంపిక

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కరీంనగర్ కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాలలో విద్యార్థులు రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అర్చరీ క్రీడకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని, ఈ క్రీడ ద్వారా విద్యార్థులకు జ్ఞాపకశక్తితో పాటు ఏకాగ్రత అభివృద్ధి చెందుతుందన్నారు. అసోసియేషన్ వారు నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలలో పాఠశాలకు చెందిన డి.సుదీక్ష(9వ), కె.లిశిత అక్షయ(8వ), జి.శ్రీహరినాథ్(8వ), డి.శ్రీనిత్య (4వ) అత్యుత్తమ ప్రతిభను కనబరిచి త్వరలో నిర్వహించబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవ్వడం చాలా హర్షించదగ్గ విషయమని చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు పుష్పగుచ్చాలను అందజేసి రాష్ట్రస్థాయిలోని అసమాన ప్రతిభను కొనసాగించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాలని అభినందించారు.

‘ శర్వానంద్ తాజాగా నటిస్తున్న సినిమా బైకర్. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్నియువీ క్రియేషన్స్ నిర్మిస్తోంది. కుటుంబ భావోద్వేగాలతో కూడిన యాక్షన్ డ్రామాగా రూపొందిన ఈ సినిమా ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ’

రీల్

## శ్రీరామనవమికి వస్తున్న 'బ్యాండ్ మేళం'



కోర్ట్ చిత్రంతో మెప్పించిన హర్ష్ రోషన్, శ్రీదేవి జంట మళ్లీ 'బ్యాండ్ మేళం' సినిమాతో ఆడియెన్స్ ముం దుకు వస్తున్నారు. రచయిత కోన వెం కట్ నిర్మాణ సారథ్యంలో ఈ చిత్రం రూపు దిద్దుకుంది. మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కావ్య, శ్రావ్య ఈ మూవీని నిర్మించారు. సతీష్ జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాని మార్చి 26న రిలీజ్ చేయబో తున్నారు. 'బ్యాండ్ మేళం' టీజర్, ట్రైలర్, మాస్ పెప్పీ సాంగ్ 'తిప్పు కుంటున్నావ్', మంచి మెలోడీ సాంగ్ 'పల్లెలోని సందల్లన్ని మీవే' వంటివి ఆడి యెన్స్ సినిమా పట్ల అంచనాల్ని పెంచే సింది. యూత్ ఆడియెన్స్ ఇప్పటికే మంచి బజ్‌ను క్రియేట్ చేసుకున్న ఈ చిత్రం శ్రీరాముడి ఆశీస్సులతో శ్రీరామ నవమి సందర్భంగా రిలీజ్ కాబోతోంది. శివరాజు ప్రభావ్ ఈ చిత్రా నికి సహ నిర్మాతగా వ్యవహరించారు. శివ ముప్పరాజు ఎడిటింగ్, స్క్రీన్ ప్లే బా ధ్యతల్ని నిర్వర్తించారు. సతీష్ ము త్యాల సినిమాటోగ్రఫర్‌గా పని చేశారు. ఇక ఈ మూవీలో సాయికుమార్ కీలక పాత్రను పోషించారు. ఈ చిత్రానికి స మర్పణ : మ్యాంగో మాస్ మీడియా, సంగీతం: విజయ్ బుల్గానిన్, స్మైన్, ఎ డిటింగ్: శివ ముప్పరాజు, డీఓపీ: సతీ ష్ ముత్యాల, గీత రచయిత: చంద్రబో స్, ఆర్ట్ డైరెక్టర్: నార్ని శ్రీనివాస్.

## 15న 'నమో రే' పాట రిలీజ్

పాన్‌ఇండియన్ మూవీ నాగబంధం సిద్ధమవుతోంది. అభిషేక్ నామా దర్శకత్వంలో ఎన్ ఐ కె స్టూడి యోస్ బ్యానర్ కిషోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి నిర్మిం చిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ హీరోగా నటించారు. మా ర్చి 15న ఉదయం 11:11 గంటలకు నాగ బంధం ఫస్ట్ సింగిల్ 'నమో రే' పాట రిలీజ్ కానుంది. ఈ పాట నారా యణుడికి నివాళిగా ఆధ్యాత్మికత ప్రజెంట్ చేయబోతోంది. డి.భోరీ స్టాయిల్‌లో రూపొంది తున్న నమో రే సాంగ్ ప్రధాన ఆకర్షణగా నిలవబో తోంది. ఈ పాటలో ఏకంగా 1,000 మంది డ్యాన్సర్లు పాల్గొని , భారతీయ నృత్య కళల వైవిధ్యం, ఐక్యతను ప్రతిబింబించే అద్భుత మైన విజువల్ స్పెక్టాకిల్‌గా రూపొందించారు. ప్రముఖ కొరియోగ్రాఫర్‌లు గణేష్ ఆచార్య, శ్రష్టి వర్మ అద్భుతమై న కొరియోగ్రఫీ చేశారు. నమో రే పాటకు సంగీతాన్ని జునైద్ కుమార్ అభే జంట అందించగా, భక్తి భావం , ఆధ్యాత్మికతను ప్రతిబింబించేలా డ్రీమ్ మ్యూజికల్ కంపోజ్ చేశారు. గేయ రచయిత శ్రీహర్ష ఇమాని రాసిన సాహిత్యం పాట థీముకు అద్భుతంగా ప్రజెంట్ చేయబోతుంది. గాయకులు సింధుజా శ్రీనివాసన్, ఐశ్వర్య దారురి ఈ పాటకు తమ గాత్రంతో ప్రాణం పోశారు. సాంగ్ పోస్టర్‌లో నభా నటేష్, ఐశ్వర్య మీన న్‌లును సాంప్రదాయ వేషధారణలో అద్భు తంగా కనిపించడం పాటలోని గ్రాండి యరును ప్రజెంట్ చేస్తోంది. విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మీనన్, రిషబ్ సాహ్నీ, జగపతి బాబు, గరుడ రామ్, మహేష్ మంజ్రేకర్, జయప్రకా ష్, మురళీ శర్మ, అనసూ య భరద్వాజ్, బిఎస్ అవి నాష్ నటిస్తున్నారు.



## 'మృత్యుంజయ్'ని చూసి అందరూ ఎంజాయ్ చేశారు :శ్రీ విష్ణు



శ్రీ విష్ణు హీరోగా హుస్సేన్ షా కిరణ్ తెరకెక్కిం చిన చిత్ర ం 'మృత్యుంజయ్'. ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రి లర్‌ను లైట్ బాక్స్ మీడియా, పిక్చర్ పర్ఫెక్ట్ ఎ ంటర్టైన్మెంట్ బ్యాన ర్లపై సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మిం చారు. 'సామజవరగమన'తో బ్లాక్ బస్టర్ హిట్ పెయిర్గా నిలిచిన శ్రీ విష్ణు, రెబా మోనికా జాన్ ఈ చిత్రంతో మరోసారి అలరించనున్నారు. మార్చి 6న ఈ మూవీ విడుదలయ్యింది ఈ సందర్భంగా ప్రేక్షకులతో కలిసి సినిమా చూసిన టీమ్ అనంతరం మీడియాతో మాట్లా డారు. శ్రీ విష్ణు మాట్లాడుతూ థియేటర్‌లో రెస్పాన్స్ చూశాను. అందరూ చాలా ఎం జాయ్ చేశారు. రాజ మౌళి నుంచి మా సినిమా ప్రమోషన్ స్టార్ట్ అయింది. తారక్ ట్రైలర్ రిలీజ్ చేశారు. నాని మూవీని చూ సి మెచ్చుకున్నారు. కంటెంట్ మూవీస్ ఎప్పుడు వచ్చినా మీడియా, ఆడియెన్స్ ఎంక రేజ్ చేస్తూనే ఉంటారు. కంటెంట్ సినిమాకి అందరూ వచ్చి సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను అని అన్నారు.రెబా మోనికా జాన్ మాట్లాడుతూ మృత్యుంజయ్ సినిమాని సపోర్ట్ చేస్తున్న మీడియాకి థాంక్స్. మా సినిమా పట్ల మేం ఎంతో గర్వంగా ఉన్నాం. మా చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. మళ్లీ మళ్లీ ఈ టీంతో కలిసి పని చేయాలని కోరుకుంటు న్నాను' అని అన్నారు. హుస్సేన్ షా కిరణ్ మాట్లాడుతూ నాని 'మృత్యుంజయ్' మూవీని చూశారు. ఆయనకు నచ్చింది అని నాకు తెలిసిన తరువాత నాకెంతో ప్రశాంతంగా అనిపించింది. ఆయన రివ్యూ ఎప్పుడూ తప్పదు. నా ఈ ప్రయాణంలో సపోర్టర్‌గా నిలిచిన ఎన్టీఆర్‌కి థాంక్స్. శ్రీ విష్ణు ఈ చిత్రంలో రిపో పోర్టర్‌గా నటించారు. ఈ సినిమాలో ఆయ న నటన చాలా కొత్తగా ఉంటుంది. రెబా మోనికా పోలీస్ ఆఫీసర్‌గా అద్భుతంగా నటించారు. ఈ సినిమా అందరినీ ఆకట్టు కునేలా ఉంటుంది' అని అన్నారు.మనీషా ఎ. ద త్ మాట్లాడుతూ .. 'నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. శ్రీ విష్ణుతో ఇది నాకు రెండో సినిమా. ఈ మూ వీకి మేం, మా టీం చాలా కష్టపడి పని చేశాం. మా అన్నయ్య హుస్సేన్ షా వల్లే ఇండస్ట్రీలోకి వచ్చాను. రమ్య మా ట్లాడుతూ మృత్యుంజయ్' చాలా డిఫరెంట్‌గా, థ్రిల్లింగ్‌గా ఉం టుంది. ఈ సినిమా అంద రినీ ఆకట్టుకునేలా ఉంటుంది' అని అన్నారు. ని ర్మాత సందీప్ గుణ్ణం మాట్లాడుతూ మృత్యుంజయ్'ని సపోర్ట్ చేసిన సుకుమార్ గారు, రాజమౌళి గా రు, తారక్ గారు, నాని ఇలా అందరికీ థాంక్స్. ఈ మూవీ కోసం మా టీం నిద్రలేని రాత్రులు గడిపి ప ని చేసింది. ఈ చిత్రంలో శ్రీ విష్ణు చాలా కొత్తగా కనిపిస్తారు. ఈ సినిమా అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది' అని అన్నారు. ఈ ప్రె స్ మీట్‌లో సుదర్శన్, అయ్యప్ప శర్మ, నటుడు రచ్చ రవి పాల్గొన్నారు.

## సక్సెస్ ఇంత ఆనందాన్ని ఇస్తుందా? :ఉదయభాను



రాజీవ్ కనకాల, ఉదయభాను, వాసంతిక, శ్రీరామ్ వెంకట్ ప్రధాన పాత్రల్లో 'డాటర్ ఆఫ్ ప్రసాద్ రావు' వెబ్ సిరీస్‌కు జీ5 తెలుగు ని ర్మించింది. 'రెక్కీ', 'విరాటపాలెం' తరువాత సౌ త్ ఇండియా స్క్రీన్స్ బ్యానర్ మీద కె.వి. శ్రీరామ్ నిర్మించిన ఈ సిరీస్‌కి కృష్ణ పోలూరు దర్శకత్వం వహించారు. ఈ వెబ్ సిరీస్ ఫిబ్రవరి 27 నుంచి జీ5లో స్ట్రీమింగ్ అవుతోంది. వారం రోజుల్లోనే వంద మిలియన్ల స్ట్రీమింగ్ మినిట్స్ సాధించిన బ్లాక్ బస్టర్గా నిలిచింది. ఈ క్రమంలో హైదరా బాద్‌లో 'డాటర్ ఆఫ్ ప్రసాద్ రావు' టీం సక్సెస్ మీట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమం లో రాజీవ్ కనకాల మాట్లాడుతూ డాటర్ ఆఫ్ ప్రసాద్ రావు' సిరీస్‌లో ప్రతీ ఒక్కరూ అద్భుత ంగా నటించారు. వంద మిలియన్ల స్ట్రీమింగ్ మి నిట్స్ సాధించడం అంటే మామూలు విషయం కాదు. అందరి ఎఫర్ట్స్‌తోనే ఇదంతా సాధ్యమైం ది. 'రెక్కీ', 'విరాటపాలెం' టైంలో శ్రీరాముకు నే ను ఎందుకు గుర్తు రాలేదో నాకు తెలీదు. కానీ ఈ ప్రసాద్ రావు పాత్రను ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. ముందు నుంచీ శ్రీరామ్ ఈ సిరీస్ విజయం పట్ల నమ్మకంగా ఉండే వా రు. రెబెకా పాత్రలో ఉదయ భాను ఎలా ఉం టారో అని అను కున్నాను. కానీ ఆమె ఎంతో డైన మిక్‌గా, పవర్ ఫుల్‌గా అనిపించారు. సిరీస్ చూసిన వారంతా కూడా కృష్ణ గారు రాసిన కథ, తీసిన విధానం గురించి చాలా గొప్పగా చెబుతు న్నారు. . ఈ సిరీస్‌కు అందరూ వందకు వంద శాతం ఎఫెర్ట్ పెట్టారు. మా సిరీస్ గురిం చి, మా నటన గురించి వందల, వేల మెసెజ్‌లు వస్తు న్నాయి. మాకు ఈ ప్రయాణంలో సపోర్ట్ గా నిలి చిన జీ5 టీంకు థాంక్స్. ఇంత మంచి పాత్రను ఇచ్చిన శ్రీరాముకు రుణ పడిపోయా ను. దర్శ కుడు కృష్ణ సిరీస్‌కు అద్భుతంగా హ్యాండిల్ చేశారు. రెబెకా పోలీస్ ఆఫీసర్ పాత్ర అందరికీ కనెక్ట్ అయింది. సీక్వెల్ కోసం నేను కూడా ఎదు రుచూస్తున్నాను. రాజీవ్ కనకాల సత్తాకు తగ్గ పాత్ర ఇన్ని రోజులకు వచ్చిందని నాకు అనిపి స్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత శ్రీరామ్ వెంకట్, దర్శకుడు కృష్ణ పోలూరు, జీ5 తెలుగు సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జయంత్ రాఘవన్. వాసంతిక తదితరులు పాల్గొన్నారు.

## సృష్టి ధర్మం తప్పినప్పుడు వచ్చేవాడే 'వృషకర్మ'

నాగ చైతన్య హీరోగా 'విరూపాక్ష' ఫేం కార్తీక్ దండుతో కలిసి చేస్తున్న మిథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ. ఈ చిత్రాన్ని ఎస్‌వి, సిసి సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బాపినీడు స మర్పిస్తున్నారు. తాజాగా ప్రసాద్ ఐమాక్స్‌లో ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను లాంచ్ చేశారు. గ్లింప్స్ ఒక భయానకమైన సన్నివేశంతో ప్రారంభమైయింది. ఒక దుష్ట శక్తి ప్రభావంలో ఉన్న వ్యక్తి ఒక చిత్రాన్ని గీయడం, ఒక్కసారిగా అతని లోపల నుంచి ఒక భయంక రమైన శక్తి గబ్బిలం రూపంలో బయటకు వచ్చి మరో వ్యక్తి తలలోకి దూసుకెళ్లి అతన్ని చంపేయడం వెన్నులో వణుకుపుట్టించేలా వుంది. 'అతీంద్రియ శక్తులు మేల్కొన్నప్పుడు, సృష్టి ధర్మం తప్పినప్పుడు, విధి ఒక వృషకర్మని ఎంచుకుంటుంది' అనే వాయిస్ కథపై మరింత ఆసక్తిని పెంచింది. వృషకర్మ దుష్టశక్తిని ఎదుర్కొనేందుకు ముందుకు అడుగు వేస్తూ గ్లింప్స్ పూర్తి కావడం అదిరిపోయింది. ఈ గ్లింప్స్ భారీ స్కేల్, అద్భుతమైన విజువల్స్, గ్రిప్పింగ్ ప్రెజెంటే షనుతో ఆకట్టుకుంటోంది. ప్రతి ఫ్రేమ్లోనూ ఒక భారీ సినీమాటిక్ యూనివర్స్‌ను నిర్మించాలనే మేకర్స్ విజన్ స్పష్టంగా కనిపిస్తోం ది.నాగ చైతన్య రగ్గడ్, ఇంటెన్స్ అవతార్‌లో తన కెరీర్‌లోనే అత్యంత పవర్‌ఫుల్ ట్రాన్స్ఫర్మేషన్లలో కనిపించారు. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, రా, ఫియర్స్ లుక్ గ్లింప్స్‌కు ప్రత్యేకంగా నిలుస్తోంది. దుష్ట శక్తు లకు ఎదురొడ్డి నిలిచే యోధుడిలా ఆయన పాత్ర కనిపిస్తోంది. స్పర్ష్ శ్రీవాస్తవ పోషించిన భయంకరమైన విలన్ పాత్ర మరో హైలెట్. ఆయన టెర్రిఫిక్ ప్రెజెన్స్ కథలో ఇంటెన్స్ ఘర్షణకు సంకే తాలు ఇస్తోంది. అలాగే హీరోయిన్‌గా మీనాక్షి చౌదరి, జయరామ్ పోషించిన పాత్రను గ్లింప్స్‌లో కీలకంగా కనిపించాయి. దర్శకుడు కార్తిక్ దండు ఈ భారీ ప్రాజెక్ట్‌ను అన్నీ జాగ్రత్తలు తీసుకొని రూపొందిస్తున్నారు. సినిమాపై ఉన్న భారీ అంచనాలను అందుకు నేలా సినీమాటిక్ అనుభూతిని ఇవ్వనున్నారు.సినిమాటోగ్రాఫర్ రాహుల్ డి హెరియన్ అందించిన విజువల్స్ అద్భుతంగా కనిపిస్తుం డగా, ప్రొడక్షన్ డిజైనర్ నాగేంద్ర తంగాలా నిర్మించిన ప్రపంచం రిచ్గా అనిపిస్తోంది. అజినీస్ లోక్ నాథ్ అందించిన పవర్ఫుల్, హాంటింగ్ బ్యాగ్రౌంగ్ స్కోర్ గ్లింప్స్‌కు మరింత ఇంపాక్ట్ తీసుకొచ్చింది. ఎడిటర్ నవీన్ నూలి చేసిన షార్ప్ కట్స్ కూడా ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. మొత్తంగా వృషకర్మ ఫస్ట్ గ్లింప్స్ ఒక టెర్రిఫిక్ సినిమాటిక్ అనుభూతిని అందిస్తూ సినిమాపై అంచనాలను మరింత పెంచింది.ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో యువ సామ్రాట్ నాగ చైతన్య మాట్లాడుతూ వృషకర్మ గ్లింప్స్ లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. కార్తీక్ చెప్పినట్టు ఇది నా కెరీర్‌లో బెస్ట్ మూవీ కాబోతుంది. స్క్రిప్ట్ విన్నప్పుడే అనిపిం చింది. ఇంత పెద్ద స్కేల్‌లో మిథికల్ థ్రిల్లర్ సినిమా చేయాలని ఎప్పటి నుంచో ఉండింది. ఆ కోరిక ఈ సినిమాతో తీరింది. స్క్రిప్ట్ విన్నప్పుడే మైండ్ బ్లోయింగ్ అనిపించింది. కార్తీక్ బ్రిలియంట్ ఫిలిం మేకర్. కథ విన్నప్పుడే లార్జర్ దెన్ లైఫ్ సినిమా అనిపించింది. కార్తీక్ గురించి లైఫ్ లాంగ్ మాట్లాడుతూనే ఉంటాను. ఎందుకంటే తన అంత మంచి సినిమా ఇచ్చాడు. అంచ నాలన్ని టిని ఈ సినిమా అందు కుంటుంది. ఈ సినిమా చివరి 30 నిమిషాలు క్లైమాక్స్ ఇండి యన్ సినిమాలో ఒక బెంచ్ మార్క్ అవుతుంది. అది నా ప్రామిస్. స్పర్ష్ అద్భుత మైన పెర్ఫార్మెన్స్ ఇచ్చాడు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరె క్టర్ కార్తీక్ దండు , మ్యూజిక్ డైరెక్టర్ అజినిష్, లా పత్తా లేడీస్ సినిమా హీరో ,నటుడు స్పర్ష్ శ్రీ వాస్తవ, ప్రొడక్షన్ డిజైనర్ శ్రీ నాగేంద్ర పాల్గొన్నారు.



## మృత్యువులోనూ వీడని స్నేహం

(మొదటి పేజీ తరువాయి)

నుంచి బయలుదేరారు. కరీంనగర్ నుంచి ధర్మారం వైపు వెళ్తున్న టిప్పర్ వాహనం వేగంగా వచ్చి ద్విచక్రవాహనానికి వెనుక వైపు నుంచి ఢీకొట్టడంతో బైక్‌పై నుంచి ఇద్దరు యువకులు కిందపడి పోయారు. అదే సమయంలో వారి తలలపై లారీ పోవడంతో ఆ ఇద్దరి స్నేహితుల తలలు నుజ్జు నుజ్జు కావడంతో ఆ ప్రాణ స్నేహి తులు ఇద్దరు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. స్నేహితుని వివాహానికి వెళ్తూ ఇద్దరు మృత్యువాత పడడంతో ఆ రెండు కుటుంబాలలో విషాదఛాయలు నెలకొన్నాయి. మృతి చెందిన సంఘటన వద్ద మృతుల బంధువులు చేసిన ఆర్తనాదాలు పలువు రిని కంటతడి పెట్టించాయి. బంగారు భవిష్యత్తు ఉన్న ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పలువురు కంటతడి పెట్టారు. సంఘటన స్థలానికి ఎస్సై నరేష్‌రెడ్డి చేరుకుని మృతులను పోస్టుమార్టం కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు చిలుక ప్రదీప్ కుమార్ తండ్రి చిలుక రాజేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాని ఎస్సై తెలిపారు. ఈ సంఘటన జరగడంతో రుక్మాపూర్ గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు నెలకొన్నాయి. టిప్పర్ డ్రైవర్ ధర్మారం మండల పరిధిలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన సాయవేణి ప్రవీణ్‌గా గుర్తించినట్లు ఎస్సై నరేష్ రెడ్డి తెలిపారు.

**సంతాపం తెలిపిన ఎమ్మెల్యే**

రుక్మాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు చిలుక ప్రదీప్ కుమార్ తాటికొండ సాయికిరణ్‌లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సంతాపాన్ని తెలిపి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ రోడ్డు ప్రమాదం దురదృ ష్టకరమని, మంచి భవిష్యత్తు ఉన్న యువకులు మరణం చెందడం కలిసి వేస్తుందని అన్నారు.

## దూసుకెళ్తున్న ఆర్ఎస్‌పి

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఎన్నికల ఫలితాలు నేపాల్ రాజకీయాల్లో పెద్ద మార్పుకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి. ఎన్నికల సంఘం వెల్లడించిన వివరాల ప్రకారం ఎన్నికలు జరిగిన 165 స్థానాల్లో కడపటి వార్తలు అందజేస రికి ఆర్ఎస్‌పి 114 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. మరోవైపు నేపాల్ కాంగ్రెస్ 10, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (యూనిఫైడ్ మార్క్సిస్ట్ – లెనినిస్ట్/ సిపిఎస్–యుఎంఎల్) 10, అలాగే ఇతర కమ్యూ నిస్టు పార్టీలు ఒక్కోటి కేవలం 8 స్థానాల్లో మాత్రమే ముందంజలో ఉన్నాయి. ఈ పరిస్థితి చూస్తే ఆర్ఎ స్‌పి భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చే అవకా శాలు బలంగా కనిపిస్తున్నాయి. బలేంద్ర షా నేపాల్ రాజకీయాల్లో ఒక కొత్త తరహా నాయకు డిగా గుర్తింపు పొందారు. ఆయన మొదట సంగీత రంగంలో ర్యాపర్‌గా పేరు సంపాదించారు. తరు వాత రాజకీయాల్లోకి ప్రవేశించి ఖాట్మండు నగర మేయర్‌గా ఎన్నికయ్యారు. నగర పాలనలో అవి నీతి వ్యతిరేక చర్యలు, పారదర్శక పాలన వంటి అంశాలపై ఆయన చేపట్టిన చర్యలు యువతలో మంచి ఆదరణ పొందాయి. ఈ ప్రజాదరణను ఆధారంగా చేసుకుని ఆయన పార్టీ ఎన్నికలలో ప్రధాన శక్తిగా ఎదిగింది. ఎన్నికలలో షా స్వయంగా ఝూమా జిల్లాలోని ఝూపా–5 నియో జకవర్గం నుంచి పోటీ చేశారు. ఇది నాలుగు సార్లు ప్రధానమంత్రిగా పనిచేసిన కె.పి. శర్మ ఓలి బల మైన రాజకీయ స్థావరం కావడం గమనార్హం. అయినప్పటికీ మొదటి లెక్కింపు దశల్లో షా సుమారు 6,000 పైగా ఓట్లతో ముందంజలో ఉండగా, ఓలి కేవలం వెయ్యి పైగా ఓట్లు మాత్రమే పొందినట్లు సమాచారం. ఇది నేపాల్ రాజకీ యాల్లో పాత నాయకత్వానికి వ్యతిరేకంగా కొత్త తరానికి మద్దతు పెరుగుతున్న సంకేతంగా భావిస్తు న్నారు. ఇలావుంటే, ఈ ఎన్నికలను భారత్ కూడా అత్యంత సమీపంగా గమనిస్తోంది. భారత్–నేపాల్ సంబంధాలు చారిత్రక, సాంస్కృతిక, ఆర్థిక పరంగా ఎంతో ముఖ్యమైనవి. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ పిటిఐతో మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండు దేశాల మధ్య ఉన్న బహుముఖ సంబంధా లను మరింత బలోపేతమవుతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. భారత్ ఎప్పటికప్పుడు నేపాల్‌లో శాంతి, అభివృద్ధి, స్థిరత్వానికి మద్దతు ఇచ్చిందని పేర్కొ న్నారు. ఎన్నికల నిర్వహణలో అవసరమైన కొన్ని సాంకేతిక, సరఫరా సహాయాన్ని కూడా భారత్ అందించిన విషయాన్ని గుర్తించారు.

ఈ ఎన్నికల్లో సుమారు 60 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించారు. నేపాల్ పార్ల మెంట్ దిగువ సభ అయిన ప్రతినిధుల సభకు మొత్తం 275 మంది సభ్యులను ఎన్నుకుంటారు. అందులో 165 మంది ప్రత్యక్ష ఓటింగ్ పద్ధతిలో ఎన్నికవుతారు. మిగిలిన 110 స్థానాలను అను పాత ప్రతినిధిత్వ పద్ధతిలో కేటాయిస్తారు. ప్రత్యక్ష ఎన్నికల కోసం సుమారు 3,400 మంది అభ్య ర్థులు పోటీ చేయగా, అనుపాత పద్ధతిలో 3,100 కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

## వందే భారత్ రైళ్ల సమయాల్లో మార్పు

సిపిఆర్ఓ శ్రీధర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నడిచే కొన్ని వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సమయాలను సవరించినట్లు రైల్వే సిపిఆర్ఓ ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మార్పులు ఈ నెల 15 నుంచి అమల్లోకి వస్తా యని పేర్కొన్నారు. కాచిగూడ – యశ్వంత్‌పూర్ – కాచిగూడ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (రైలు నం. 20703/20704) రైళ్ల సమయాల్లో మార్పులు చేశారు. యశ్వంత్‌పూర్ – కాచిగూడ (20704) రైలు హిందూపూర్ స్టేషన్‌కు ఇప్పటివ రకు మధ్యాహ్నం 3.48కు చేరుకుని 3.50కు బయలుదేరుతుండగా, సవరిం చిన సమయాల ప్రకారం 3.55కు చేరుకుని 3.57కు బయలుదేరుతుంది. అలాగే కాచిగూడ–యశ్వంత్‌పూర్ (20703) రైలు హిందూపూర్ స్టేషన్‌కు ప్రస్తుతం 12.08కు చేరుకుని 12.10కు బయలుదేరుతుండగా, కొత్త సమ యాల ప్రకారం 12.17కు చేరుకుని 12.19కు బయలుదేరుతుంది.ఇక ఎస్ఎ మ్‌వీటీ బెంగళూరు – కలబుర్గి – ఎస్ఎమ్‌వీటీ బెంగళూరు వందే భారత్ ఎక్స్ ప్రెస్ (రైలు నం.22231/22232) రైళ్ల సమయాల్లో కూడా మార్పులు చేశారు. కలబుర్గి – ఎస్ఎమ్‌విటి బెంగళూరు (22231) రైలు శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం స్టేషన్‌కు ఇప్పటివరకు 11.00కు చేరుకుని 11.02కు బయలుదేరు తుండగా, సవరించిన సమయాల ప్రకారం 11.13కు చేరుకుని 11.15కు బయలుదేరుతుంది. అలాగే యెలహంక స్టేషన్‌కు ప్రస్తుతం 12.28కు చేరుకుని 12.30కు బయలుదేరుతుండగా, కొత్త సమయాల ప్రకారం 12.58కు చేరు కుని 1.00 గంటలకు బయలుదేరుతుంది.అలాగే ఎస్ఎమ్‌విటి బెంగళూరు – కలబుర్గి (22232) రైలు యెలహంక స్టేషన్‌కు ప్రస్తుతం 3.05కు చేరుకుని 3.07కు బయలుదేరుతుండగా, సవరించిన సమయాల ప్రకారం 3.09కు చేరు కుని 3.11కు బయలుదేరుతుంది. శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం స్టేషన్‌కు ప్రస్తుతం 4.23కు చేరుకుని 4.25కు బయలుదేరుతుండగా, కొత్త సమయాల ప్రకారం 4.45కు చేరుకుని 4.47కు బయలుదేరుతుంది.ఈ మార్పులను ప్రయాణికులు గమనించాలని దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎ. శ్రీధర్ తెలిపారు.

## ఫైళ్లను క్రమపద్ధతిలో భద్రపరచాలి

సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్.ప్రియాంక

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మాసాబ్ ట్యాంక్‌లోని సమాచార పౌర సంబం ధాల శాఖ కార్యాలయ ఆవరణలో సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్.ప్రియాంక మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో పరిసరాలతో పాటు కార్యాలయంలోని ప్రతి సెక్షన్ తనిఖీ చేసారు. అనంతరం అధికారులు సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి సెక్షన్‌లో ఉన్న ఫైళ్లను సక్రమంగా పరిశుభ్రంగా నిర్వ హించాలని, పెండింగ్‌లో ఉన్న ఫైళ్ళను త్వరితగతిన పరి ష్కరించాలని సూచించారు. నిర్దేశించిన కాలం అనం తరం పాత వార్షిక ఫైళ్లను స్టోర్ రూమ్ నందు క్రమపద్ధ తిలో భద్రపరచాలని తెలిపారు. బీరువాలు, డెస్కులలో రన్నింగ్ ఫైల్స్ మాత్రమే ఉండాలని స్పష్టం చేశారు. అధి కారులు సెక్షన్ ఉద్యోగులు గదులను, పరిసరాలను పరి శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్.జగన్, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజ నీర్ వి.రాధా కిషన్, ఆర్ఐలు జె.రాములు, పి.జయరాం మూర్తి, ఉప సంచాలకులు యం.మధు సూదన్, వై.వెంక టేశ్వర్లు, ఎస్.ఎ.హష్మి, రాజరెడ్డితో పాటు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## బ్లాక్ మార్కెట్‌కు మళ్లింపు

(మొదటి పేజీ తరువాయి)

దుకాణదారులు మేధావుల్లా వ్యవహరిస్తూ డిజిటల్ దొంగత నాలకు' తెరలేపారు. కొందరు పెస్టిసైడ్ షాపుల యజమా నులు అమాయక రైతుల పట్టాదారు పాసు పుస్తకాల జిరాక్స్ కాపీలను నమ్మబలికి సేకరించి, ఆన్‌లైన్ పోర్టల్‌లో వారి పేర్ల మీదనే యూరియా బుకింగ్‌లు పూర్తి చేసేస్తున్నారు.తీరా రై తు దుకాణానికి వెళ్తే ఆన్‌లైన్ సైట్‌లో స్టాక్'జీరో' అని చూ పిస్తు వెనక్కి పంపేస్తున్నారు. కానీ వెనుక దారిలో అదే బస్తా ల ను ఇతర అనవసరమైన పురుగుమందులతో ముడిపెట్టి, అధిక ధరలకు అమ్ముకుంటూ రైతుల పొట్ట కొడుతున్నారు. ఆన్‌లైన్ వ్యవస్థ రైతులకు రక్షణగా ఉండాల్సింది పోయి అక్ర మార్కుల చేతిలో దోపిడి ఆయుధంగా మారడం శోచనీయం.

**సిండికేట్ రాజకీయం –క్షేత్రస్థాయిలో అస్తవ్యస్తం..**

ఈ దోపిడి వెనుక బలమైన సిండికేట్ పని చేస్తోందన్న ఆరోప ణలు బలంగా వినిపిస్తున్నాయి. స్టాక్ పాయింట్ల నుండి పంపిణీ కేంద్రాల వరకు ప్రతి చోటా అక్రమార్కులు పాగా వేశారు. లారీల్లో వచ్చే లోడ్ గమ్యస్థానానికి చేరకముందే మధ్యలోనే దారి మళ్లుతోందని,రాత్రికి రాత్రే ప్రైవేట్ గోడౌ న్లకు తరలిపోతోందని సమాచారం నిబంధనల ప్రకారం విక్ర యించాల్సిన పాయింట్ ఆఫ్ సేల్ (పి.ఓ.ఎస్)యంత్రాలను పక్కనబెట్టి, కేవలం తమకు అనుకూలమైన వారికే ఎరువులు కట్టబెడుతుండటంతో సామాన్య రైతుకు చుక్కలు కనిపిస్తు న్నాయి. అధికారుల తనిఖీలు కేవలం మొక్కుబడిగా సాగు తున్నాయని, లోతైన విచారణ జరిపితే పెద్దల హస్తం బయట పడుతుందని స్థానికులు భావిస్తున్నారు.

**నిద్రపోతున్న నిఘా– అన్నదాత ఆగ్రహం..**

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తూ రైతును బలిపశువును చే స్తున్న ఈ మాఫియా వెనుక ఎవరు ఉన్నారనేది బహిరంగ రహస్యం. గంటల తరబడి ఎండలో నిలబడినా బస్తా యూరి యా దొరకని రైతు, రాత్రికి రాత్రి వేల బస్తాల మాయమవు తుంటే ఎవరికి చెప్పుకోవాలో తెలియక కుమిలిపోతున్నాడు. విచారణల పేరుతో కాలయాపన చేస్తూ,నివేదికలను బుట్టదా ఖలు చేస్తున్న క్షేత్రస్థాయి అధికారుల తీరుపై మండల రైతాం గం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతా ధికారులు ప్రత్యేక్షంగా రంగంలోకి దిగకపోతే, రైతు ఆగ్ర హం పెను ఉప్పెనలా మారుతుందని, వ్యవసాయ కార్యాల యాలను ముట్టడించడానికి కూడా వెనుకాడబోమని రైతులు హెచ్చరిస్తున్నారు.

**ప్రజాప్రతినిధుల మౌనం– విచారణకు డిమాండ్..**

బహిరంగంగానే దోపిడి జరుగుతున్నా ప్రజాప్రతినిధులు నో రు మెదపకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నా యి. ఓట్ల కోసం వచ్చే నాయకులు, రైతులు ఆపదలో ఉంటే కనీసం పలకరించకపోవడం వారి ద్వంద్వ నీతికి అద్దం పడు తోంది. ఈ మౌనం వెనుక వ్యాపారుల నుండి అందుతున్న 'నజరానాలు' ఉన్నాయా అన్న అనుమానాలు సామాన్య జ నాల్లో వ్యక్తం అవుతున్నాయి. వివిధ రాజకీయ పార్టీల నాయ కులు, రైతు సంఘాలు ఈ దందాను అరికట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. కేవలం జరిమానాలతో సరిపెట్టకుండా,అక్ర మాలకు పాల్పడుతున్న ఫెర్టిలైజర్ షాపుల లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేయాలని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## మమతా బెనర్జీ ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

ముందు లక్షలాది మంది చట్టబద్ధమైన ఓటర్ల ఓటు హక్కును తొలగించే రాజకీయ ప్రేరేపిత కసరత్తును ఎన్నికల కమిషన్ నిర్వహిస్తోందని ఆయన ఆరోపించారు. ఎన్నికల కమిషన్ సర్ అనంతర ఓటర్ల జాబితాను ప్రచురించిన కొద్ది రోజులకే ఈ నిరసన నాటకీయ రాజకీయ ఉద్ధృతిని తెలియ జేస్తుంది. ఫిబ్రవరి 28న విడుదలైన అధికారిక డేటా ప్రకా రం గత ఏడాది నవంబర్‌లో సర్ ప్రక్రియ ప్రారంభమైన ప్పటి నుండి 63.66లక్షల పేర్లు, అంటే దాదాపు 8.3శాతం ఓటర్లు తొలగించారు. దీని వలన ఓటర్ల సంఖ్య దాదాపు 7.66 కోట్ల నుండి 7.04 కోట్లకు తగ్గింది. అదనంగా, 60.06 లక్షలకు పైగా ఓటర్లను విచారణ విభాగంలో చేర్చారు. అంటే రానున్న వారాల్లో చట్టపరమైన పరిశీలన ద్వారా వారి అర్హత నిర్ణయిస్తారు. ఈ ప్రక్రియ నియోజకవర్గ స్థాయి ఎన్నికల సమీకరణాలను మరింత పునర్నిర్మించగ లదు. తొలగింపుల వల్ల మైనారిటీ ఓటర్లు, వలస కార్మి కులు, ఆర్థికంగా అణగారిన వర్గాలు అసమానంగా ప్రభావి తమయ్యాయని టిఎంసి నాయకులు ఆరోపించారు. 'ఒక కోటి మందికి పైగా ఓటర్లను తొలగించే లక్ష్యం ఈ ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందే నిర్ణయించబడింది' అని అభి షేక్ బెనర్జీ ఎన్నికల కమిషన్‌పై దాడిని తీవ్రతరం చేశారు. నిరసన స్థలం నుండి పార్టీ తదుపరి కార్యాచరణను టిఎంసి అధినేత ప్రకటిస్తారని ఆయన చెప్పారు. చట్టబద్ధమైన ఓట ర్లను తొలగించిన ఈ ప్రత్యేక ఇంటెన్సివ్ ఓటర్ల జాబితా సవ రణను మేము వ్యతిరేకిస్తున్నామని ఆయన అన్నారు.

## సోషల్ మీడియా వాడకంపై నిషేధం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన తెలిపారు. చాలా కాలంగా కర్ణాటక ఈ నిర్ణయం తీసు కోబోతుందంటూ ప్రచారం జరుగుతోంది. దీనిపై గతంలో రాష్ట్ర ఐటి మంత్రి ప్రియాంక్ ఖర్గే కూడా ప్రకటన చేశారు. విద్యా సంస్థల్లో సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధించే అంశంపై పలు యూనివర్సిటీల విసిలతో సిఎం సిద్ధరామయ్య ఇటీవల చర్చలు జరిపారు. విసిల దగ్గరినుంచి అభిప్రాయాలు సేకరించారు. కర్ణాటక ఆరోగ్య శాఖ మంత్రి దినేష్ గుండు రావ్ కూడా పిల్లలు సోషల్ మీడియా వాడటం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు బిజెపి నేతలు కూడా ఈ విషయంలో ప్రభుత్వానికి గతంలో పలు సూచనలు చేశారు. పిల్లలు సోషల్ మీడియా బారిన పడ కుండా చూడాలని బిజెపి నేత, ఎమ్మెల్యే సురేష్ కుమార్ కోరారు. ఈ నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్ దిశగా నిర్ణయం తీసుకుంది. ఇది ఎప్పటి నుంచి అమలవుతుందో తెలియాల్సి ఉంది. ఇక.. ఈ నిర్ణ యాన్ని అమలు చేస్తే దేశంలో పిల్లల సోషల్ మీడియా వాడ కంపై నిషేధం విధించిన తొలి రాష్ట్రంగా కర్ణాటక నిలుస్తుంది. ఎపి, గోవా ప్రభుత్వాలు దీనిపై ప్రతిపాదన చేసినా.. ఇంకా అమలు దిశగా ఏ నిర్ణయం తీసుకోలేదు. గత ఏడాది డిసెంబ ర్‌లో ఆస్ట్రేలియా దీనిపై నిర్ణయం తీసుకుని, ఇప్పటికే నిషే ధాన్ని అమలు చేస్తోంది. ఫిన్లాండ బ్రిటన్ కూడా పిల్లల సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధించే దిశగా ఆలోచన చేస్తు న్నాయి. అలాగే, అమెరికాలోని కొన్ని రాష్ట్రాలు సొంత చట్టా లతో పిల్లల సోషల్ మీడియా వాడకంపై నియంత్రణ విధిం చాయి. యూరప్‌లోని ఫ్రాన్స్, స్పెయిన్ వంటి దేశాలు కూడా పిల్లలు స్కూళ్లలో సోషల్ మీడియా, మొబైల్స్ వాడకంపై నిషేధం విధించాయి. పిల్లలు చదువుపై ఫోకస్ చేయాలని ఈ నిర్ణయాన్ని అమలు చేస్తున్నాయి. పిల్లలు ఎస్ఎం వాడటం వల్ల మానసిక ఒత్తిడి, ఆందోళనకు గురవుతున్నారు. నిద్ర లేమి, మానసిక సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. అయితే, ఇలా బ్యాన్ చేయడం వల్ల పూర్తి ఉపయోగం లేదని మరికొం దరు విమర్శిస్తున్నారు.

**90 రోజుల్లో శ్రీకారం చుడుతాం : ఎపి సిఎం**

పిల్లలు సోషల్ మీడియా వినియోగంపై సిఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. 13 ఏళ్లలోపు వారు సామాజిక మాధ్యమాలు వినియోగించకుండా నిషేధం విధించనున్నట్లు తెలిపారు. ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా శాసన సభలో చంద్రబాబు మాట్లాడారు. '13 ఏళ్ల లోపు వారికి సంబంధించి సోషల్‌మీడియా బ్యాన్ చేస్తే బాగుంటుందని సూచన వచ్చింది. ఆ వయసు లోపు వారికి సోషల్ మీడియా అందుబాటులో లేకుండా చేసే కార్యక్రమానికి 90 రోజుల్లో శ్రీకారం చుడతాం. 13–16 ఏళ్లలోపు వారికి సంబంధించి ఏం చేయాలన్నదానిపై అందరితో చర్చించి నిర్ణయం తీసు కుంటాం. సోషల్‌మీడియా వల్ల మన పిల్లలు నష్టపోకూడదు. దానికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది' అని సీఎం స్పష్టం చేశారు. టెక్నాలజీని వాడుకుంటే ఆయుధంగా పనిచేస్తుం దని, బానిసైతే జీవితాలు నాశనమవుతాయన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com